ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ ఏకాదశి, రా.7.15 వరకు అనంతరం ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ రా.8.58 వరకు, అనంతరం మూల; అమృతకాలం: మ.12.05 నుండి 1.45 వరకు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు; యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:57 • సంచిక:286 • గురువారం 31 జనవరి 2019 • హైదరాబాద్ • పేజీలు:12+12 • వెల: 5.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati |Kurnool |Anantapur|Nellore

నుమాయిష్ బుగ్గి



నాంపల్లి ఎగ్జిబిషన్‌లో అగ్నిప్రమాదం భారీగా ఆస్తి నష్టం

- ఆంధ్రాబ్యాంకు స్టాల్‌లో షార్ట్‌సర్క్యూట్
- చుట్టుపక్కల షాపులకు విస్తరించిన అగ్నికీలలు
- భయంతో సందర్శకులు పరుగులు...
- స్వల్ప తొక్కిసలాట
- రంగంలోకి 10 ఫైర్ ఇంజన్లు
- స్టాల్స్ బుగ్గిపాలు
- ప్రమాద సమయంలో ఎగ్జిబిషన్‌లో 20వేల మందికిపైగా సందర్శకులు
- ప్రాణనష్టం లేదు.. ఆరేడుమంది అస్వస్థతకు గురయ్యారు
- కోట్ల రూపాయల్లో ఆస్తి నష్టం
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : దేశవ్యాప్తంగా పేరు ప్రతిష్టలున్న నాంపల్లి ఎగ్జిబిషన్ (నుమాయిష్) గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో సందర్శకులంతా బయటకు పరుగులు దీశారు. ప్రమాదం జరిగినప్పుడు దాదాపు 20 వేల మంది సందర్శకులు గ్రౌండ్స్‌లో ఉండగా వారంతా ఒక్కసారిగా బయటకు వచ్చేందుకు ప్రయత్నించడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. భారీఎత్తున ఎగసిన అగ్నికీలల్లో స్టాల్స్ దగ్ధమై బూడిదికుప్పలుగా మారిపోయాయి. కోట్లలో ఆస్తినష్టం సంభవించగా అదృష్టవశాత్తు ప్రాణనష్టం సంభవించలేదు. కాగా ప్రమాదం జరిగిన విషయం తెలిసినవెంటనే జనం ఒక్కసారిగా బయటకు రావడంతో నాంపల్లి నుంచి ఆబిడ్స్ వరకూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎగ్జిబిషన్‌లోని ఆంధ్రాబ్యాంక్ స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మొదలైన మంటలు క్షణాల్లో చుట్టుపక్కల షాపులకు వ్యాపించాయి. అగ్నికీలలు ఎగిసిపడటంతో సందర్శకులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. అంతలోనే తేరుకుని భయాందోళనలతో బయటకు పరుగులు దీశారు. ఈ క్రమంలో ఎగ్జిబిషన్ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్‌లవద్ద కొంత బయటకు వెళ్లే క్రమంలో సందర్శకులు ఇబ్బందులు పడాల్సివచ్చింది. అగ్నిప్రమాద వార్త తెలిసిన వెంటనే నాలుగు ఫైరింజన్లు ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పే పనిలో పడ్డాయి. కొద్దిసేపటి తరువాత మరో ఆరు ఫైరింజన్లు అక్కడకు చేరుకుని పనిలోపడ్డాయి. ఈలోగా స్టాల్స్ ఆహుత య్యాయి. ప్రమాద వార్త తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ డిజార్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు వచ్చారు. గ్రౌండ్‌లో ఉన్నవారిని బయటకు పంపేందుకు అధికారులు కృషి చేశారు. వీలైనన్ని ప్రవేశ ద్వారాల కల్పన ద్వారా వారిని బయటకు పంపేశారు. పక్కపక్కనే షాపులుండటం, గడ్డి కూడా ఉండటంతో మంటలు ఉవ్వెతున ఎగిసిపడ్డాయి. ప్రమాదం సంభవించి ఒకవైపు భారీస్థాయిలో మంటలు ఎగిసిపడుతున్న తరుణంలోనే సందర్శకులు బయటకు సురక్షితంగా వెళ్లడంతో పెను ప్రమాదమే తప్పినట్లయింది. ఆ తరువాత కొద్దిసేపటికే ఎగ్జిబిషన్ గ్రౌండ్ మొత్తం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఆయా షాపులలో ఉంచుకున్న సామాగ్రి మొత్తం అగ్నికి ఆహుతయ్యింది. అగ్నికి అంటుకునే దుస్తులు, చెప్పులు, వెదురు సామాన్లు విక్రయించే దుకాణాలు ఎక్కువగా ఉండటంతో ➪ 3వ పేజీలో...



మహారాష్ట్రకు ఆదర్శం కేసీఆర్ కిట్

బేబీకేర్ కిట్‌తో ప్రారంభం.. మొదటి బిడ్డకే వర్తింపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోనే ప్రప్రథమంగా తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన 'కేసీఆర్ కిట్' పథకాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంది. ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించిన శిశువులకు 'బేబీ కేర్ కిట్' పేరుతో మంగళవారం కొత్త పథకాన్ని ప్రారంభించింది. కుటుంబంలో మొదటి బిడ్డకు మాత్రమే పథకాన్ని వర్తింపజేశారు. ప్రతియేటా సుమారు నాలుగు లక్షల మందికి ఈ పథకం లబ్ధి చేకూరుస్తుందని ఆ రాష్ట్ర మంత్రి పంకజ్ ముండే తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రారంభ కార్యక్రమంలో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బేబీ కేర్ కిట్ పథకం అమలుకు రూ.20 కోట్లు కేటాయించారు. లబ్ధిదారుల సంఖ్య పెరిగే కొద్దీ నిధుల కేటాయింపు పెంచుతామని చెప్పారు. ఇప్పటికే దేశంలో పలు రాష్ట్రాలకు రైతుబంధు, రైతు బీమా పథకం ఆదర్శంగా నిలిచిన విషయం విదితమే.



బేబీకేర్ కిట్ పంపిణీ చేస్తున్న మహారాష్ట్ర మంత్రి పంకజ్

ముక్కులో ట్యూబుతోనే బడ్జెట్ ప్రసంగం



పనాజీ: కొద్దిమాసాలుగా తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ బుధవారం అసెంబ్లీకి వచ్చారు. తానే ఆర్థికమంత్రి కూడా అయినందున బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్నానంటూ లోగొంతుకతో సభకు విన్నవించిన పారికర్, ముక్కులో ట్యూబ్ ఉంచుకునే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఉద్యుక్తుడయ్యారు. ఇద్దరు వ్యక్తిగత సహాయకుల చొరవతో మొత్తం బడ్జెట్ ప్రసంగాన్ని సభలో చదివి వినిపించారు. జీరబోయిన స్వరంతో ప్రసంగించినా, ఆద్యంతం పదునైన వ్యాఖ్యలతో తనదైన జోష్‌ను ప్రదర్శించారు. ప్రస్తుత పరిస్థితులు సవివరంగా బడ్జెట్ చదివేందుకు సహకరించడం లేదు. అయినా, నాలోని అమితమైన జోష్ కారణంగానే హోష్‌తో ఉన్నానని పేర్కొన్నారు. తద్వారా ఇటీవల జోష్ ఎలా ఉంది? అంటూ ఎద్దేవా చేసిన కాంగ్రెస్‌కు ధీటైన ➪ 9వ పేజీలో...

సీతారామ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్

- 1,531 హెక్టార్ల భూమి రాష్ట్రానికి అప్పగింత
- ప్రత్యామ్నాయ భూముల్లో అడవులను అభివృద్ధి చేయాలని కేంద్రం షరతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటైన సీతారామ ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతులు వచ్చేశాయి. ఇదివరకే పనులకు అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇపుడు పూర్తిస్థాయిలో అనుమతి ఇచ్చింది. ఈ మేరకు బుధవారం కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ రాష్ట్రానికి లేఖ పంపించింది. ఈ ప్రాజెక్టుకోసం 1531 హెక్టార్ల అటవీ భూమిని అటవీశాఖ కేటాయించింది. ప్రత్యామ్నాయ భూముల్లో అడవులను అభివృద్ధి చేయాలన్న షరతులతో తుది అనుమతి ఇచ్చారు. కెనాల్స్, టన్నెల్స్, పవర్ లైన్స్, నిర్మాణం కోసం అటవీ శాఖకు చెందిన 5 డివిజన్లల్లో భూములను కేంద్రం రాష్ట్రానికి అప్పగించింది. మనుగూరు, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, ఖమ్మం ఫారెస్ట్ డివిజన్లలో ఈ ప్రాజెక్టు కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.



నాబార్డు క్రెడిట్ సెమినార్‌లో సీఎస్ జోషి, విజయ్ కుమార్, పార్థసారధి

నాబార్డు రుణ ప్రణాళిక లక్ష కోట్లు!

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యత
- గ్రామీణ మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- స్టేట్ క్రెడిట్ సెమినార్‌లో వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయ, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధిలో కీలక భాగస్వామ్యం పంచుకుంటున్న కేంద్ర ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థ నాబార్డు 2019-20కి రుణ ప్రణాళికను ప్రకటించింది. ఇందుకు సంబంధించి బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధ్యక్షతన జరిగిన క్రెడిట్ సెమినార్‌లో నాబార్డు తెలంగాణ ప్రాంతీయ కార్యాలయ చీఫ్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ రూ.1,01,378 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను వెల్లడించారు. పంటల ఉత్పత్తి, మార్కెటింగ్, నిర్వహణ రంగాల్లో రూ.49,785 కోట్లు, జల వనరుల అభివృద్ధికి రూ.911 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.2,833 కోట్లు, ఉద్యాన, పట్టు పరిశ్రమ పంటల విస్తీరణకు రూ.1,259 కోట్లు, అడవుల అభివృద్ధి, బంజరు భూముల అభివృద్ధికి రూ.99 కోట్లు, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రూ.1,776 కోట్లు, కోళ్ళ పరిశ్రమ అభివృద్ధికి రూ.857 కోట్లు, పశు గణాభివృద్ధి, గొర్రెలు, మేకలు, పందుల పెంపకం ప్రోత్సాహకానికి రూ.1,070 కోట్లు, మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రూ.120 కోట్లు, పంట రుణాలు, ఇతర కార్యక్రమాలకు రూ.2,741 కోట్లు, మొత్తం వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ.61,458 కోట్ల రుణాలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు క వాడా రుణాలు మంజూరు చేయాలని ఈ సదస్సులో నిర్ణయించారు. వ్యవసాయ మార్కెట్లలో మౌలిక సదుపాయాలు, గోదాముల నిర్మాణం తదితర కార్యక్రమాలకు రూ.1,402 కోట్లు, భూముల అభివృద్ధి, వాటర్ షెడ్ల అభివృద్ధికి రూ.528 కోట్లు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలకు రూ.389 కోట్లు, మొత్తం రూ.2,318 కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. అలాగే ఫుడ్ అండ్ ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పేందుకు రూ.1,146 కోట్లు, ఎగుమతులు, ఇతర కార్యక్రమాలకు రూ.6,043 కోట్లు, మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ అభివృద్ధికి రూ.21,065 కోట్లు, గ్రామీణ విద్యాభివృద్ధికి రూ.2,009 కోట్లు, గ్రామీణ గృహనిర్మాణ రంగానికి రూ.5,835 కోట్లు, సాంప్రదాయేతర ఇంధన వనరుల అభివృద్ధికి రూ.317 కోట్లు, సామాజిక ➪ 2వ పేజీలో...



నేటి నుంచి పార్లమెంట్



మోడీ ప్రభుత్వానికి చివరి బడ్జెట్

- పార్లమెంటు సమావేశాలకు సహకరించండి
- అఖిలపక్ష భేటీ నిర్వహించిన స్పీకర్
- ఏపీకి న్యాయం చేయాలని కోరిన టీడీపీ పక్షనేత తోట నరసింహ

2 లో

పంచాయతీల్లో పాగా

టీఆర్‌ఎస్ తీన్మార్!

7 లో

పంచాయతీ ఫైట్‌లో గులాబీ గుబాళింపు

మూడు దశల్లో కలిపి	ఆఖరి విడతలో
8,000	2,382
పంచాయతీలు కైవసం	గ్రామపంచాయతీల్లో గెలుపు

ఆస్క్ ఆన్ ట్విట్టర్‌లో నిజామాబాద్ ఎంపీ కవిత





- తెలంగాణాపై ప్రధాని మోడీ వివక్ష
- కేసీఆర్ ఏం చేసినా చంద్రబాబుకు అక్కసు
- అరునూరైనా పసుపు బోర్డు సాధిస్తా
- ట్విట్టర్ వేదికగా ఆస్క్ ఎంపీ కవిత

భవిష్యత్ ఫెడరల్ ఫ్రంట్‌దే!

నిజామాబాద్, ప్రభన్యూస్ బ్యూరో: మునుముందు జాతీయ రాజకీయాల్లో టీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలోని ఫెడరల్ ఫ్రంట్ కీలక పాత్ర పోషించనుందని, కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలతో ప్రజలు విసిగిపోయారని, వారికి తమ ఫ్రంట్ ఆశాదీపమని ఆమె అభిప్రాయపడ్డారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని తిలక్‌గార్డెన్‌లో ట్విట్టర్ వేదికగా జరిగిన ఆస్క్ ఎంపీ కవిత కార్యక్రమంలో ➪ 2వ పేజీలో...

యాంకరమ్మడూ.. కురచ దుస్తులు కుదరవ్!



మనదగ్గర టీవీల్లో వందల చానల్స్ అందుబాటులో ఉండి ఎలా జనాదరణ పొందుతున్నాయో... అలాగే చైనాలో వెబ్ లైవ్ చానల్స్‌కు మంచి ఆదరణ ఉంది. దీంతో రెచ్చిపోతున్న వెబ్‌కాస్ట్ చానల్స్ కాస్త అదుపుతప్పి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. దీంతో అక్కడి ప్రభుత్వం కన్నెర్ర చేసి రాక్... అలా కుదర్దని హెచ్చరించి కఠిన నిబంధనలు విధించింది. ఇంతకీ అక్కడే జరిగిందంటే... ఇదీ సంగతి.. చైనాలో వెబ్‌కాస్ట్ లైవ్ చానల్స్ విస్తృత జనాదరణ పొందాయి. అందమైన యాంకర్లు, ప్రజెంటర్లు హొయలొలుకుతూ వార్తలు, ఇతర కథనాలు గలగలా చెబుతూంటారు. పొట్టి, తేలికపాటి, పారదర్శక దుస్తులు వేసుకుని అందరినీ కళ్లు తిప్పుకోకుండా చేస్తున్నారు. ఇది పెద్దలకు కోపం తెప్పిస్తోంది. దీంతో ప్రభుత్వం రంగంలోకి దిగింది. ముఖ్యంగా చైనాలోని హుబే ప్రావిన్స్‌లో ఈ చానల్స్‌లో యాంకర్ల సెక్సీ డ్రెస్‌లపై నిషేధం విధించారు. దేశంలో ఇలాంటి నిబంధనలు అమలు చేయడం ఇదే ప్రథమం. ముఖ్యంగా నాలుగు రకాల ఆంక్షలను విధించారు. సెక్సీ యూనిఫామ్‌లు, కురచ దుస్తులు, పొట్టి అండర్‌వేర్‌లు, పారదర్శక దుస్తులు, రక్తమాంసాలను గుర్తుకుతెచ్చే రంగుల దుస్తులు వేసుకుంటే ఇక ఒప్పుకోరు. ఒకవేళ ఇలాంటి దుస్తులతో యాంకరమ్మలు ఆయా చానల్స్‌లో కనిపిస్తే... దానిపై ఫిర్యాదు అందింతే.. 90 సెకన్లలో ఆ చానల్ మూసేయాల్సిందే. ఈ కొత్త నిబంధనల గురించి ప్రభుత్వ అధికార వార్తాసంస్థ జిన్‌హువా వెల్లడించింది. చైనాలో ఈ తరహా వెబ్ లైవ్ చానల్స్‌ను చూసేవారి సంఖ్య 100 మిలియన్లపైమాటే. ఈ చానల్స్ ద్వారా జరిగే వ్యాపారం ఏటా 3.3 బిలియన్ పౌండ్లు. గత ఏడాదిలో ఈ మార్కెట్ వృద్ధి 32 శాతం నమోదైంది. దీంతో ఆయా చానల్స్‌లో శృంగార దుస్తులతో యాంకరమ్మలు ప్రత్యక్షమవుతున్నారు. ఇది విమర్శలపాలైంది. ప్రఖ్యాత వుహాన్ వర్సిటీ సారధ్యంలో ప్రత్యేక అధ్యయనం చేసిన హుబే ప్రావిన్స్ అధికారులు చివరకు సెన్సార్ విధిస్తూ ఆంక్షలు తీసుకువచ్చారు.

ఆమెకూ ఆ ఐడియాలొస్తే..



సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ జోక్స్ పేల్చే మహీంద్రా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తాజాగా వదిలిన ఓ జోక్ బాగా పేలింది. ఆయన చైనాలోని ఓ హోటల్‌కు తన భార్యతో కలసి వెళ్లాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తానని ట్విట్టర్‌లో పోస్ట్ చేసి... దానికి ఓ ఫొటో జత చేశారు. అదిప్పుడు వైరల్ అయ్యింది. ఆ హోటల్ మెనూలో ఓ వంటకం పేరు డెలిసియష్ రోస్టెడ్ హజ్బెండ్ (బాగా వేయించిన భర్త). అసలు ఈ పేరు వింటేనే భయమేస్తోందని, ఆ వంటకం ఇంకె లా ఉంటుందోనని వ్యాఖ్యానించిన ఆనంద్ మహీంద్రా... తన భార్యతో కలసి వెళ్లే సాహసం చేయనని అన్నారు. ఆ వంటకం గురించి ఆమెకు తెలిస్తే... ఇలాంటి సృజనాత్మకమైన ఆలోచనలు ఆమెకూ వస్తాయేమోనన్న సందేహం వ్యక్తం చేస్తూ ఆయన ట్విట్టర్‌లో కామెంట్ పోస్ట్ చేశారు. ఇక అది వైరల్ అయ్యింది. తన ట్విట్టర్ వండర్ బాక్స్ నుంచి తరచూ ఇలాంటి హాస్య, వినూత్న అంశాలను అభిమానులకు పంచడం ఆనంద్‌కు అలవాటు. ఆయన తాజా పోస్ట్‌కూ వేలమంది లైక్ కొట్టి షేర్ చేయడం విశేషం.

భాషాపండితులకు తీపి కబురు

- త్వరలో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగా పదోన్నతికల్పించే హామీనెరవేర్చే దిశగా రాష్ట్రప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఓఎస్‌డి దేశపతిశ్రీనివాస్‌తో కలిసి పాఠశాల విద్య డైరెక్టర్ విజయ్‌కుమార్‌తో బుధవారం ఈ అంశంపై లోతుగా చర్చించామన్నారు. తమ ప్రతిపాదనలు వెంటనే ప్రభుత్వానికి నివేదిస్తానని విజయ్‌కుమార్ హామీనిచ్చారని పాతూరి తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వివిధ సబ్జెక్టుల స్కూల్‌అసిస్టెంట్ టీచర్ల తరహాలోనే భాషాపండితులకు పదోన్నతి కల్పించే విషయమై ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు ఇచ్చిన హామీలకు అనుగుణంగా చర్యలు ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలోనే భాషాపండితులు తీపికబురు వింటారన్నారు.

స్పైడర్ బ్యాంకర్



బ్రెజిల్ : సాధారణంగా బ్యాంక్ ఉద్యోగులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తుంటారు. దుస్తుల విషయంలోనూ పద్ధతిగా నడుచుకుంటారు. బ్రెజిల్‌లో మాత్రం ఓ బ్యాంక్‌ఉద్యోగి వినూత్నతను ప్రదర్శించాడు. సావో పౌలోని బ్యాంక్‌లో పనిచేస్తున్న వ్యక్తి ఉద్యోగానికి రాజీనామా చేసి లాస్ట్ వర్కింగ్ డే లో స్పైడర్ మేన్ అవతారమెత్తాడు. స్పైడర్ మేన్ డ్రెస్‌తో వచ్చి తోటి ఉద్యోగులను ఆశ్చర్యపరిచాడు. చివరి పనిదినం రోజు అందరికీ స్వీట్స్ పంచాడు. ఇష్టమైన వారిని చివరిసారిగా ఆలింగనం చేసుకున్నాడు. బ్యాంకర్ వేషాధారణతో అవాక్కైన సహోద్యోగులు అతని రూపాన్ని సెల్‌ఫోన్లలో బంధించారు. స్పైడర్ మేన్ వేషంలోనూ అతడు తన విధులను నిర్వహించిన తర్వాత కాసేపు సహోద్యోగులతో చిట్ చాట్ చేశాడు.. కస్టమర్లతోనూ సంభాషించాడు. 51 సెకన్ల నిడివి గల స్పైడర్ బ్యాంకర్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎవరైనా ఉద్యోగి తమ సేవలను పూర్తిగా ముగించుకుని వెళ్లాలనుకుంటే.. వారి చివరి పనిదినంలో ఇష్టమొచ్చిన డ్రెస్‌తో వచ్చే వెసులుబాటును కల్పించామని బ్యాంక్ అధికారులు తెలిపారు.



చలి పంజా

- వణుకుతున్న తెలుగురాష్ట్రాలు
- మరో రెండు రోజులపాటు అతిశీతల గాలుల ప్రభావం
- కొన్ని ప్రాంతాల్లో పగటిపూట సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తం గడ్డకట్టేలా చలి తీవ్రత

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తీవ్రమైన చలి తెలుగు రాష్ట్రాలను వణికిస్తోంది. గత మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యల్పానికి పడిపోతున్నాయి. చలికాలం ఆఖరి సమయం అయినప్పటికీ పగటిపూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలలోపే నమోదవుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలు మొదలుకొని భయంకరమైన చలి ప్రారంభమైంది. ఈశాన్య తీరం నుంచి అతిశీతల గాలులు వీస్తున్నందున చలి తీవ్రత ఊహించనంతగా పెరిగిందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రభావం మరో రెండు రోజులపాటు ఉంటుందని అంచనా వేస్తున్నారు. లోతట్టు ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లోనైతే రాత్రిపూట ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడి పోతున్నాయి. దీంతో రాత్రివేళల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ళల్లోంచి బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. అతిశీతల గాలులు, వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల కారణంగా స్వైన్‌ఫ్లూ అతిత్వరగా విస్తరించే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సమయంలో ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా చలి గాలుల తీవ్రతను తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎదుర్కొంటున్నారు. గాలిలో తేమశాతం పెరిగిపోవడం, రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోవడం, సాయంత్రం మొదలుకొని ఉదయం 8 గంటల వరకు పొగమంచు కమ్ముకోవడం లాంటి ప్రతికూల పరిస్థితులతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్య కూలీలు, చిరు వ్యాపారులు, భవన నిర్మాణ, వ్యవసాయ కార్మికులకు చలి తీవ్రత శాపంగా మారుతోంది. ఎప్పుడూ సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యే హైదరాబాద్ నగరంలోనూ విపరీతమైన చలి కనిపిస్తోంది. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉంటే ప్రధాన రహదారులు సైతం ఉదయం 11 గంటల వరకు ఖాళీగా కనిపిస్తున్నాయి. 30 డిగ్రీల వరకు నమోదయ్యే మధ్యాహ్న ఉష్ణోగ్రత 20 డిగ్రీలలోపు రికార్డవుతోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. గ్రామ శివార్లలో దట్టమైన పొంగమంచు వాహన చోదకులకు ఇబ్బందులు కలిగిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రత 5 డిగ్రీలలోపే నమోదైంది. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా కనిపిస్తోంది. విశాఖ జిల్లా లంబసింగిలో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. చలికి స్థానిక ప్రజలు అలవాటు పడినప్పటికీ ప్రస్తుతం ఉన్న తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. కొన్నిచోట్ల నీరు గడ్డ కడుతోంది. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని అటవీ, కొండ ప్రాంతాల్లో ఉదయం 11 గంటలు దాటితే కానీ రహదారులు కనిపించని పరిస్థితి నెలకొంటున్నాయి. మరోవైపు ఆకాశం కారుమబ్బులు కమ్ముకుని ఉండడంతో తీవ్రత మరింతగా పెరుగుతోంది.

భవిష్యత్ ఫెడరల్ ఫ్రంట్‌దే!



(మొదటిపేజీ తరువాయి)

భాగంగా ట్విట్టర్‌లో అడిగిన అనేక ప్రశ్నలకు ఆమె సమాధానాలు చెప్పారు. కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రియాంక పాత్ర, ప్రధాని మోడీ, ఏపీ సీఎం చంద్రబాబు సహా అనేక అంశాలపై అడిగిన ప్రశ్నలకు ఆమె స్పష్టంగా, సూటిగా సమాధానాలు చెప్పారు. పరిపాలనకు సంబంధించి ముఖ్యమంత్రి, గులాబీదళపతి కేసీఆర్‌కు పదికి వందమార్కులు వేస్తానన్న కవిత అనేక అంశాలపై స్పష్టమైన అభిప్రాయాలు వెల్లడించారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇవ్వడంలో అధికార పార్టీలు చట్టం చేయడంలో నిర్లక్ష్యం వహించాయని, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులు రాజకీయాల్లోకి రావడం అవసరమని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం చేసినా ఏపీ సీఎం చంద్రబాబు విమర్శలు చేస్తారని ఆమె అన్నారు.

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ నిన్నమొన్నటివరకు రాజకీయాలలో గెస్ట్‌రోల్ పోషించారని, నేడు ఆమెకు పర్మినెంట్ రోల్ ఇచ్చారని కవిత వ్యాఖ్యానించారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు వాగ్దానాలు నెరవేర్చాల్సిన బాధ్యతను ప్రియాంక తీసుకోవాలని కవిత సూచించారు. బాలికలకు పీజీ వరకు విద్యనందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుందని, బాలికలు వాళ్ళ కాళ్ళపై నిలబడే వరకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. జగిత్యాల్‌లో టీఆర్‌ఎస్ గెలుపు ప్రజలకే దక్కుతుందని, అక్కడ టీఆర్‌ఎస్ ప్రభంజనం వీచిందని అన్నారు. భారీ పరిశ్రమలే కాకుండా ఉద్యోగ అవకాశాల కోసం చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ఉచిత విద్యను కేజీ టూ పీజీ వరకు అందించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కవిత సమాధానం ఇచ్చారు. వైద్య రంగంలో ప్రతి నియోజకవర్గంలో వైద్యశాల ఏర్పాటుతో పాటు జిల్లాలో క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన చేస్తున్నారని చెప్పారు.

నిజామాబాద్‌లో వెయ్యి పడకల ఆస్పత్రి

నిజామాబాద్‌లో ఆసుపత్రిని వెయ్యి పడకలకు మార్చి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. క్రీడాకారులకు ప్రోత్సాహానిచ్చేందుకు కలెక్టరేట్ గ్రౌండ్‌తో పాటు మరో రెండు మినీ స్టేడియాలను ఏర్పాటు చేస్తామని విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

నర్సును కావాలనుకున్నా

మనం అనుకున్నది అనుకున్నట్లుగా జరుగదని ఒక ప్రశ్నకు సమాధానంగా కవిత చెప్పారు. చిన్నప్పుడు ఆసుపత్రుల్లో నర్సులను చూసి నర్సు కావాలని అనుకున్నానని, ఆ తర్వాత మహిళ పారిశ్రామిక వేత్త అవ్వాలనుకున్నానని ఈ రెండు కాకుండా అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడ్డానని చెప్పారు. ఉద్యమం నేపథ్యంలో ఉద్యోగం వదిలి వచ్చి రాజకీయాల్లో స్థిరపడ్డానని చెప్పారు. భవిష్యత్తు ఎలా ఉండబోతుందో చెప్పలేమని, రిటైర్మెంట్ మాత్రం లేదని ప్రజల కోసం ఏదో చేయాలని ఉందన్నారు. అనుకున్నవని అనుకున్నట్లు జరుగవని భవిష్యత్తు ఏమిటో కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు.

పసుపుబోర్డు హామీయే మిగిలింది

గత ఎన్నికల సందర్భంగా తానిచ్చిన హామీల్లో పసుపు బోర్డు ఒక్కటే మిగిలి ఉందని, మిగిలినవన్నీ అమలు చేశానని కవిత చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో పసుపు బోర్డు సాధిస్తానని చెప్పారు. రాబోయే ఐదేళ్ళలో ప్రథమ ప్రాధాన్యం పసుపు బోర్డు సాధనే అని స్పష్టం చేశారు. ఇళ్ళు లేని నిరుపేదలందరికీ తప్పకుండా ఇంటి నిర్మాణం చేయిస్తానని చెప్పారు. బెస్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జిల్లాగా నిజామాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు.

కేంద్రం శీతకన్ను

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మోడీ సర్కార్ ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, నీతి ఆయోగ్ సూచన ప్రకారం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథలకు భారీ ఎత్తున రూ.24 వేల కోట్ల సహాయం కేంద్రం అందించాలన్నారు.

ఎలా పనిచేస్తున్నామో చూడాలి

రాజకీయాల్లో కుటుంబ వారసత్వం, కుటుంబ పాలన అన్ని పార్టీలో ఉన్న సంప్రదాయమేనని, కాంగ్రెస్, బీజేపీలో కూడా వందకు పైగా నేతల కుటుంబాలు వారసత్వాన్ని కొనసాగిస్తున్నాయని కవిత అన్నారు. టీఆర్ఎస్ పార్టీకి ప్రత్యేకత ఉందని, తమ కుటుంబానికి చెంది అందరూ ఉద్యమం నుంచి రాజకీయాల్లోకి వచ్చామని గుర్తు చేశారు. ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనేది కాకుండా ఎంత బాగా పని చేస్తున్నారనే దానిపై దృష్టిపెట్టాలని ఒక ప్రశ్నకు సమాధానంగా కవిత చెప్పారు. బాగా పనిచేస్తే ఓట్లు వేయాలి, లేదంటే బయటకు పంపేయాలని సూచించారు.

ఎన్నికలవేళ బీజేపీ రామభక్తి

ఎన్నికలు వస్తేనే రామమందిరం తెరపైకి వస్తుందని దేవుడి నెత్తిన టోపీ పెట్టడానికి కూడా బీజేపీ వెనుకాడడం లేదని మండిపడ్డారు. దయచేసి మందిరం, మసీదు అనే రాజకీయాలు చేయరాదని ఈ సందర్భంగా ఆమె కోరారు.

నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు

ప్రజలను అమాయకంగా మోసం చేసే గల్ఫ్ నకిలీ ఏజెంట్లపై చట్టపరమైన చర్యలను మరింత కఠినతరం చేస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 420 కేసు నమోదుతో పాటు పాస్‌పోర్టును సీజ్ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టే విధంగా పోలీసులకు ఆదేశాలు ఇస్తామని కవిత అన్నారు. గ్రామీణ మహిళలకు చేతి నిండా పని కల్పించేందుకు ప్రత్యేక పథకం అమలుకు కేసీఆర్ రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. పెద్దపల్లి రైల్వేలైన్ పూర్తితో అనేక ఏళ్ళ కల నెరవేర్చానని చెప్పారు. తాగునీరును అందించామని సాగు విస్తీర్ణం పెంచామని, నిజాంసాగర్ కాలువల ఆధునీకరణ చేపట్టామని చెప్పారు.

నిజామాబాద్‌లో సిటీ బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. నిజామాబాద్‌కు నూతన మాస్టర్ ప్లాన్ అమలు చేసి 2050 వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఐటీ హబ్‌లో 20 కంపెనీలకు అవకాశం ఉంటే 60 కంపెనీలు పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చాయని, త్వరలో పనులు ప్రారంభమౌతాయన్నారు.

చిరంజీవి అంటే ఇష్టం

సినిమాలకు సంబంధించి చిరంజీవి తన అభిమాన నటుడని కవిత చెప్పారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం సైరా కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నానని ఆమె ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. యువత సెల్‌ఫోన్ వాడడంలో మంచిని వినియోగించి, కీడు చేసే వాటిని దూరంగా పెట్టాలని సందేశాన్నిచ్చారు.

కేసీఆర్‌కు 10కి వంద మార్కులు

10 మార్కులకు గాను నాన్న కేసీఆర్‌కు 100 మార్కులు వేస్తానని, భర్తకు 50 మార్కులు వేస్తానని ఓ విద్యార్థిని అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. కేటీఆర్‌కు, తన కుమారుడికి పదికి పది శాతం మార్కులు, స్నేహితులకు కూడా పది శాతం వేస్తానని చెప్పారు. ఇలా ట్విట్టర్ ద్వారా అనేక మంది అడిగిన ప్రశ్నలకు, వివిధ కళాశాల విద్యార్థులకు ఆసక్తికరంగా ఆస్క్ ఎంపీ కవిత కార్యక్రమంలో సమాధానం చెప్పారు.

పద్దుకు వేళాయె

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- అఖిలపక్ష సమావేశం నిర్వహించిన స్పీకర్
- ఏపీకి న్యాయం చేయాలని కోరిన టీడీపీ పక్షనేత తోట నరసింహం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : నేటి నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం సభ గురువారానికి వాయిదా పడనుంది. ఫిబ్రవరి 1, గురువారం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఈ బడ్జెట్ సమావేశాలు చిట్టచివరి కానున్నాయి. ఈ సమావేశాల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు, పౌరసత్వ చట్ట సవరణ బిల్లులను కేంద్రం పార్లమెంటు ముందుకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

సమావేశాలకు సహకరించండి: స్పీకర్ సుమిత్రా మహాజన్

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలన్నీ సహకరించాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ కోరారు. బుధవారం పార్లమెంట్ లైబ్రరీ భవనంలో స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ లోక్‌సభ పక్ష నేత మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, విజయ్‌గోయల్, టీడీపీ లోక్‌సభ పక్ష నేత తోట నరసింహం, వివిధ రాజకీయ పక్షాల నేతలు హాజరయ్యారు. ఏపీ విభజన చట్టంలో హామీల అమలు కోసం తాము గత అయిదేళ్లుగా పోరాడుతున్నామని, దానిపై కేంద్రం నుంచి సమాధానం ఇప్పించాలని స్పీకర్ సుమిత్రా మహాజన్‌ను కోరామని టీడీపీ లోక్‌సభ పక్ష నేత తోట నరసింహం చెప్పారు. రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, సహా విభజన చట్టం హామీలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై పార్లమెంటులో పోరాటం చేస్తున్నామని చెప్పారు. కేంద్ర అన్యాయం చేయడం వల్లే తాము ప్రభుత్వం నుంచి బయటికి వచ్చామని అన్నారు. విభజన చట్టం హామీలు అమలు చేయాలని, పెండింగ్ నిధులు ఇవ్వాలని కోరామని చెప్పామన్నారు. ఈ అంశాలపై కేంద్రానికి నివేదించాలని స్పీకర్‌ను కోరామన్నారు. ఏపికి కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసేలా చూడాలని స్పీకర్ ను అభ్యర్థించామని తెలిపారు.

తాత్కాలిక బడ్జెటే!

- కేంద్ర ఆర్థికశాఖ అధికార ప్రతినిధి జోషి స్పష్టీకరణ
- పూర్తిస్థాయి బడ్జెట్‌పై సమాచారం లేదన్న ఇతర అధికారులు

న్యూఢిల్లీ: కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై స్పష్టత వచ్చింది. ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్ తీసుకొస్తున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ వర్గాలు వెల్లడించాయి. ఓటాన్ అకౌంట్‌కు బదులుగా ఈసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉందంటూ వస్తున్న కథనాలను ఆర్థికశాఖ వర్గాలు తోసిపుచ్చాయి. రేపు పార్లమెంట్ ముందుకు వచ్చేది 2019-20 మధ్యంతర బడ్జెట్ అని ఆర్థికశాఖ అధికార ప్రతినిధి డీకే జోషి బుధవారం వెల్లడించారు. దీనిపై తమకు ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. పూర్తిస్థాయి బడ్జెట్ తెస్తున్నట్లు తమకైతే స్పష్టమైన సమాచారం లేదని మరొక అధికారి పేర్కొన్నారు. ఎన్నికలవేళ ఎన్డీయే సంప్రదాయాన్ని బ్రేక్ చేయనుందని, పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నదని వారం రోజులుగా మీడియాలో విస్తృత కథనాలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుబెట్టాయి. మధ్యంతర బడ్జెట్ సంప్రదాయాన్ని అధిగమించడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని మాజీ ఆర్థికమంత్రి, బీజేపీ సీనియర్ నేత యశ్వంత్‌సిన్హా నేరుగా విమర్శించారు. ఈ క్రమంలో ఆర్థికశాఖ వర్గాలు



ప్రకటనతో ఉత్కంఠకు తెరపడినట్లయింది.

ఎన్నికల సంవత్సరంలో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తాత్కాలిక లేదా ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తున్నది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఆ ప్రకారం పరిమిత కాలానికి ఖర్చులకు అవసరమైన బిల్లులను, అంటే పాలనాపరమైన వ్యయాలు, కొనసాగుతున్న పథకాలకు నిధుల కేటాయింపు వంటి వాటికి సంబంధించిన పద్దుకు పార్లమెంట్ ఆమోదం తెలపాల్సి ఉంటుంది. కొత్త పథకాలు లేదా సేవలతో కూడిన ఆర్థిక బిల్లును తేవడం వీలుకాదు. అరుణ్‌జైట్లీ చికిత్స నిమిత్తం అమెరికా వెళ్లినందున, ఆయన స్థానంలో ఆర్థికమంత్రిగా గోయల్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

నాబార్డు రుణ ప్రణాళిక లక్ష కోట్లు!

(మొదటిపేజీ తరువాయి)

మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.1,008 కోట్ల మొత్తాన్ని రాష్ట్ర రుణ ప్రణాళికలో పొందుపరిచారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళిక మొత్తం రూ.83,388 కోట్లు కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.1,01,378 కోట్లకు పెంచారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సి.పార్థసారధి, ఆంధ్రాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏకే రత్, ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుందరం శంకర్, తెలంగాణ ఎస్‌ఎల్‌బీసీ చైర్మన్, ఎస్‌బీఐ సీజీఎం జె.స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్ వైపు డీఎస్ చూపు?

- ఎంపీ కవితను కలిసిన డీఎస్ తనయుడు సంజయ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీఆర్ఎస్ తో విభేదించి కాంగ్రెస్‌కు సన్నిహితమైన టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ మళ్లీ గులాబీ గూటికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. బుధవారం టీఆర్ఎస్ ఎంపీ కవితతో డీఎస్ తనయుడు సంజయ్ భేటీకావడం ప్రాధాన్యం సంతరించుకుంది. డీఎస్ అండలేకుండానే ఇటీవల నిజామాబాద్ జిల్లాలో కవిత ఒంటిచేత్తో ఫలితాలు సాధించగా, తాజాగా ఆమె డీఎస్ విషయంలో ఎలా స్పందిస్తారోనన్న ఆసక్తి నెలకొంది.

3వేల కోట్లతో కొత్త సెక్రటేరియట్

- ఫిబ్రవరి 20న శంకుస్థాపన
- ఆలోగా హస్తిన పర్యటనకు సీఎం కేసీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో తలపెట్టిన నూతన సచివాలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చేందుకు కేంద్ర రక్షణశాఖ అంగీకరించడంతో పాటు న్యాయపరమైన అడ్డంకులు కూడా తొలగిపోవడంతో సీఎం కేసీఆర్ ముహూర్తం ఖరారు చేసుకున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు ఫిబ్రవరి 20న సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్‌లో శంకుస్థాపన చేయ నున్నారు. ఇప్పటికే ప్రకటించిన ప్రకారం 2020 నాటికి నిర్మాణాలు పూర్తి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నారు. విపక్షాల నుంచి ఎన్ని రకాలుగా విమర్శలు ఎదురైనా నూతన సచివాలయ నిర్మాణంపై ఏమాత్రం వెనుకడుగు వేయకూడదని సీఎం ధృడమైన సంకల్పంతో ఉన్నారు. అందుకోసం వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా రెండేళ్ళ కాల వ్యవధిలోగా నిర్మాణాలు పూర్తిచేసి ప్రతిష్టను నిలబెట్టుకోవాలన్న వ్యూహంతో ముందడుగు వేస్తున్నారు. దశాబ్దాల తరబడి కొనసాగిన ఉద్యమాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నిర్ణయం ఒక ప్రత్యేకతగా చరిత్రలో నిలిచిపోవాలన్న ఆలోచనతో, పట్టుదలతో నిర్ణయాలు తీసుకుంటు న్నారు. అందులో భాగంగానే పది జిల్లాలున్న రాష్ట్రాన్ని 31 జిల్లాలకు విస్తరించారు. త్వరలోనే అవి 33కు చేరుకోనున్నాయి. కొత్త జిల్లాల్లో కలెక్టరేట్ల నిర్మాణంతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం. నూతన సచి వాలయ నిర్మాణంతో రికార్డు సృష్టించేందుకు సువిశాల భవన సముదాయాల కోసం తన ఆలోచనలకు అనుగుణంగా నమూనాలను రూపొందించారు. దాదాపు ఏడాది కాలంగా కొనసాగిన కసరత్తు ప్రస్తుతం కార్యరూపం దాల్చనుంది.



ఒకే ఒక్కడు!

ఎక్కువ కాలం సీఎంగా పనిచేసిన తెలంగాణ నేత కేసీఆర్

- హైదరాబాద్, ఉమ్మడి ఏపీలలో అతడే టాప్
- బూర్గుల రికార్డ్ బ్రేక్ చేసిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రస్వప్నాన్ని సాకారం చేసిన మహా నాయకుడు కేసీఆర్ . సాధించిన రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఐదేళ్ళకాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అనేకరంగాల్లో ఆదర్శంగా నిలిపిన కేసీ ఆర్ ఇపుడు మరో రికార్డు క్రియేట్ చేశారు. హైదరాబాద్ స్టేట్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మరెవరికీ సాధ్యపడని రీతిలో అత్యధిక కాలం సీఎంగా సేవలందించిన తెలంగాణనేతగా ఖ్యాతి గడించారు. హైదరాబాద్ స్టేట్, ఉమ్మడి ఏపీతో కలిపి 1948నుండి ఇప్పటిదాకా కేవలం ఆరుగురు తెలంగాణనేతలు మాత్రమే ముఖ్యమంత్రులయ్యారు. అందులో హైదరాబాద్ స్టేట్‌కు బూర్గుల రామకృష్ణారావు 1948నుండి 1956వరకు సీఎంగా సేవలందించారు. 1701రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. గత 63ఏళ్ళుగా అదే రికార్డు. కాగా సీఎం కేసీఆర్ మంగళవారంతో దానిని బ్రేక్ చేశారు. ముఖ్యమంత్రిగా 1,702 రోజులు పూర్తిచేసుకుని సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావు, జలగం వెంగళ రావు, మర్రిచెన్నారెడ్డి, టి.అంజయ్య గతంలో ముఖ్య మంత్రులయ్యారు. కానీ వాళ్ళెవరూ బూర్గులరికార్డును బ్రేక్ చేయలేదు. సీఎం కేసీఆర్‌తోనే అది సాధ్యమైంది.

ఉమ్మడి ఏపీ చరిత్రలో

58ఏళ్ళ ఉమ్మడి ఏపీ చరిత్రలో కేవలం 10ఏండ్ల 195రోజులు మాత్రమే తెలంగాణ నేతలు సీఎంలుగా పనిచేశారు. వెంగళరావు 1,547రోజులు సీఎంగా పనిచేయగా, చెన్నారెడ్డి 1,329రోజులు, అంజయ్య 501, పీవీ నరసింహా రావు 468 రోజులు ముఖ్యమంత్రులుగా సేవలందించారు. చెన్నారెడ్డి 1978నుండి 1980వరకు 950రోజులు, 1989 నుండి 1990వరకు 379రోజులు సీఎంగా ఉన్నప్పటికీ బూర్గుల రికార్డు బ్రేక్‌కాలేదు. పీవీ నరసింహారావు, జలగం వెంగళ రావు, మర్రిచెన్నారెడ్డి, అంజయ్య వీరంతా 1971నుండి 1982వరకు ముఖ్యమంత్రులుగా సేవలందించారు. వారంతా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి ఏపీని 16ఏళ్ళ 89రోజులు పాలించగా, తెలంగాణకు చెందిన ఏ ఒక్క నాయకుడినీ సీఎం చేయలేదు.





నుమాయిష్ బుగ్గి





భారీగా ఆస్తినష్టం

- సకాలంలో రాని ఫైరింజన్లు
- ఇప్పట్లో కోలుకోలేమంటున్న దుకాణదారులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందా? లేక సంఘ విద్రోహ చర్య? అనే కోణంలో అటు బేగం బజార్ పోలీసులు, ఇటు అగ్నిమాపక శాఖ అధికారులు విచా రణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఈ తరహా అగ్ని ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ ఎగ్జిబిషన్ మైదానంలో ప్రత్యేకంగా ఫైర్‌స్టేషన్ ను, ఫైరింజన్లను సిద్దంగా ఉంచుతుంది. అయితే, ప్రమా దం జరిగిన తర్వాత కూడా సంఘటనాస్థలికి ఫైరింజన్లు చేరుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. బుధవారం ఈ

ప్రమాదమా? విద్రోహమా??

ప్రదర్శనను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావడం.. ఇంతలోనే అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఆందోళనకరంగా మారింది. ఎగ్జిబిషన్ ప్రారంభించిన తర్వాత ఎన్నడూ లేని విధంగా భారీ స్థాయిలో అగ్ని ప్రమాదం తొలిసారిగా సంభ వించింది. దీంతో ఈ ప్రమాదం నిజంగానే షార్ట్‌సర్క్యూట్ వల్లనే సంభ వించిందా? లేక సంఘ విద్రోహక చర్య కోణముందా? అన్న అంశంపైనా పోలీసులు దృష్టి సారించినట్లు సమా చారం.



400 స్టాల్స్ దగ్ధం

ఎగ్జిబిషన్ మొత్తంగా 2,500 స్టాల్స్ ఉండగా.. 400 స్టాల్స్ వరకూ అగ్నికి ఆహుతయ్యాయి. జమ్మూకాశ్మీర్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని తమ రాష్ట్రాల్లో ఉత్పత్తి చేస్తున్న వస్తువులు, వస్త్రాలు, ఇతరత్రా సరుకులను విక్రయిస్తుంటారు. స్టాల్స్‌కు అద్దె చెల్లించి వారు ఈ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. ఉన్నట్టుండి నుమాయిష్‌లో భారీ అగ్ని ప్రమాదం జరగడంతో ఒక్కసారిగా తామంతా ఉపాధి కోల్పో యామని, ఇప్పట్లో తాము తేరుకోలేమని, తెచ్చిన సరుకంతా కాలి బుగ్గయిందని కన్నీటి పర్యంతమయ్యారు. ఇదే సమయంలో అగ్నిప్రమాదం జరిగిన సమయంలో పక్కనే ఫైర్ ఇంజన్ ఉన్నా ప్రమాద ఘటనాస్థలికి చేరుకోవడంలో జాప్యం కూడా అగ్నికీలలు వ్యాప్తికి మరో కారణమని దుకాణదారులు ఆరోపిస్తున్నారు.

17 మందికి అస్వస్థత

మంటలతో వ్యాపించిన దట్టమైన పొగ అలుము కోవడంతో అక్కడే ఉన్న 17 మంది స్పృహ కోల్పోవడంతో వారిని హుటా హుటిని సమీపంలోని కేర్ ఆసుపత్రికి తర లించి చికిత్సను అందించారు. ప్రమాద ఘటన తెలిసిన వెం టనే హోం మంత్రి మహమూద్ అలీ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్, నగర మే యర్ బొంతు రామ్మో హన్, జీహెచ్‌ఎంసీ కమిష నర్ దానకిశోర్, పోలీసు కమి షనర్ అంజనీ కుమా ర్, అద నపు పోలీ సు కమిషనర్లు చౌహాన్, శిఖా గోయల్‌లు సంఘట నాస్థలికి చేరుకుని పరిస్థితిని అదుపు లోకి తెచ్చే ప్రయ త్నం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ అధ్య క్షుడు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ప్రమాద ఘటనపై ఆరా తీశారు. జరిగిన నష్టంపై అంచనా వేసి నివేదిక అందజే యాలని సొసైటీ కార్యదర్శిని ఆదేశించారు. జనవరి 1వ తేదీన మహమూద్ అలీ, ఈటల రాజేందర్‌లు ఈ పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభిం చా రు. 40 రోజుల పాటు సాగే ఈ ప్రదర్శనలో 29 రాష్ట్రాలకు చెందిన విక్రయదారులు పాల్గొంటారు.

ఉచితంగా ఐదు మెట్రో రైలు సర్వీసులు

ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చిన సందర్శకులను మెట్రో రైళ్ల ద్వారా వారి గమ్య స్థానా లకు పంపేందుకు అధికారులు కృషి చేశారు. అదనంగా ఐదు మెట్రో సర్వీసులను ఏర్పాటు చేసి సందర్శకులను గమ్యస్థానాలకు తరలించారు. అధికారులు దగ్గరుండి ప్రజలను గమ్యస్థా నాలకు చేర్చారు.

ప్రమాదానికి షార్ట్‌సర్క్యూటే కారణమా?

ఎగ్జిబిషన్ మైదానంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనకు షార్ట్‌సర్క్యూటే



కారణమని విద్యుత్ పంపిణీ అధికారులు భావిస్తున్నారు. ప్రదర్శనలో దుకాణాలను ఏర్పాటు చేసుకున్న నిర్వాహకులు వారు వాడే విద్యుత్‌కు సంబంధించిన స్థాయి కన్నా తక్కువ లోడ్ తీసు కోవడం కూడా ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. ఒ క విద్యుత్ వైర్ నుంచి మరో విద్యుత్ వైర్‌ను కలిపే సమయంలో దుకాణదారులు టేపును వేస్తారని, ఒక్కోసారి ఈ టేపు ఊడిపోయే ప్రమాదం కూడా ఉందని బుధవారం జరిగిన ఈ ఘటనకు ఇదొక కారణం కూడా కావచ్చని ఓ అధికారి వెల్లడిం చారు. విద్యుత్ విషయంలో అప్ర మత్తంగా ఉండాలని పదే పదే చెబుతున్నా దుకాణదారుడు ఆ విషయాన్ని పెడచెవిన పెడుతున్నారని పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్ నిర్వాహకుల నిర్వహణ లోపం

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎగ్జిబిషన్‌లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మరో సారి నిర్వాహణ లోపం బయట పడింది. ఎగ్జిబిషన్‌లో ఎలాంటి ఫైర్ ఇంజన్ లు ఏర్పాటు చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉంచి ఉంటే భారీ అగ్నిప్రమాదం సంభవించేది కాదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. చిన్న చిన్న దుకాణాల పేరుమీద లక్షలాది రుపాయలు అక్రమంగా దండుకుంటున్నారని, భద్రతపరంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపించారు. ఇక్కడ చాలా మంది అవినీతికి పాల్పడుతున్నారని, ఎగ్జిబిషన్ సొసైటీలో కట్టేది తక్కువైతే తమ నుండి లక్షల రుపాయలు అక్రమంగా వసూలు చేశారని బాధితులు ఆరోపించారు. ఇక్కడ నిర్వాహణ వ్యవస్థ మాఫియాగా తయారైందని బాధితులు తెలిపారు. చిన్నా చితక వ్యాపారాల నుండి లక్షల రుపాయలు వసూలు చేశారని ఆరోపించారు. కట్టుబట్టలతో సర్వం కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కన్నీటిపర్యంతమయ్యారు.

(మొదటిపేజీ తరువాయి)

మంటలు వేగంగా విస్తరించాయి. దీంతో దాదాపు అన్ని దుకాణాలు దగ్ధమైనాయి. ఘటనాస్థలానికి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు సైతం ఆగ్నిమాపక సిబ్బందికి సహకరిస్తున్నాయి. ఎంతలా మంటలను అదుపులోకి తెద్దా మనుకున్నా మంటలు విస్తరిస్తున్న క్రమంలో వాటిని అదుపులోకి తేవడం అగ్ని మాపక సిబ్బందికి సాధ్యపడటం లేదు. తొలుత నాలుగు ఫైరింజన్లు మాత్రమే మంటలను ఆర్పేందుకు ఘటనాస్థలికి చేరుకోగా.. అనంతర కాలంలో మరో ఆరు ఫైరింజన్లు వచ్చాయి. ఈ లోపు మంటలు చుట్టుపక్కల షాపులకు విస్తరించి అవి కూడా పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మొత్తంగా మంటలు వ్యాపిస్తున్న క్రమంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్నా మళ్లీ ఎగిసిపడుతుండటంతో అగ్ని మాపక సిబ్బంది పూర్తిగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. కాగా, పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేసే దిశగా అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారు. కాగా, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడం ఇదే తొలిసారి అని చెబుతున్నారు. ఈ స్థాయిలో అగ్ని ప్రమాదం సంభవించడం ఇదే ప్రథమమని అక్కడి స్థానికులు సైతం చెబుతున్నారు.



ఎగ్జిబిషన్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భయాందోళనకు గురైన సందర్శకులతో పాటు పలువురు

పలువురికి గాయాలు

భయంతో పరుగులు తీసే సమయంలో స్వల్పంగా తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు కాగా, దట్టంగా వ్యాపించిన పొగ ద్వారా 15 మందికి పైగా అస్వస్థతకు గురి కాగా వారందరినీ స్థానిక కేర్, ఇతర ఆస్పత్రులకు తరలించారు. ఎగ్జిబిషన్‌కు వచ్చిన సందర్శకులు వారి తమతమ గమ్య స్థానాలకు చేరుకోవడానికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. ఐదు మెట్రో రైళ్లను నాంపల్లి నుంచి ఎల్బీనగర్ వరకు ఏర్పాటు చేశారు. అర్థరాత్రి వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు. అగ్నిప్ర మాదం జరగడంతో నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు పెద్దఎత్తున ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

భారీగా ట్రాఫిక్ జామ్

- సందర్శకులకోసం మెట్రోరైళ్లు, ప్రత్యేక చర్యలు
- పోలీసుల తీరు అభినందనీయం
- ఘటనా స్థలాన్ని సందర్శించిన హోంమంత్రి
- బాధితులను ఆదుకుంటాం: మహమూద్ అలీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నుమాయిష్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించిన దరిమిలా షార్ట్‌సర్క్యూట్ సంభవించిన సమయంలో అక్కడే ఉన్న సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిపడినట్లు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎగ్జిబిషన్‌లో ఉన్న సందర్శకులంతా భయాం దోళనలతో బయటకు ఉరుకులు పరుగులు దీశారు. వీరంతా ఒక్కసారిగా ప్రధాన రహదారిపైకి రావడంతో నాంపల్లి నుంచి ఆబిడ్స్ వరకూ పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో అసలు ఏం జరిగిందోనన్న ఆత్రుత, ఆందోళన ప్రజల్లో నెలకొంది. మొత్తంగా ట్రాఫిక్ స్తంభించడంతో ఆయా మార్గాల గుండా వెళ్లే వాహన చోదకులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడ్డారు. మరోవైపు ఎగ్జిబిషన్‌ను సందర్శకులతో రోడ్డంతా నిండిపోయింది. వారిలో ద్విచక్రవాహనాలు, కార్లపై వచ్చిన వారు ఉన్నారు. వారంతా తమ వాహనాలను తీసుకుని తమ ఇళ్లకు చేరుకునేందుకు సైతం పలు అవస్థల పాలయ్యారు. కాగా సందర్శకుల వల్ల ట్రాఫిక్ జామ్ నెలకొన్న క్రమంలో మిగతా సందర్శకులను గమ్యస్థానాలకు చేర్చేందుకు ఐదు మెట్రో రైలు సర్వీసులను నడిపి తరలించారు. ఈ క్రమంలో ఆ మార్గం గుండా వెళ్లే వాహనచోదకులు మాత్రం గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుని పోయారు. పోలీసులు సైతం ఆ రోడ్డు కిరువైపులా ట్రాఫిక్‌ను పూర్తిస్థాయిలో స్తంభింపజేశారు. కాగా, అప్పటికే ఆ రోడ్డుపై వచ్చిన వాహన చోదకులు సైతం తమ గమ్యస్థానాన్ని చేరుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. అయితే సందర్శకులను మెట్రో రైలు ద్వారా తరలింపు ప్రక్రియ ప్రారంభించిన తర్వాత రోడ్డుపై రద్దీని నివారించిన ట్రాఫిక్ పోలీసులు తర్వాత ఆగి ఉన్న ట్రాఫిక్‌ని నెమ్మదిగా క్లియర్ చేశారు. దీంతో గంటల తరబడి వేచి ఉన్న వాహన చోదకులు బతుకు జీవుడా అంటూ తమ గమ్యస్థానానికి చేరుకున్నారు. మరోవైపు ఘటనాస్థలికి హోం మంత్రి మహమూద్ అలీ చేరుకున్న సమయంలో అగ్నిప్రమాదంలో తమ సర్వస్వం కోల్పోయిన బాధితులంతా మహమూద్ అలీకి తమ గోడును వెళ్లబుచ్చారు. ఈ క్రమంలో అధికారులు మహమూద్ అలీ వద్దకు బాధితులను వెళ్లనీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో బాధితులు ఆందోళనకు దిగారు. అయితే, ఘటనలో జరిగిన నష్టంపై పరిహారానికి సంబంధించి ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, పరిహారం ఏ విధంగా అందజేయాలన్న దానిపై ఆలోచించి ప్రమాదంలో నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని హోంమంత్రి మహమూద్ అలీ స్పష్టం చేశారు.









సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

గురువారం 31 జనవరి 2019


చరిత్రలో ఈరోజు

అందమైన బంద్!




మీరు మీర్జా గాలిబ్ ఆత్మను మళ్లీ బతికించారని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఒక సినీ నటిని ప్రశంసించారు. ఆమె సురయా జమాల్ షేక్. సంగీతంలో ఎలాంటి పరిజ్ఞానం లేకపోయినా సురయా స్టార్ సింగ్ అయ్యారు. గాయనిగా, నటిగా అసమాన ప్రతిభకనబర్చిన సురయా నేటి పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో 1929లో జన్మించారు. అక్కడి నుంచి బాంబేలోని జేబీ పీటిట్ హైస్కూల్‌లో చదువుకున్నారు. బాలనటిగా సినీ రంగ ప్రవేశం చేసిన సురయా.. తాజ్ మహల్ సినిమాలో ముంతాజ్ మహల్ చిన్ననాటి పాత్రతో పేరు తెచ్చుకున్నారు. సురయా గాత్రం బాగా ఉండడంతో సంగీత దర్శకుడు నౌషాద్ గాయనిగా అవకాశమిచ్చారు. సైగల్ సరసన ఓమర్ ఖయ్యాం, పర్వానాలో హీరోయిన్‌గా నటించారు. పర్వానాలో సురయా పాడిన పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి. అప్పట్లో సురయాతో పాటలు పాడడంలో, నటించడంలో నూర్ జీహన్ ఒక్కరే సరిసమానంగా ఉండేవారు. 1947-50 మధ్య కాలంలో సురయా బాలీవుడ్ సూపర్‌స్టార్‌గా ఒక్క వెలుగు వెలిగారు. సురయా నటించిన సినిమాలు చూడ్డానికి ఆ రోజుల్లో ఉద్యోగులు ఆఫీసులకు ఎగనామం పెట్టేవారు. స్కూళ్లు, కాలేజీలు బోసి పోయేవి, దుకాణాలు కూడా కట్టేసేవారంటే అతిశయోక్తి కాదు. సురయా సినిమా మొదటి రోజు మొదటి ఆటకి వెళ్లడానికి అందమైన అప్రకటిత బంద్ వాతావరణం నెలకొనేదంటారు. ధర్మేంద్ర తన చిన్నతనంలో సురయా నటించిన దిల్లగి సినిమాను 40 సార్లు చూశానని చెప్పుకున్నారు. సురయా బయటికి వస్తే అభిమానులు సుడిగాలిగా వెంబడించేవారంటారు. హీరో దేవ్ ఆనంద్‌ని పెళ్లాడడానికి వెనుకాడిన సురయా ఆ తరువాత జీవితాంతం ఒంటరిగానే ఉండిపోవడం మరో అందమైన విషాదం. 34వ ఏట చిత్రసీమను వదిలేసిన సురయా 31 జనవరి, 2004న కేన్సర్‌తో జరిపిన సుదీర్ఘ యుద్ధంలో ఓడిపోయి కన్ను మూశారు.

మరణంలేని మెహర్ బాబా!




మానవ రూపంలో అవతరించిన దేవుడిగా కొలిచే మెహర్ బాబా 25, ఫిబ్రవరి, 1894లో పునెలో జన్మించారు. తన 19వ ఏటనే జ్ఞానోదయం అయిన మెహర్‌బాబా ఏడు సంవత్సరాల పాటు ఆధ్యాత్మిక అన్వేషణ కొనసాగించారు. ఈ సమయంలో అయిదుగురు ఆధ్యాత్మిక గురువుల వద్ద శిష్యరికం చేసి.. తన 27వ ఏట 1922లో సొంత శాఖను ప్రారంభించారు. 10, జూలై, 1925 నుంచి మరణించేవరకు మౌనవ్రతం పాటించిన బాబా.. సైగల ద్వారానే శిష్యులకు ఆధ్యాత్మిక సందేశాలిచ్చేవారు. 1931లో విదేశాలు సందర్శించిన మెహర్‌బాబా.. అక్కడ తన శిష్య పరంపర తయారు చేసుకున్నారు. 1949 తరువాత ఎంపిక చేసుకున్న కొంతమంది శిష్య గణంతో అజ్ఞాతంగా భారత్‌లో పర్యటించారు. దీన్ని బాబా మెహర్ కొత్త జీవితంగా చెబుతారు. అమెరికాలో, భారత్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల కారణంగా నడవలేని స్థితికి చేరుకున్న బాబా పాక్, ప్రాచ్య అనుసంధానికి కృషి చేశారు. 1966లో ప్రపంచవ్యాప్తంగా పెరిగి పోయిన మాదక ద్రవ్య వినియోగానికి వ్యతిరేకంగా మెహర్ బాబా బలమైన సందేశాలను వినిపించారు. మాదకద్రవ్య వినియోగాన్ని అరికట్టడంలో మెహర్ బాబా కీలక కృషి చేశారు. మెహర్ బాబా తరుచూ ఉపవాసాలు ఉండడం, ఏకాంతంలో గడపడం చేసేవారు. 31, జనవరి, 1969 మరణించిన మెహర్ బాబాకి మరణం లేదని శిష్యులు ప్రగాఢంగా నమ్ముతారు. మెహరాబాద్‌లోని బాబా సమాధి అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా మారిపోయింది. యావత్ విశ్వం ఒక మాయ అని, దేవుడు ఒక్కడే నిజమైన సత్యమని మెహర్ బాబా బోధించేవారు. జన్మ రాహిత్యానికి మోక్ష మార్గాన్ని మెహర్ బాబా ఉపదేశించారు.

చట్టం చట్రంలో బానిసత్వం!



అమెరికా బానిస చరిత్ర సుదీర్ఘమైంది. ఆధునిక అమెరికా నిర్మాణంలో ఆఫ్రికా నుంచి దిగుమతి అయిన బానిసల కాయకష్టం ఎంతో కీలకమైంది. ఆధునిక ప్రజాస్వామ్యంలో బానిస వ్యవస్థ కొనసాగిన దేశంగా కూడా అమెరికా ప్రత్యేకమైంది. అలాంటి బానిస వ్యవస్థకు 31, జనవరి 1865న రాజ్యాంగానికి 13వ సవరణ చేయడం ద్వారా చరమగీతం పాడారు. బానిసత్వాన్ని రద్దు చేస్తూ.. అమెరికా రాజ్యాంగానికి చేసిన 13వ సవరణతో దేశంలో అంతర్యుద్ధం చెలరేగింది. అమెరికా విప్లవం తరువాత రాష్ట్రాలు రెండుగా విడిపోయాయి. బానిసత్వాన్ని వ్యతిరేకించే రాష్ట్రాలు ఒకవైపు, అనుకూలంగా ఉండే రాష్ట్రాలు మరోవైపు చేరాయి. బానిసలకు స్వేచ్ఛ ఇస్తూ 1863లోనే అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ప్రకటించినప్పటికీ, ఏప్రిల్, 18, 1864న సెనెట్ బానిసత్వాన్ని రద్దు చేస్తూ సవరణను తీసుకొచ్చింది. దీనిపై అమెరికాలోని ఉత్తరాది రాష్ట్రాలు వెంటనే ఆమోదించినా.. దక్షిణాదిన కొంత వ్యతిరేకత కొనసాగింది. అధ్యక్షుడు అండ్ర్యూ జాన్సన్ చొరవతో దక్షిణాది రాష్ట్రాలు కూడా బానిసత్వాన్ని నిషేధిస్తూ సొంత చట్టాలను తీసుకొచ్చాయి. బానిసత్వాన్ని చట్టపరంగా నిషేధించినా ఆఫ్రికన్ల పట్ల అమెరికాలో సుదీర్ఘకాలంగా వివక్షత కొనసాగుతూ వచ్చింది. అమెరికా రాజ్యాంగానికి చేసిన 13వ సవరణలో తరువాతి కాలంలో హ్యూమన్ ట్రాఫిక్కింగ్, ఇతర ఆధునిక బానిసత్వాలను సైతం జత చేశారు.

పాడవని పాలు!



పాలు బయట ఉంచితే పాడై పోతాయి. రిఫ్రిజిరేటర్‌లోనే నిల్వ ఉంచాలి. అలా కాకుండా కూడా పాలు పాడవని పద్ధతిని కనిపెట్టడంతో అమెరికాకి చెందిన గెయిల్ బోర్డన్ చరిత్ర పుటలకెక్కారు. 1853లో బోర్డన్ కండెన్స్‌డ్ మిల్క్‌ను తయారు చేశారు. ప్రపంచ చరిత్రలో తొలిసారిగా రిఫ్రిజరేటర్‌లో ఉంచకుండా, పాడవని పాలను బోర్డన్ తయారు చేశారు. అమెరికా అంతర్యుద్ధంలో సైనికులనుంచి బోర్డన్ తయారు చేసిన కండెన్స్‌డ్ మిల్క్‌కి విపరీతమైన గిరాకీ ఏర్పడింది. 31, జనవరి, 1851న కండెన్స్‌డ్ మిల్క్ తయారు చేసినట్లు ప్రకటించారు. భూ సర్వేయర్, పత్రికా ప్రచురణకర్త అయిన గెయిల్ బోర్డన్ పేరుతో కండెన్స్‌డ్ మిల్క్ తయారీ పేటెంట్ ఇచ్చారు. బోర్డెన్ ప్రక్రియలో తయారైన పాలు సహజసిద్ధంగా తీయగా ఉండడంతో వేడి చేయకుండానే తాగడానికి వీలుగా ఉండడంతో ఈ ఉత్పాదనకు గిరాకీ పెరిగింది. దీర్ఘకాలంగా నిల్వ ఉన్నప్పటికి అప్పుడే తీసిన పాలకన్నా తాజాగా ఉండడం బోర్డన్ పాల ప్రత్యేకత. దీంతో అనతి కాలంలోనే బోర్డన్ పాలకు అమెరికా అంతటా మార్కెట్ ఏర్పడింది. ఈ కండెన్స్‌డ్ పాల తయారీకి బోర్డన్ కనెక్టికట్‌లో, న్యూయార్క్‌లో, ఇల్లినాయిస్‌లో ఫ్యాక్టరీలు ఏర్పాటు చేశారు. న్యూయార్క్ కండెన్స్‌డ్ మిల్క్ కంపెనీ పేరును ఆయన మరణం తరువాత బోర్డెన్ డైయిరీ కంపెనీగా మార్చారు.

యూబీఐ సాధ్యమేనా?

ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు ఓట్ల వేటలో ప్రజలకు తాయిలాలు ప్రకటించడం కొత్త కాదు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు మాత్రమే కాకుండా, ప్రాంతీయ పార్టీలు కూడా ఆ ఒరవడిలోనే వాగ్దానాల వర్షం కురిపిస్తున్నాయి.ఆ క్రమంలో పుట్టుకొచ్చినవే రుణ మాఫీ, ఉచిత విద్యుత్, ఉచిత విద్య తదితర పథకాలు.ఉచితం అనగానే రిజర్వు బ్యాంకు అంగీకరించదు. ప్రపంచ బ్యాంకు అంతకన్నా ఒప్పుకోదు. ఏ ప్రభుత్వమైనా సొంతంగా సంపదను సృష్టించి ఉచిత పథకాలను ఎన్నింటిని అమలు జేసినా ఎవరికీ ఇబ్బంది ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెల్లవారిన దగ్గర నుంచి రిజర్వు, ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధిల వద్ద క్యూకడుతున్న ప్రస్తుత తరుణంలో ఆయా ఆర్థిక సంస్థలు విధించే ఆంక్షలకు పని చేయాల్సిందే. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ మార్గాన్ని అనుసరించా ల్సిందే. అయితే, ప్రభుత్వం మీద భారం ఎంతపడినా, ముందు ఎన్నికలగండం గడిస్తే చాలు అన్న ధోరణిలో అన్ని పార్టీలూ వ్యవహరిస్తున్నాయి. ప్రజల బ్యాంకు ఖాతాల్లో ఎంతో కొంత సొమ్మును జమ చేయాలన్న ఆలోచనల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు నిమగ్నమై ఉన్నాయి. గత నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడంతో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను ఆకట్టు కునేందుకు తమ పార్టీ అధికారంలోకి వస్తే కనీస ఆదాయ పథకాన్ని అమలుజేస్తామన్న కొత్త వాగ్దానం చేశారు. దాంతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అంతకుముం దే ఈ మాదిరి పథకాన్ని కేంద్రం సమర్పించే తాత్కా లిక బడ్జెట్‌లో చేర్చేందుకు ఆగమేఘాలపై ప్రయత్నా లు సాగిస్తున్నారు. నిజానికి ఇది మన దేశానికి కొత్త కావచ్చు కానీ, ఇతర దేశాల్లో ఏనాటినుంచో ఈ ఆలోచనలు సాగుతున్నాయి. కొన్ని దేశాల్లో అమలులో ఉన్నాయి కూడా.

సార్వత్రిక కనీస ఆదాయ పథకం (యూనివర్సల్ బేసిక్ ఇన్ కమ్-యూబీఐ)గా పేరొందిన ఈ పథకాన్ని 1969లో అమెరికాలో ఆనాటి అధ్యక్షుడు నిక్సన్ ప్రతిపాదించారు. ప్రతిపౌరునికి నెలకూ 1600 డాలర్ల ఆదాయాన్ని అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని అప్పట్లో డెమోక్రాట్లు అడ్డుకోవడం వల్ల అమలులోకి రాలేదు. స్విట్జర్లండ్‌లో నెలకు 2,500 డాలర్లను పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన పథకంపై రిఫరెండం నిర్వహిస్తే 75 శాతం మంది ప్రజలు తిరస్కరించారు. ఫిన్లండ్‌లో ఇటీవల ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 25నుంచి 58 ఏళ్ళ మధ్య వయస్కులకు నెలకు 560 యూరోలు అందజేస్తున్నారు. కొన్ని దేశాల్లో నగరాలకే పరిమితంగా ఈ పథకం అమలు లో ఉంది. అయితే, ఈ పథకాన్ని అమలులోకి తెస్తే మిగిలిన సంక్షేమ పథకాలు బంద్ అయ్యే ప్రమాదం ఉంది. ఎరువులు, ఇతర నిత్యావసర వస్తువులపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీల మొత్తం మూడు లక్షల కోట్లుపైనే.ఈ పథకాన్ని మన దేశంలో అమలుజేసేం దుకు 6 లక్షల కోట్లు ఖర్చవుతుందని అంచనా. తడిసి మోపెడు అయినట్టు మొత్తం 9 లక్షల కోట్ల రూపాయి ల భారాన్ని మోసేందుకు కాంగ్రెస్ కానీ, బీజేపీ కానీ సిద్ధపడవు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ముందుగా సబ్సిడీలు కత్తిరింపుపైనే దృష్టిని కేంద్రీకరి స్తుంది. అందువల్ల ఈ రెండు ప్రధాన పార్టీలూ లేదా వాటి నేతృత్వంలోని కూటములు అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని అమలులో పెడితే సబ్సిడీ పథకాలను కచ్చితంగా కత్తిరించి తీరుతుంది. అనుమానం లేదు. సబ్సిడీల కింద ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము అసలైన లబ్ధిదారులకు చేరడం లేదని ఎప్పుడో మూడు దశాబ్దాల క్రితమే ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. రూపాయిలో పది పైసలు కూడా అసలైన లబ్ధిదారులకు చేరడం లేదని అప్పట్లో ఆయన బహిరంగంగానే స్పష్టం చేశారు.మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదేళ్ళ పాటు ఇదే మంత్రం వల్లించారు. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ అభిప్రాయం కూడా అదే. అసలైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించేం దుకు వీలుగా ఆధార్ కార్డు అనుసంధానం చేశామనీ, దీని వల్ల 90 వేలకోట్ల రూపాయిలను ఆదా చేయగలి గామని మోడీ ఇటీవల మన్ కీ బాత్ కార్యక్రమంలో వెల్లడించారు. సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించే సబ్సిడీ దళారుల జేబుల్లోకి వెళ్తోందనేది అందరూ అంగీకరిస్తున్న సత్యం. అయితే, దానిని ఎలా నివారించాలన్న దానిపై పార్టీల మధ్య అభిప్రాయ భేదాలు ఉండేవి. ఇప్పుడు ఈ యూబీఐ పథకం విషయంలో మాత్రం ఈ రెండు పార్టీలే కాకుండా, ప్రాంతీయ పార్టీలు కూడా సుముఖంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. సబ్సిడీ సొమ్మును నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి మళ్ళించే కార్యక్రమం ఇప్పటికే అమలులో ఉంది. అయితే, లబ్ధిదారుల్లో అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులు కావడం వల్ల బ్యాంకుల్లో డబ్బు వాపస్ తీసుకునేందుకు ఇతరులపై ఆధారపడుతుండటంతో అక్కడ మళ్ళీ దళారులు ప్రత్యక్ష మవుతున్నారు. ఈ పథకాన్ని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి అమలు జేయాలన్నది పార్టీల సంకల్పం. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఎన్ని కుటుంబాలు ఉన్నాయో పదేళ్ళు పైగా లెక్కలు తేలడం లేదు. దేశ జనాభాలో బీపీఎల్ కుటుంబాలకు చెందిన వారు 27 కోట్ల మంది ఉన్నట్టు గణాంకాలు తెలియజేస్తున్నప్పటికీ అవి కూడా నికరమైనవి కావు. బీపీఎల్ కుటుంబాల లెక్క తేల్చలేక సురేష్ టెండూల్కర్ కమిటి చేతులెత్తేసింది. పూర్వపు యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రణాళికా సంఘం ఏర్పాటుచేసిన ఈ కమిటీ పరస్పర విరుద్ధమైన నిర్వచనాలు చేయడం వల్లనే, ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టినతర్వాత ప్రణాళికా సంఘాన్నే రద్దు చేసి దాని స్థానే నీతి ఆయోగ్‌ని ఏర్పాటుచేయగా, అది అతనికంటే ఘనుడ న్న చందంగా తయారైంది. అందువల్ల యూబీఐ పథకం ఆదర్శవంతమైనదే అయినా దీనిని అమలు చేయడం అంత సులభం కాకపోవచ్చు. ఎన్నికల్లో ఓట్లుదండుకోవడానికి ఇది ఉపయోగపడవచ్చు. రెండు పార్టీలూ ఇదే పథకాన్ని వల్లిస్తుండటం వల్ల ఎవరి వైపు ప్రజలు మొగ్గుచూపుతారో మరి.

ఎప్పుడూ ప్రజల పక్షమే!



దేశం మరో గొప్ప నాయకుడు, దార్శనికుడుని కోల్పోయింది. మహామహులకే ముచ్చెమటలు పట్టించి, శ్రామిక, కార్మిక వర్గానికి అండగా ఉండి జీవితమంతా దేశ సేవకే అంకితం చేసిన జార్జ్ ఫెర్నాండెజ్‌ని కోల్పోవడం తీరని లోటు. ఈ అలుపెరగని ప్రజాపోరాట నాయకుడు తాను మినిస్టర్‌గా ఉన్నా.. సగటు వ్యక్తిగా ఉన్నా.. ఎల్లప్పుడూ అతి సాధారణ జీవితాన్ని గడిపేరు. కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నా తన బట్టలు స్వయంగా ఉతుక్కొనేవారు. సెక్యూరిటీ, ప్రొటోకాల్ అంటూ హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా సామాన్యులతో కలిసి ఇమిడిపోయేవారు. పదవికోసమో, అక్రమార్జన కోసమో పాకులాడి ఏ ఎండకా గొడుగు ఎన్నడూ పట్టలేదు. అవతలి వ్యక్తి ఎంతటి ఉద్దండులైనా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఆజన్మాంతం అలుపెరగకుండా పోరాడిన వీరుడుగా ఫెర్నాండెజ్ చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ప్రజాశ్రేయస్సు, శాంతియుత పాలన సాధనలో తమ పర పక్షం తేడా చూపని నేత ఫెర్నాండెజ్ అని చెప్పడానికి ఉదారణ. తమ మిత్రపక్షం బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్ రాష్ట్రంలో 2002లో మత కల్లోలాలతో అట్టుడికిపోనపుడు రాష్ట్రపతి పాలన విధించి ప్రాణ నష్టాన్ని నివారించాల్సిందిగా ప్రధాని వాజపేయికి ఫెర్నాండెజ్ సూచించారు. టాక్సీ డ్రైవర్లు, మున్సిపాలిటీ, బస్సు కార్మికుల నుంచి బ్యాంక్ ఉద్యోగుల కోసం ఫెర్నాండెజ్ చేసిన సేవ మరువలేనిది. దేశంలో ట్రేడ్ యూనియన్, కార్మిక సంఘాలకి ఆయువు పోసిన వారిలో ఫెర్నాండెజ్ పేరు అగ్రభాగాన నిలుస్తుంది.

బ్యాంకుల జాతీయకరణకు పూర్వం ప్రయివేటు బ్యాంకుల నుంచి కార్మిక శ్రామిక వర్గానికి రుణాలు మంజూరు కావాలంటే మూడు చెరువులు తాగాల్సిన పరిస్థితి. తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు సునాయాసంగా కార్మికులకు లభించాలనే ఉద్దేశ్యంతో ఫెర్నాండెజ్ కార్మికులకు మొట్టమొదటి సహకార బ్యాంకు సృష్టికి శ్రీకారం చుట్టారు. దాని ఫలితమే 1968లో బాంబే లేబర్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఉద్భవించింది. ఫెర్నాండెజ్ శ్రామిక విప్లవానికి నాంది బొంబాయి నౌకాశ్రయంలో పడింది. అక్కడ పనిచేసే కార్మికులకు యూనియన్ నాయకుడిగా ఫెర్నాండెజ్ జీవితం ప్రారంభించారు. వాజపేయి నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం పడిపోకుండా, మళ్ళీ ఎన్నికలు ప్రజల నెత్తి మీదకి రుద్దకుండా జార్జి ఫెర్నాండెజ్ 1999లో వహించిన పాత్రకు యావన్మంది భారతీయులు రుణపడి ఉంటారు. వ్యక్తి పూజ ఎరగని ఫెర్నాండెజ్ ప్రభుత్వాన్ని కాపాడడం కోసం అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రిని కాళ్లావేళ్లా బతిమాలేరు. ఎందరో నియంతలు, కఠిన రాజకీయ వ్యక్తులను సహితం సింహంలా ఎదుర్కొన్న ఫెర్నాండెజ్, జయలలిత అపాయింట్‌మెంట్ కోసం ఓరిమి వహించి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఆవిడెప్పుడు రమ్మంటే అప్పుడు ఢిల్లీ నుంచి చెన్నైకి కొట్టిన బంతిలా తిరిగేరు. ఎంత అవమానానికి గురైనా భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా చివరివరకు కృషి చేశారు. శత్రువుకి మిత్రుడు కూడా శత్రువుగా పరిగణింపబడటం సాధారణం. రాజకీయ రంగం అతీతం కాదు. 1974లలో రైల్వే సమ్మె సందర్భంగా ఫెర్నాండెజ్‌కు డీఎంకే కరుణానిధితో ఏర్పడిన స్నేహం 1999లో శాపంగా మారింది. అనివార్య కారణాల వలన అప్పటి నావల్ చీఫ్ అడ్మిరల్ విష్ణుభగవత్‌ని తొలగించాల్సిన పరిస్థితి వస్తే సాకు కోసం ఎదురుచూస్తోన్న జయలలిత విష్ణు భగవత్‌ని తిరిగి తీసుకోవాలి లేదా ఫెర్నాండెజ్‌ని తొలగించాలి అని డిమాండ్ చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఫలితంగా వాజ్‌పేయి ప్రభుత్వాన్ని పడగొట్టింది జయలలిత.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ, పరిశ్రమలు శ్రామిక శక్తిపై ఆధారపడిన రోజుల్లో శ్రామిక శక్తిని, పేదలని ఉద్యమం బాట పట్టించి కార్మిక సంఘాలను బలోపేతం చేసి సాధికారత కల్పించడంలో ఫెర్నాండెజ్ పాత్ర అమోఘమైనది. తదనంతరం కూడా శ్రామిక సంఘాల నాయకులు ఆయన చేసిన మేలుని ఆజన్మాంతం గుర్తుంచుకుంటారు. ఫెర్నాండెజ్ నాయకత్వ నైపుణ్యం, పట్టుదల, శక్తియుక్తులకు మచ్చుతునక 1974లో జరిగిన చారిత్రాత్మక రైల్వే సమ్మె. బడుగు వర్గాలు, శ్రామిక వర్గం హక్కుల కోసం పట్టుబట్టి 20రోజుల పాటు రైల్వే సమ్మె నిర్వహించి నాయకత్వం వహించి యావత్ దేశం స్థంభించి పోయేలా చేశారు ఫెర్నాండెజ్. ప్రపంచంలో జరిగిన అతిపెద్ద పారిశ్రామిక సమ్మెలలో ఒకటిగా 1974నాటి రైల్వే సమ్మె చరిత్రలో నిలిచిపోతుంది. మరో కార్మిక నేత మధు దండావతే రైల్వే మినిస్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సమ్మెలో పాల్గొన్న కారణంగా విధులనుంచి బర్తరఫ్ అయిన రైల్వే ఉద్యోగులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు. 1960లలో జార్జ్ ఫెర్నాండెజ్ ఒక ఆందోళనకారుడుగా ముద్రపొందారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్మికులకు మద్దతుగా ప్రకటించిన రైల్వే సమ్మె సమయంలో రైళ్లను ఆపే క్రమంలో పోలీసుల లాఠీ ఛార్జీలకు లోనయ్యాడు. నాగపూర్ సెంట్రల్ జైలులో నిర్బంధించబడ్డాడు. ఈ రోజు రైల్వేలో ఇన్ని యూనియన్లు ఉద్భవించి శ్రామిక ప్రయోజనాలకు రైల్వే శాఖ ప్రాధాన్యత ఇస్తోందంటే అది ఫెర్నాండెజ్ పుణ్యమే. దేశంలో అత్యవసర పరిస్థితిని విధించిన ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి ఈ సోషలిస్ట్ నేత ఏకు మేకై కూర్చుని ప్రతిఘటించిన విధం ఫెర్నాండెజ్ యొక్క పోరాట పటిమకు మచ్చుతునక. జనతా ప్రభుత్వం పాలనలో స్వదేశీ ఉద్యమం కోకాకోలాతో పాటు టెక్నాలజీ సంస్థ ఐబీఎంను దేశం నుంచి వెళ్లగొట్టడం లాంటి వివాదాస్పద ఘట్టాలు ఫెర్నాండెజ్‌ను జీవితాంతం వెంటాడాయి. పోఖ్రాన్ అణు పరీక్షల విజయంలో అప్పటి రక్షణ మంత్రిగా ఫెర్నాండెజ్ భాగస్వామి. వీపీ సింగ్ జనతా దళ్ ప్రభుత్వంలో జార్జి ఫెర్నాండెజ్ రైల్వే మంత్రిగా బాధ్యతలు వహించారు. వెనువెంటనే కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణానికి కంకణం కట్టుకున్నారు. కొంకణ్ రైల్వే ప్రాజెక్ట్‌కి శ్రీధరన్ ని ఎంపిక చేసి నిర్మాణ బాధ్యత అప్పగించిన 11 ఏళ్లకు 1998 జనవరి 26న కొంకణ్ రైల్వే మొదటి రైలు ప్రారంభమైంది.

జీవితాంతం బడుగు వర్గాలకోసం ప్రతిపక్షం పాటుపడిన సోషలిస్టు నేత ఫెర్నాండెజ్‌ను కార్గిల్ శవపేటికల కుంభకోణం అని సృష్టించి దానిలో ఇరికించి తన రాజకీయ జీవితానికి మాయని మచ్చ పెట్టాలన్న ఆనాటి ప్రతిపక్షం కుటిల ప్రయత్నాలు ఫలించలేదు. దేశ న్యాయస్థానాల్లో జార్జి ఫెర్నాండెజ్‌పైచేసిన ఆరోపణలు వీగిపోయాయి. కాకపోతే ఒక నిస్వార్థపూరిత రాజకీయ నాయకుడు, ప్రజ్ఞాశాలి, రక్షణమంత్రిని దేశం చేజేతులా కోల్పోవాల్సి వచ్చింది. 1977లో బీహార్‌లో ముజఫర్ పూర్ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు జనం పెద్దపీట వేసి అఖండ ఆధిక్యతతో గెలిపించారు. అదే ఫెర్నాండెజ్ చివరి సారిగా 2009లో లోక్‌సభ ఎన్నికల్లో ముజఫర్‌పూర్ పోటీ చేస్తే 20వేల ఓట్లు కూడా రాబట్టుకోలేకపోయారు.



సునీల్ ధవళ, 9741747700

గ్రహణం వీడని గ్రాంట్లు

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల మూలంగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యక్రమాలు నిధులు విడుదల కాకపోవడం వలన వివిధ ప్రభుత్వ శాఖల పనులకు బిల్లు చెల్లించకపోవడం వలన అభివృద్ధి పనులతో పాటు నిత్య కార్యకలాపాలు నిలిచి పోతున్నాయి. ఇలాంటి స్థితిలో ''మూల్గే నక్కపై తాటిపండు పడ్డట్టు'' స్థానిక ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు ఇలా 2018-2019 ఆర్థిక సంవత్సర కార్యకలాపాలు స్తబ్దత నుండి బయటపడాల్సి ఉంది. ఏ శాఖ పనులు ఎలా ఉన్నా అత్యంత ప్రధానమైన విద్యాశాఖ ప్రైవేట్ కార్పోరేట్ దెబ్బకు ప్రమాదపుటంచుల్లో పడింది నిజం కాదా ! ఎప్పటిలా ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా రావలసిన గ్రాంట్లు (నిధులు) ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు విడుదల చేయలేదు. బడిలో అవసరమైన స్టేషనరికి, రిపేర్ల(మెయింటెనెన్స్)కు ఫర్నిచర్, మోటార్ల మరమ్మత్తులు, విద్యుత్తు బిల్లులు ఇలా పాఠశాల (తరగతి గదు)ల నిర్వహణకు గాను ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ మాసంలోనే పాఠశాల బ్యాంకు ఖాతాల్లో నిధులను జమచేసేవారు. విద్యా సంవత్సరం 2018-19 మొదలై ఏడు మాసాల కాలం గడిచిపోయినా, దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిధులు లేక అస్తవ్యస్తంగా మారింది. ప్రైవేట్, కార్పోరేటుకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి పరచడానికి నిధులు పెంచాల్సింది పోయి, గతం మాదిరిగా రావలసిన నిధులు విడుదల కాకపోవడంతో నిత్యవసరాలు తీరకపోవడంతో పాటు డీజెల్ బోధన ''అందని ద్రాక్షగా'' మారింది. అంతేకాదు చాక్‌పీసు(సుద్ద ముక్క)లు, డస్టర్లు, మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, రిజిష్టర్లు, స్టేషనరీ కొరతతో పాఠశాలలు విలవిలలాడుచున్నాయి, వెలవెల బోతున్నాయి. మన రాష్ట్రంలో 26,040 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 5వేల వరకు ఉన్నత పాఠశాలలు కాగా, మిగితావి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు. వీటిలో 21,50,626 మంది విద్యార్థులు చదువుచున్నారు.

సర్కారు బడుల బాగోగుల కోసం ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ క్రింద 5 వేలు, మూడు తరగతి గదుల కంటే ఎక్కువ ఉంటే 10వేలు ఇస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ మరియు నిర్వహణ ఖర్చు కలిపి మొత్తం 22 వేల రూపాయల వరకు నిధులు ఇస్తారు. ఉన్నత పాఠశాలలకు స్కూల్ గ్రాంటు, నిర్వహణ ఖర్చులు కలిపి ఒక లక్ష వరకు ఇస్తారు. ఇలా పాఠశాలల నిర్వహణ ఖర్చులకు నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదలలో జాప్యం మూలంగా సర్కారు బడులు కనీస నిర్వహణకు కూడా నోచుకోలేకపోవడం జరుగుతుంది నిజం కాదా ! అది చూసి భరించలేని ఉపాధ్యాయులు వారి సొంత డబ్బులతో కనీస అవసరాలు తీర్చుకుంటూ విద్యా సంవత్స రాన్ని 8 నెలలకు నెట్టుకొచ్చారు. ఇదిలా ఉంటే సర్కారు స్కూల్ కాంప్లెక్సు వ్యవస్థ ఉపాధ్యాయులకు శిక్షణ (అంతర్గత) బోధనలో మెరుగుదల కోసం ఎంతో ఉపయోగపడాల్సిన వ్యవస్థను నీరుగార్చినారు. నేటికి సమావేశాలు లేవు. ఆ వ్యవస్థకు రావాల్సిన నిధులు రాలేదు.

అవి ఉత్సవ విగ్రహంగా మారింది. బడుల్లో పనిచేసే 30 వేల మంది స్వీపర్లు, స్కావెంజర్లకు 4 నెలల నుంచి జీతాలు రావడం లేదు. దీని వలన వారు పస్తులంటూ విధులు నిర్వహించాల్సి వస్తుంది. మానేస్తే ఉన్న చిన్న ఉపాధి ఊడిపోతుందోనని పనులు నిర్వహిస్తున్నారు. కొందరు ప్రధానోపాధ్యాయులు వారికి సొంత డబ్బులు చెల్లించి కాలం వెల్లదీస్తున్నారు. ప్రతినెల విద్యా వ్యవస్థ పనితీరును అంచనావేయడానికి, నైపుణ్య మెరుగుదలకు శిక్షణలు ఇవ్వడానికి, ప్రతి మండల కేంద్రంలో ఎమ్.ఆర్.సి. మండలం రిసోర్సు సెంటర్, మండల విద్యావనరుల కేంద్రం ఉంటుంది. దీనికి రావల్సిన నిధులు అందకపోవడంతో నిర్వహణ తూతూ మంత్రంగా సాగుతుంది. ఇక్కడ నుండి జిల్లా, రాష్ట్ర విద్యాశాఖలకు నివేదికలు పంపబడుతాయి. ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ప్రతినెల సమావేశాలు, శిక్షణలు, కృత్యమేళల, సమీక్షలకు నిలయమైన దానికి కూడా నిధులు ఇవ్వకపోవడంతో కటకటలాడుతుంది. ఇలా వివిధ స్థాయిల్లో నిధులు విడుదల కాకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరుసటి సంవత్సరం నుండి విద్యాసంవత్సరాన్ని జూన్ 1న పున: ప్రారంభించేలా నిర్ణయించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ ఉత్సవాలనుండి విద్యాసంవత్సరం ఏప్రిల్ నెలలో ముగిసేవరకు పాఠశాలలో అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది. అవి విద్యార్థుల నైపుణ్యాలకు, నిజ జీవితంలో మంచి మార్గంలో నడుచుటకు, ఆయురారోగ్యానికి, జ్ఞానానికి సంబంధించినవిగా ఉంటాయి. ఏ కార్యక్రమం చేయాలన్నా నిధులు లేనిది చేయలేము. ఈ సంవత్సరం స్థానిక ఎన్నికల మూలంగా దాతలను చందాలు అడిగే పరిస్థితులు కూడా లేవు. అలా చేస్తే రాజకీయ రంగు పాఠశాలలకు పులుముతారు. ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం, పండుగలు, గణిత, సైన్సు దినోత్సవం, బాలల దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, భాషా దినోత్సవం, స్వయం పాలనా దినోత్సవం, కృత్యమేళలు ఇలా విద్యార్థులను భావి పౌరులుగా రేపటి సమాజంలో ఎదుర్కోబోవు అన్ని సమస్యలకు పాఠశాల స్థాయిలో జ్ఞానాన్ని పొందుటకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతాయి, వీటిని తప్పని సరిగా చేయాలి. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవానికి వర్షాకాలం కావడం వలన, జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా పిల్లలకు గేమ్స్(ఆటలు), సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవ లసిన బాధ్యతలను విస్మరించడం భావమా! దీన్ని ఆషామాషీగా తీసుకోరాదు.

నిర్లక్ష్యం చేస్తే సర్కారు బడికి పిల్లలు ఎలా వస్తారు. సర్కారు బడుల సంరక్షణ ఉద్యమాలు రాకపోతే సర్కారు బడి కొంత కాలానికి మ్యూజియంలో వస్తువుగా మారబోతుందా అనిపి స్తుంది. బడి బాగుపడుతేనే సామాజిక చైత న్యం, అంతరాలు లేని సమాజాన్ని సర్కారు బడిలోనే చూడగలం. అది పేదల, మధ్యతరగతి వారికి దేవాలయం. కావున నిర్లక్ష్యం వీడాలి పాలకులు. ముందస్తు ఎన్నికలకు వెళ్ళే పాలకులకు ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం ఉండే విషయం తెలియంది కాదు ? అయిందేదో అయిపోయింది. పాఠశాల గ్రాంటు (నిధు)లను వెంటనే విడుదలకు పూనుకోవాలి.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో తిరిగి అధికారాన్ని కట్టబెట్టినారు. అంతే చిత్తశుద్ధితో ప్రభుత్వ విద్యపై అధ్యయనం చేసి కులాలు, మతాలు, ఆస్తులు, అంతస్థుల వారిగా కాకుండా అందరూ ఒకే బల్లపై కూర్చొని చదువుకునేలా ''కామన్ స్కూల్'' (కలెక్టర్ నుండి బంట్రోతు వరకు, సామాన్యుడి నుండి మాన్యుడి వరకు) ఒకే విద్యా విధానాన్ని అమలు జరిగేలా విధాన నిర్ణయాలు తీసుకొని అమలుకు పూనుకోవాలి.

మేకిరి దామోదర్, 9573666650

పీవీ పేరిట కొత్త జిల్లా కావాలి!

పాలనా సౌలభ్యం కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం హర్షణీయం.ప్రజల ముంగిట్లోకి పాలనను తీసుకుని వచ్చేందుకు ఆయన తీసుకుంటున్న చర్యల వల్ల ప్రజలకు మేలు జరుగుతోంది.పది జిల్లాలను 31 జిల్లాలుగా చేసిన ఘనత ఆయనదే.అదే రీతిలో హుజూరాబాద్ కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేసి దానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని కోరుతున్నాం. హుజూరాబాద్ కేంద్రంగా కొత్త జిల్లా కోసం ఈ ప్రాంత ప్రజలు నాలుగు దశాబ్దాలుగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వాన్నీ కోరుతున్నారు. తెలంగాణలో జిల్లాలు, డివిజన్లు ,మండలాల పునర్వ్యవస్థీకరణ రగడ మళ్ళీ రాజుకుంది.తెలంగాణలో ములుగు,నారాయణ పేట లు కేంద్రాలుగా కొత్త మండలాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.దీంతో ఎక్కడికక్కడ కొత్త మండలాల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి.హుజూరాబాద్ కేంద్రంగా పధ్నాలుగు మండలాలతో కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా కోరుతున్నారు.మిర్యాల గూడాను జిల్లాగా ప్రకటించాలని సిపిఎం పట్టుబడుతోంది. ఏటూరు నాగారం కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసులు కోరుతున్నారు. ఈ డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతీసుకునే తరుణంలో హుజూరాబాద్ కేంద్రంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ను పరిశీలించాలని కోరుతున్నాం.

-ఆర్.ఆర్

కక్ష సాధిస్తున్న అమెరికా

అమెరికా పెత్తనాన్ని ధిక్కరిస్తూ సామ్యవాదాన్ని అవలంబిస్తున్న దేశంగా నిలుస్తోన్న దక్షిణ అమెరికా దేశం వెనెజులా తీవ్ర సంక్షోభంలో ఉంది. గత కొన్నేళ్లుగా ఆర్థిక యుద్ధంలో ఉన్నట్లు ప్రకటించిన ఆ దేశం ప్రస్తుతం రాజకీయ, సామాజిక సంక్షోభంలో చిక్కుకోవడంలో అమెరికా హస్తం పెద్ద పాత్ర వహిస్తుంది. ఆ దేశపు తిరుగులేని నేత చావెజ్ మరణించిన పిమ్మట అధ్యక్షుడిగా మదురో ఎన్నిక కాబడినా ఆ దేశపు రాజకీయ, ఆర్థిక అంతర్గత విషయాల్లో నేరుగా తలదూర్చడం అమెరికా పెద్దల వశం కాలేదు. అందుకనే పరోక్ష పద్ధతుల్లో వెనెజులా దేశాన్ని దారిలోకి తెచ్చుకోడానికి వారు చూస్తున్నారు. ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మొదలైన ఆంక్షల యుద్ధం ట్రంప్ జమానాలో మరింత ఉధృతమైంది. వెనెజులా దేశానికి ఆదాయంలో ముఖ్య భాగం పెట్రోల్ ఎగుమతులు ద్వారా వస్తుంది. అమెరికా అంచెలంచెలుగా ఆ దేశం నుండి పెట్రోల్ దిగుమతులు తగ్గిస్తూ వచ్చింది. ఆ దేశంలో ఉన్న పెట్రోల్ బావుల్ని గతంలో చావెజ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జాతీయం చేసి ప్రయివేట్ శక్తుల్ని కట్టడి చేసాడు. గత కొద్ది ఏళ్లుగా పెట్రోల్ ధరలు తగ్గుతూ రావడంతో వారి ఆదాయం తగ్గింది. ద్రవ్యోల్బణం కొన్ని లక్షల శాతం పెరిగింది.మందులు,తిండి కొరత పెరిగింది. ప్రజారోగ్యం ఉచితమే అయినా మందుల కొరత,సిబ్బంది కొరతతో దిగజారింది. ముప్పై లక్షల మంది ఉపాధి వెతుక్కొంటూ దేశం విడిచి వెళ్లినట్టు తెలుస్తోంది. ఇలాంటి సందర్భంలో రాజకీయ సంక్షోభం అదనం. అంతర్జాతీయ సమాజం ఈ దుందుడుకు చర్యని ఖండించాలి. కష్టకాలంలో ఉన్న సాటి దేశం నిలదొక్కుకునేలా సాయపడాలి. గైడోని అధ్యక్షుడిగా గుర్తించడం కుదరదంటూ, ఎవరి అంతర్గత విషయాలు వారే పరిష్కరించుకోవాలంటూ మంచి దౌత్యనీతి చూపించిన భారత్ వెనెజులాకు స్నేహహస్తం అందించాలి.

డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం



బాపూఘాట్‌లో జాతిపితకు ఘననివాళి

• సభాపతి పోచారం, మండలి చైర్మన్ స్వామిగౌడ్, హోం మంత్రి మహమూద్ అలీ పుష్పాంజలి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్‌ను పలువురు ప్రముఖులు గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూఘాట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ తదితరులు బాపూజీకి నివాళులర్పించారు. ప్రభుత్వ మ్యూజిక్, డ్యాన్స్ కాలేజీ బృందం బాపూజీకి ఇష్టమైన భజన గీతాలను ఆలపించారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన పవిత్ర గ్రంథాల నుంచి మతపెద్దలు పఠించిన ప్రవచనాలను ప్రముఖులు ఆలకించారు. అలాగే సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అదర్ సిన్హా, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి కలెక్టర్ జి.రవి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నివాళి




హైదరాబాద్, ఆంధ్రప్రభ : జాతిపిత మహాత్మ గాంధీ 71వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. బుధవారం గాంధీ భవన్‌లో గాంధీ చిత్రపటానికి పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సిఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, పార్టీ ఉపాధ్యక్షులు కుమార్‌రావు, మల్లు రవి, పార్టీ ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, ప్రేమలాల్ తదితర పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ నుంచి సుల్తాన్‌బజార్‌లోని గాంధీజ్ఞాన మందిర్ వరకు సాగిన విద్యార్థుల శాంతియాత్ర ర్యాలీని మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అనంతరం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కులమతాల పేరుతో రాజకీయాలు చేస్తున్న కొందరు నేతలు గాడ్సే వారసులుగా తయారయ్యారని విమర్శించారు. నేటి భాజపా ప్రభుత్వం గాడ్సేను అనుసరిస్తూ ఆయన ఆశయాలను అమలు చేస్తుందన్నారు. అదే కాంగ్రెస్ పార్టీ మహాత్మ గాంధీ ఆశయాల అమలు కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. రాహుల్ నేతృత్వంలో రెండో స్వాతంత్ర్య పోరాటం మొదలైందని, మోడీ నియంత పాలనను ఓడించి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో...



మహాత్మాగాంధీ ఆశయాల స్ఫూర్తితో ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించారని తెలుగుదేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ చెప్పారు. మహాత్మా గాంధీ 71వ వర్ధంతి కార్యక్రమాన్ని తెదేపా తెలంగాణ రాష్ట్ర నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి జి.బుచ్చిలింగం, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పి. సాయిబాబా, మీడియా సెక్రటరీ టి.ప్రకాశ్‌రెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్‌రెడ్డి, మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు తాజుద్దీన్, హైదరాబాద్ జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల సారంగపాణి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి కందిమల్ల రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, బ్రిటిష్ సామ్రాజ్యంతో అహింస, సత్యాగ్రహ మార్గాల ద్వారా పోరాడిన ధీరుడు మహాత్ముడని కొనియాడారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బండ్రు శోభారాణి మాట్లాడుతూ, అహింసామార్గంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన మహనీయుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు.



గాంధీ వర్ధంతి సందర్భంగా మౌనం పాటిస్తున్న సచివాలయ ఉద్యోగులు

'పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి'

• రేపు బీసీల చలో ఢిల్లీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 1న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రకటించింది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పెట్టి ఆమోదింప చేయాలని సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ అధ్యక్షతన సంఘం సమావేశం మంగళవారం బీసీ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో నీల వెంకటేష్, భూపేష్ సాగర్, శేషగిరి రావు, దాసు సురేష్, జైపాల్ ముదిరాజ్, టిఆర్ చందర్, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందిన అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టి వ్యవస్థను తప్పుదారి పట్టిస్తున్నారని కేంద్రంపై ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. ఇటీవల కేంద్రం జరిపిన సర్వేలో ఓబీసీ ఉద్యోగులు 14 శాతం, అగ్రకులాలకు చెందిన వారు 63 శాతం ఉన్నారని తేలిందన్నారు. అలాగే దేశంలో ఉన్న 749 మంది జడ్జిలు ఉంటే వారిలో 39 మంది బీసీలు, 18 మంది ఎస్సీలు, 5 మంది ఎస్టీలు ఉండగా మిగిలిన 687 మంది అగ్రకులాలకు చెందిన వారేనని అన్నారు. అలాగే కేంద్ర మంత్రివర్గంలో 70 మంది అగ్రకులాలకు చెందిన వారే ఉంటున్నారని, ఇక ముఖ్యమంత్రులు అయితే అందరూ అగ్రకులాలకు చెందిన వారే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా న్యాయవ్యవస్థ, రాజకీయ వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలో అందరూ అగ్రవర్ణాలే ఉన్నారని అన్నారు. ఈ నేపథ్యంలో బీసీలకు రాజకీయంగా చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఛలోఢిల్లీ కార్యక్రమం సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతితోపాటు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్న 36 రాజకీయ పార్టీల నేతలకు బీసీ బిల్లు గురించి విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ పర్సంటైల్

కటాఫ్ 87.71%

• ఏడు దశాంకాల వరకు పర్సంటైల్ గణన • ఓపెన్ కేటగిరీకి కటాఫ్ అమలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ పరీక్ష మొదటి దశ ముగిసినందున ఏప్రిల్‌లో జరిగే రెండో దశ మెయిన్ పరీక్ష కోసం విద్యార్థులు సిద్ధం అవుతున్నారు. రెండింటిలో సరాసరి పర్సంటైల్ శాతంతో విద్యార్థులను అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. అయితే ఇప్పటికే అడ్వాన్స్‌డ్‌కు విద్యార్థులు ఎంత మందిని ఎంపిక చేస్తారనేది స్పష్టమైనప్పటికీ మెయిన్ ఫలితాలు వెలువడిన తరువాత మరికొంత మంది చేరే అవకాశం కనిపిస్తోంది. అయితే అడ్వాన్స్‌డ్‌లో ఈ సారి మార్కుల ఆధారంగా కాకుండా పర్సంటైల్ ఆధారంగా ర్యాంకులను గణినిస్తుండటంతో అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ పర్సంటైల్ ఎంత ఉంటుందనే ఆతృత ఇటు విద్యార్థుల్లోనూ అటు తల్లిదండ్రుల్లోనూ నెలకొంది. ఈ విధానంలో కటాఫ్ పర్సంటైల్‌తో పాటు విద్యార్థులు తమ తమ ర్యాంకులను ఫ్లస్ 8 లేదా మైనస్ 8 ర్యాంకుల తేడాతో అంటే 8 ర్యాంకులు అటు ఇటుగా ముందుగానే లెక్కించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని ప్రత్యేక మార్కుల వద్ద ఒకే మార్కులు సాధించిన విద్యార్థుల సాంద్రత ఎక్కువగా ఉంటే ఆ ప్రత్యేక పర్సంటైల్ వద్ద మాత్రం ర్యాంకుల్లో కొద్దిపాటి ఎక్కువ తేడా వచ్చే అవకాశం ఉంది. సాధారణంగా అన్ని కేటగిరీ లలో కలిపి 2,24,000 మందిని అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపిక చేస్తారు. గతంలో మార్కులను పరిగణనలోకి తీసుకున్నందున సమాన మార్కులు పొందిన మరో 7 వేల మంది కూడా అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యే అవకాశం ఉంది. దీంతో కలిపితే 2,31,000 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తారు. ఈ సారి పర్సంటైల్ శాతంతో ర్యాంకులను ఇస్తున్నందున 7 దశాంశాల వరకు పర్సంటైల్ గణిస్తున్నందున లబ్ధి పొందే వారి సంఖ్య కేవలం పదుల్లోనే ఉండే అవకాశం ఉండవచ్చని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఓపెన్ కేటగిరీ కటాఫ్ పర్సంటైల్ ఇలా..

ముందే చెప్పుకున్నట్టు అన్ని కేటగిరీల్లో కలుపుకొని అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యే విద్యార్థుల సంఖ్య సుమారు 2,24,000 మంది ఉంటారు. ఇందులో ఓపెన్ కేటగిరీ విద్యార్థుల సంఖ్య 50.50 శాతం. అంటే సుమారు 1,13,120 మంది. వీరిలో ఓపెన్ కేటగిరీ దివ్యాంగులు 5 శాతం. అంటే 5,656 మంది. వీరిని మినహాయిస్తే మిగిలిన వారు సుమారు 1,07,464 మంది ఉంటారు. ఇది మొత్తం పరీక్షకు హాజరయిన విద్యార్థుల సంఖ్య 8,74,469 మందిలో 12.2890577 శాతానికి సమానం. అంటే జనవరిలో జరిగిన పరీక్షలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఓపెన్ కేటగిరీలో సుమారు మొదటి 12.2890577 శాతం విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హులవుతారు. దీనినే పర్సంటైల్‌గా తీసుకుంటే 100.0000000 శాతంలో దీనిని తీసివేయాలి. అంటే సుమారు 87.7109423 పర్సంటైల్ అనేది ఓపెన్ కేటగిరీలో కటాఫ్‌గా ఉండే అవకాశం ఉంటుంది. ఎక్కువమంది విద్యార్థుల ప్రయోజనార్థం దీనిని రెండు దశాంశాల వరకు సవరించి 87.70గా నిర్ణయించే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు చెప్పిన కటాఫ్ పర్సంటైల్ జనవరిలో జరిగిన పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్యను బట్టి నిర్ణయించింది. ఇదే విధంగా ఏప్రిల్‌లో జరిగే పరీక్ష ఆధారంగా పర్సంటైల్ మారుతూ ఉంటుంది.



పర్సంటైల్ ఆధారంగా ర్యాంకుల గణన..

విద్యార్థి పొందిన పర్సంటైల్ ఆధారంగా ర్యాంకులను గణినిస్తారు. ఉదాహరణకు 99.0000000 పర్సంటైల్ వచ్చిన విద్యార్థి ర్యాంకును గణించడానికి అతని పర్సంటైల్‌ను 100.00000001 నుంచి తీసివేస్తే 1.00000001 వస్తుంది. దీనిని హాజరైన మొత్తం విద్యార్థుల సంఖ్య 8,74,469తో గుణించి శాతం లెక్కిస్తే 8,744 వస్తుంది. ఆ విద్యార్థి ర్యాంకు 8 ర్యాంకులు అటు ఇటుగా సుమారు 8,744 అని భావించవచ్చు. విద్యార్థుల సాంద్రత ఎక్కువగా ఉండే కొన్ని ప్రత్యేక మార్కుల రేంజ్ సందర్భాలను మినహాయించి ప్రతి 1.0000000 పర్సంటైల్ తగ్గే కొద్ది ర్యాంకు సుమారు 8,744 పెరుగుతుంది. ప్రతి 0.1000000 పర్సంటైల్ తగ్గే కొద్ది ర్యాంకు సుమారు 874.4 పెరుగుతుంది. ప్రతి 0.0100000 పర్సంటైల్ తగ్గే కొద్ది ర్యాంకు సుమారు 87.44 పెరుగుతుంది. ప్రతి 0.0010000 పర్సంటైల్ తగ్గే కొద్ది ర్యాంకు సుమారు 8.744 పెరుగుతూ ఉంటుందని భావించాలి.

7వ సీపీసీ నివేదిక

అజయ్ మిశ్రాకు సమర్పణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన 7వ సీపీసీ తన నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించింది. యూనివర్సిటీలతోపాటు, డిగ్రీ కాలేజీల్లో పనిచే స్తున్న అధ్యాపక సిబ్బందికి ప్రస్తుతం కొనసాగిస్తున్న హెల్త్ స్కీమ్‌ను విశ్రాంత అధ్యాపకులతోపాటు, పదవిలో కొనసాగుతున్న అధ్యాపకులకు కొనసాగించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఎన్ శ్రీనివాసరావు బుధవారం ప్రభుత్వానికి నివేదికను సమర్పిం చారు.

ఉన్నత విద్య ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాకు నివేదికను సమర్పించారు. పెన్షన్‌ను రివిజన్ చేయాలని కమిటీ నివేదికలో సూచించింది.

వంతెన పైనుంచి పడి ఇద్దరి మృతి



శుభం, దినేష్ (ఫైల్‌ఫోటోలు)

ఆదిలాబాద్ రూరల్, ప్రభ న్యూస్ : ఆదిలాబాద్ మండలం చాందా టి బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. రూరల్ ఎస్సై హరిబాబు కథనం ప్రకారం.. బేల మండల కేంద్రానికి చెందిన ఎల్లపల్లి శుభం(25), ఎం.దినేష్(27) మణిహార్‌పూర్‌కు చెందిన వారు. మంగళవారం సాయంత్రం ఆదిలాబాద్‌లో మిషన్ భగీరథ సమావేశానికి హాజరై సాయంత్రం బేల మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా చాందా బ్రిడ్జికి ఢీకొని కిందపడి మృతి చెందారని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.

సీజేతో బీసీ కమిషన్ భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్‌బి రాధాకృష్ణన్‌తో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు బుధవారం హైకోర్టులో సమావేశమయ్యారు. కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు, సభ్యులు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, డాక్టర్ ఆంజనేయగౌడ్‌లు సీజే ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ కమిషన్ తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రచురించిన పలు బీసీ కమిషన్ నివేదికలు, గ్రంథాలను సీజేకు అందజేశారు. తెలంగాణ బీసీ కమిషన్ రిజర్వేషన్ల పెంపుదలకు సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి సమర్పించిన తొలి నివేదికలోని పలు అంశాలను చీఫ్ జస్టిస్ దృష్టికి తీసుకొచ్చినట్టు కమిషన్ చైర్మన్ రాములు తెలిపారు. అలాగే రాష్ట్రంలో అమలులో ఉన్న రిజర్వేషన్ల తీరుతెన్నులను, దేశంలోని బీసీ రిజర్వేషన్లకు ప్రామాణికంగా నిల్చిన పలు కమిషన్ల సిఫారసులపై చర్చించినట్టు తెలిపారు. తెలంగాణ బీసీ కమిషన్ ప్రచురించిన బీసీ నోట్‌బుక్ ఇంగ్లీష్ తొలి ప్రతితోపాటు ఎస్‌కే మురళీధర్‌రావు, జస్టిస్ ఓ చిన్నప్పరెడ్డి నివేదికల తొలి ప్రతులను, పలు గ్రంథాలను సీజేకు అందజేసినట్టు చెప్పారు. బీసీ కమిషన్ చేస్తున్న కృషిని సీజే అభినందించారని బిఎస్ రాములు తెలిపారు.

బాలికపై అత్యాచారం

గుంటూరు, ప్రభ న్యూస్ : గుంటూరు జిల్లాలోని రెంటచింతల మండలంలోని తుమ్మకోటలో ఓ కామాంధుడి కామోద్రేకానికి బాలిక అత్యాచారానికి గురైన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏడేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన లారీడ్రైవర్ మిరియాల జయరావు అత్యాచారానికి పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో బాలిక బహిర్భూమికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న జయరాజు బాలికను సమీపంలోని గడ్డివాము వెనక్కు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన బాలిక కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. బాలికను ఆస్పత్రికి తరలించారు.

మంచిర్యాల-చెన్నూరు రహదారిపై రోడ్డు ప్రమాదం

ఇద్దరు మృతి..8 మందికి గాయాలు

చెన్నూరు రూరల్, ప్రభ న్యూస్ : మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం లింగంపల్లి పెట్రోల్‌బంక్ మూల మలుపు వద్ద బుధవారం మధ్యాహ్నం టిప్పర్-టాటా ఏస్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న జైపూర్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, చెన్నూరు ఎస్సై విక్టర్ సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చెన్నూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏసీపీ వెంకట్ రెడ్డి, ఎస్సై విక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూరు కొత్త బస్టాండ్ ప్రాంతం నుండి 13మంది ప్రయాణికులతో టాటా ఏస్ మంచిర్యాలకు వెళ్తోంది. లింగంపల్లి పెట్రోల్‌బంక్ దాటిన అనంతరం మూలమలుపు వద్ద మంచిర్యాల నుండి ఇసుక లోడ్ కోసం వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో టాటా ఏస్ ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. టాటా ఏస్‌లో ప్రయాణిస్తున్న చెన్నూరు పట్టణం దుబ్బగూడెం ప్రాంతానికి చెందిన కడవండి రాజపోచం(42), మహారాష్ట్రలోని సిర్వంచ దర్గా ప్రాంతంలో నివాసం ఉంటున్న మగ్గి రాజన్న అక్కడికక్కడే మృతి చెందారు. మరో 8మంది తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా చెన్నూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చెన్నూరు ప్రభుత్వాసుపత్రి తరలించిన వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఉన్నత వైద్యం కోసం మంచిర్యాలకు రెఫర్ చేసినట్లు పేర్కొన్నారు. గాయపడ్డ వారిలో చెన్నూరు పట్టణానికి చెందిన రాళ్ళబండి వెంకటేష్, కోటపల్లి మండలం జనగామ గ్రామానికి చెందిన నాయిని లచ్చయ్య, సిర్సా గ్రామానికి చెందిన రాజాగౌడ్, మహారాష్ట్రలోని సిర్వంచకు చెందిన ముదురుకోళ్ళ ప్రబూష్, మగ్గి స్వప్న, చెన్నూరుకు చెందిన ఆకుల సంధ్య, తన్మయి, పోచన్న, ఆకుల సంకీర్తన, టాటా ఏసీ డ్రైవర్ నిట్టూరి రాజబాబు, నాగోసుల పద్మ, మద్దినేని వెంకటేష్‌తో పాటు పలువురికి గాయాలయ్యాయి. సిర్వంచ గ్రామానికి చెందిన గాజుల వ్యాపారి రాజన్న మృతి చెందడంతో అతని భార్య స్వప్న తనతో ఉండటంతో కళ్ళ ఎదుటే భర్త చనిపోవడంతో స్వప్న రోధనలు మిన్నంటాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్టర్ తెలిపారు.

నేటినుంచి 'భగీరథ'పై వర్క్‌షాప్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ ప్రాజెక్టును సమర్థవంతంగా నిర్వహించటంపై దృష్టి పెట్టింది. వేల కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నిర్వహణ కోసం అత్యున్నత పద్ధతులను అన్వేషిస్తోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ విభాగం వివిధ దేశాలతోపాటు, దేశంలోని ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలో గురువారం నుంచి మూడు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించనుంది. గచ్చిబౌలీ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కి)లో ఈ వర్క్‌షాప్ జరగనుంది. మిషన్ భగీరథ ఇంజనీర్లు, అధికారులతోపాటు తాగునీటిసరఫరా విభాగంలో అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఇంజనీర్లు, పలు సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన నున్నారు. తాగునీటి సరఫరా విధానాలపై మూడు రోజులపాటు ఈ సమావేశాల్లో చర్చించనున్నట్లు ఈఎన్‌సి కృపాకర్ రెడ్డి తెలిపారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణలో కాంట్రాక్టు లెక్చరర్లకు ప్రాధాన్యం

• కమిషనర్‌కు లెక్చరర్ల అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో మార్చిలో జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షల్లో అనుభవం ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం ఇంటర్ విద్య కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్ట్ లెక్చరర్లుగా 19 సంవత్సరాల పాటు అనుభవం ఉన్న వారు ఎంతో మంది కాంట్రాక్ట్ అధ్యాపకులున్నారని వారికి ఇంటర్ పరీక్షల నిర్వహ ణలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ లెక్చరర్లు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి నేడు తుది గడువు ఉన్నందున ఈ అవ కాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విభజన హామీల సాధనకు

అంతిమ పోరాటం!

• 1నుండి 13 వరకు నిరసనలు • 11న ఢిల్లీలో ఆందోళన

• అఖిలపక్ష సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు హస్తినలో అంతిమ పోరాటం చేయాలని, ఫిబ్రవరి 1నుండి 13వ తేదీ వరకూ రాష్ట్రవ్యాప్తంగా నిరశనలు, ఆందోళనలు చేపట్టాలని బుధవారం సచివాయలయంలో సీఎం చంద్రబాబు సారథ్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అఖిలపక్ష సమావేశానికి ప్రధాన రాజకీయ పార్టీలు వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, జనసేన, వామపక్షాలు గైర్హాజరయ్యాయి. అయితే, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, బీఎస్పీ, ఎస్పీ, ప్రజాశాంతి పార్టీ, నవతరం, ఆమ్ ఆద్మీ, సచివాలయ ఉద్యోగులు, ఎన్జీవోలు, గెజిటెడ్ అధికారులు, రెవెన్యూ సంఘాల నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం సుదీర్ఘంగా సాగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ ప్రణాళిక కోసమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. రాజకీయ లబ్ధి చూసుకుని సమావేశానికి కొన్ని పార్టీలు హాజరు కాలేదేమోనన్నారు. తాను చేయాల్సిందంతా చేశానని, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడికి ఇప్పటికే రెండుసార్లు అఖిపక్షభేటీ నిర్వహించామని, హోదా సహా చట్టాల అంశాల అమలుకు విశ్వప్రయత్నాలు చేశామని తెలిపారు. లోటు బడ్జెట్‌లోభర్తీ చేయాల్సిన మొత్తం కూడా ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వం సరిగా ఇవ్వలేదన్నారు. విభజన జరిగినప్పుడు రాజకీయ పక్షాలు వివిధ రకాల నిర్ణయాలు తీసుకున్నాయన్నారు. ప్రజా, ఉద్యోగ సంఘాలన్నీ రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాటాలు చేశాయన్నారు. ఒడిస్సా అభ్యంతరం లేదని చెప్పినా విశాఖకు రైల్వే జోన్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. పోర్టుల విషయంలో కూడా కేంద్రం లాభాలకే ప్రాధాన్యతనిచ్చిందన్నారు.

హక్కుల సాధనలో రాజీపడేది లేదు

కేంద్రం సహకరించి ఉంటే దేశాభివృద్ధికి మరింత భాగస్వాములయ్యేవారమని, సహకరించకపోగా ఏపీ ప్రజల పొట్టగొడుతున్నారంటూ ధ్వజమెత్తారు. 60 సంవత్సరాల శ్రమను వదులుకొని వచ్చిన ఏపీ ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా అని ప్రశ్నించారు. ఏపీని ఆదుకోని కేంద్రానికి పన్నులెందుకు కట్టాలని ప్రశ్నించారు. ఏపీకి రావల్సిన హక్కుల సాధనలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఇది 5 కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, ఎక్కడి దాకా అయినా వెళ్లి పోరాటం చేస్తామని సీఎం చంద్రబాబు ఉద్రేకంగా అన్నారు. మిగులు బడ్జెట్ రాష్ట్రానికంటే ఏపీ రాష్ట్ర ఉద్యోగులకు ఎక్కువ ప్రయోజనాలు కల్పిస్తున్నామన్నారు. మంచి వృద్ధిరేటు సాధించి అన్ని రంగాల్లో విజయం సాధించగలిగామన్నారు. ఇది సమష్టి విజయమని చెప్పారు. హైదరాబాద్‌ను వదిలి రావడానికి ఉద్యోగులకు కొంచెం బాధగా ఉందని, అయితే 5 ఏళ్లు ఆగితే అమరావతి హైదరాబాద్ కంటే మిన్నగా ఉంటుందన్నారు. రాష్ట్రానికి రావల్సిన నిధుల మంజూరులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని సీఎం ధ్వజమెత్తారు.

అంతర్రాష్ట్ర మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు



మోటారు సైకిళ్ల దొంగను అరెస్టు చేసి చూపుతున్న సిసిఎస్ పోలీసులు

వరంగల్ క్రైం, ప్రభన్యూస్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను బుధవారం సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుండి సుమారు 2 లక్షల 15 వేల రూపాయల విలువ గల నాలుగు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు సంబంధించిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ క్రైమ్ బిల్లా ఆశోక్‌కుమార్ వివరాలను వెల్లడించారు. నిందితుడు గండెశ్రీ శివకుమార్ హైదరాబాద్ జగద్గిరిగుట్ట ప్రాంతంలో మోటారు మెకానిక్ పని చేసేవాడు. 7వ తరగతి వరకు చదువు కొన్న ఇతడు జల్సాలకు అలావాటు పడి జల్సాలకు సులభంగా డబ్బును సంపాదించాలనే ఆలోచనతో ద్విచక్రవాహనాలను చోరీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశాడన్నారు. 2013లో శివకుమార్, ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసులో నిందితుడు. 2014లో నిందితుడు కూకట్‌పల్లి, జీడిమెట్ల, చిన్నకోడూరు, రాజ్‌గోపాల్ పేట, సిద్దిపేట ప్రాంతాల్లోసుమారు 13 ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడ్డాడని, సిద్దిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేసి సిద్దిపేట సబ్ జైలుకు తరలించారు. అనంతరం హైదరాబాద్ పోలీసులు హత్య, ద్విచక్రవాహనాలు చోరీలకు సంబంధించిన నేరాలపై సిద్దిపేట జైలు నుండి పీడీ వారెంట్‌పై చర్లపల్లిజైలు తరలించారు. రెండున్నర ఏళ్ల జైలు అనంతరం 2017లో విడుదలైనట్టు తెలిపారు. మళ్లీ వాహనాల చోరీని ప్రారంభించాడు. ఇందులో భాగంగా నిందితుడు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నాలుగు, హైదరాబాద్ పరిధిలో ఒక వాహనం చోరీకి పాల్పడ్డాడు. ఇందులో జనగాం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చొప్పున ద్విచక్ర వాహనాల చోరీ చేశాడు. చోరీ చేసిన ఐదు వాహనాల్లో ఒక దాన్ని వినియోగించుకుంటూ మూడింటిని జన సంచారం లేని జనగాం, సూర్యాపేట రోడ్డు మార్గంలో భద్రపర్చాడని, మరో వాహనాన్ని బచ్చన్నపేట శివారు ప్రాంతంలోని చెట్ల పొదల్లో పెట్టాడని వివరించారు. క్రైమ్స్ అదనపు డీసీపీ బి.అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు... సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కె.డేవిడ్‌రాజు, జనగాం ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం జనగామ నుండి సూర్యాపేటకు వెళ్లే మార్గంలో తనిఖీలు చేపడుతుండగా నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు ఒప్పుకున్నాడు. దాచిఉంచిన 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

టీకా వికటించి పసిపాప మృతి

మంచిర్యాల, ప్రభ న్యూస్ : మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం క్రిష్ణకాలనీకి చెందిన 45 రోజుల పాప టీకా వికటించి బుధవారం మృతి చెందింది. క్రిష్ణకాలనీలో నివసించే కడమంద రాజేష్-శ్రీలతలకు పాప జన్మించగా ఆమెకు క్రిష్ణకాలనీలోని ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో టీకా ఇప్పించారు. టీకా ఇప్పించిన అనంతరం పాప స్పృహ తప్పి ఉండటాన్ని గమనించి పాపను ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు తీసుకువెళ్లారు. అందుబాటులో పిల్లల డాక్టర్ లేకపోవడంతో పాపను మంచిర్యాలలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి తరలించారు. పాపను పరిశీలించిన వైద్యుడు పరిస్థితి విషమంగా ఉందని తెలుపడంతో మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పాప మృతికి ఏఎన్‌ఎం నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

తిరుమాలాపూర్ 7వ వార్డుకు రీపోలింగ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వికారాబాద్ జిల్లా పూడూరు మండలం తిరుమలాపూర్ గ్రామ పంచాయతీలో ఏడవ వార్డుకు రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ పంచాయతీలో బుధవారం జరిగిన పోలింగ్ సందర్భంగా అవకతవకలు గుర్తించినట్టు వెల్లడించింది. ఈ కారణంగా ఫిబ్రవరి 1న ఈ పంచాయతీలో 7వ వార్డుకు పంచాయతీ సర్పంచ్ పదవితోపాటు వార్డు స్థానానికి తిరిగి పోలింగ్ జరపాలని ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ ఆదేశించారు.

Andhraprabha business 2019

బిజినెస్

BUSINESS

హెరిటేజ్ ఫుడ్స్ లాభం రూ.20 కోట్లు



హైదరాబాద్ : హెరిటేజ్‌ఫుడ్స్ లిమిటెడ్... దేశంలోని అతి పెద్ద డెయిరీ ఉత్పత్తు ల కంపెనీల్లో ఒకటి. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత రెవెన్యూలో రూ.618.76 కోట్లు నమోదుచేయగా. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.578.93 కోట్లని.. రెవెన్యూలో 6.9 శాతం వృద్ధిని సాధించిందని ఒక ప్రకటనలో వెల్లడించింది. పన్ను చెల్లిం చిన తర్వాత నికరలాభం రూ.20.10 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.16.76 కోట్లని ఒక ప్రకటనలో పేర్కొంది. డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి రెవెన్యూ రూ.1,879.73 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఏడాది త్రైమాసికంలో రూ.1,811.79 కోట్లని.. రెవెన్యూలో 3.7 వృద్ధి సాధించిందని తెలిపింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ.62.43 కోట్లకు ఎగబకాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.42.88 కోట్లని.. నికరలాభంలో 45.6 శాతం వృద్ధిని సాధించిదని, కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా ఒక ప్రకటనలో వివరించారు. మెరుగైన ఫలితాలను సాధించినందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

జెఎస్‌డబ్ల్యూ ఎనర్జీ లాభం మూడింతలు

క్యూ3లో రూ. 147 కోట్లు

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎనర్జీ క్యూ3 ఏకీకృత నికరలాభం మూడింతలు పెరిగి రూ. 147.08 కోట్లకు చేరింది. రెవెన్యూ పెరగ డమే దీనికి కారణం. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 50.55 కోట్లని బీఎస్ ఈకి సమాచారం అందించింది. మొత్తం రెవెన్యూ రూ.2,491.79 కోట్లకు ఎగబా కగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,081.14 కోట్లని వెల్లడించింది. తొమ్మిది నెలల కాలానికి ఆదాయం రూ.7,487.40 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.6,634.88 కోట్లని ప్రకటనలో వెల్లడించింది. కాగా సజ్జన్ జిందాల్‌ను బోర్డు మరోమారు చైర్మన్‌గా తిరిగి నియమిస్తూ తీర్మానం చేసింది.

ఫ్యాక్స్‌కాన్ నుంచి ఏఐ రీసెర్చ్ సెంటర్

ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫ్యాక్స్‌కాన్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్ కంపెనీ హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రీసెర్చ్ అండ్ డవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఫ్యాక్స్‌కాన్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫాం టెక్నికల్ సర్వీస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్‌ను అందిస్తాయి. క్లౌడ్ కంప్యూటింగ్, మొబైల్ డివైసెస్, ఐవోటీ, బిగ్ డేటా, ఏఐ, నెట్‌వర్క్ ట్రాన్స్‌మిషన్, ఆటోమేటెడ్ రోబోటిక్స్ అభివృద్ధి, పరిశోధనపై ఈ సెంటర్ పని చేయనుంది. ఈ సందర్భంగా ఐటిశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ, ఇండస్ట్రియల్ ఏఐ, ఇండస్ట్రియల్ ఐవోటీలకు హైదరాబాద్ గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చెందిందన్నారు. వీటి పరిశోధనకు అవసరమైన అకడమిక్, టెక్నాలజీ టాలెంట్ హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగంలో తెలంగాణ ముందు వరుసలో నిలిచిందని, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, డీజిటల్ ఇండియా లక్ష్యాలు, ఐటి సొల్యూషన్స్‌ను ప్రభుత్వ శాఖలకు అందిస్తున్నట్లు జయేష్ రంజన్ చెప్పారు.

ప్రజాకర్షక బడ్జెట్!

బడ్జెట్ 2019-20

●రైతుల, మధ్యతరగతిపై ఫోకస్ ● ఆదాయపు పన్ను పరిమితి పెంపు? ● రేపే లోక్ సభలో బడ్జెట్ ప్రవేశపట్టనున్న పీయూష్ గోయెల్ ● తాజా అధ్యయనంలో నిపుణుల అభిప్రాయం



కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్. ఈ ఏడాది మే రెండవ వారానికి మోడీ పాలనకు ఐదు సంవత్సరాలు పూర్తవుతుంది. అటు తర్వాత ఎన్నికలు.. కాబట్టి ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టబోయే తాత్కాలిక బడ్జెట్ ఓటర్లను ప్రసన్నం చేసుకొనేలా, మధ్యతరగతికి పెద్ద ఎతున రాయితీలు కల్పించే దిశగానే మోడీ తాత్కాలిక బడ్జెట్ ఉంటుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తాత్కాలిక బడ్జెట్‌లో ఆర్థికమంత్రికి పెద్ద స్వేచ్ఛ లేదా వెసులుబాటు ఉండదు. ఎన్నికలు పూర్తయ్యే వరకే ఈ బడ్జెట్ ఉంటుంది. అటు తర్వాత అధికారంలోకి వచ్చే కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. తాత్కాలిక బడ్జెట్‌లో ప్రభుత్వం కేవలం రెండు లేదా మూడు నెలల పాటు మాత్రమే వ్యయం చేయడానికి వెసులుబాటు ఉంటుంది. కాగా శుక్రవారం పీయూష్‌గోయెల్ లోకసభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

పక్కాగా ప్రజాకర్షక బడ్జెటే

లోకసభ ఎన్నికలకు కేవలం కొన్ని నెలలు మాత్రమే మిగిలి ఉంది. ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను మోడీ సర్కార్ వినియోగించుకుంటుదనడంలో ఎలాంటి సందేహాలు అక్కర్లేదు. ఎందుకంటే ఇటీవల రాష్ట్రశాసనసభలకు జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అధికారాన్ని కోల్పోయింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో ఘోర పరాజయం తర్వాత ప్రస్తుతం చోటా మోటా వ్యాపారవర్గాలను ప్రసన్నం చేసుకొనేపనిలో పడింది. జీఎస్టీని పక్కాగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వానికి వ్యాపారవర్గాలు దూరం అయ్యాయి. చిన్ని చిన్న వ్యాపారస్తుడు కూడా జీఎస్టి రిటర్న్‌ఫైల్ చేయాలంటే వారికి తల కు మించిన భారంగా పరిణమించింది. దీంతో మోడీ స ర్కార్ పై బిజినెస్ కమ్యూనిటీ ఆగ్రహంతో ఉంది. వీరిని మచ్చిక చేసుకోవడానికి బడ్జెట్‌లో పెద్దపీట వేస్తారన్నారు.

రైతులకు, మధ్య తరగతికి తాయిలాలు

రైతులకు, మధ్య తరగతి ఓటర్లను ఆకర్షించడానికి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున తాయిలాలు ప్రకటంచే అవకాశాలు న్నాయి. ముఖ్యంగా వ్యవసాయరంగానికి ... కొన్ని రాష్ట్రా ల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతు రుణాల మాఫీ లాంటివి ప్రకటించే అవకాశాలున్నాయి. మధ్య తరగతి వారు కూడా పన్ను రాయితీ ప్రకటించాలని కోరుతున్నారు. ఇటీవల ఉత్తరాదిన జరిగిన శాసనసభ ఎన్నికల్లో రైతు రుణమాఫీ ప్రకటించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీజేపీ ప్రభుత్వం భావిస్తోంది. దీంతో మోడీ ప్రభుత్వం కూడా రైతు రుణమాఫీతో పాటు మధ్య తరగతికి పన్ను రాయితీలు, కొత్తగా గృహాలు కొనుగోలు చేసే వారికి వడ్డీపై రాయితీ ఇవ్వాలని చూస్తోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వ్యవసాయరంగానికి.. ఇతర రంగాలకు

వ్యవసాయరంగానికి, ఎఫ్ఎంసీజీ రంగాలకు కేటాయింపులు ఎక్కువగా ఉంటాయని.. ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాల రంగాలకు లబ్ది పొందుతున్నాయని, దీంతో పాటు వ్యవసాయం, టెక్స్టైల్, ఫుట్‌వేర్ పరిశ్రమలకు లబ్ది చేకూరేలా బడ్జెట్ రూపొందిస్తారని చెబుతున్నారు. ముఖ్యంగా రైతు కూలీలకు లబ్ధి చేకూరేలా గ్రామీణ వ్యవసాయమార్కెట్లకు ఈ ఆర్థికసంవత్సరంలో రూ.2,000 కోట్లు కేటాయించారు. ఈ సారి దీన్ని మరింత పెంచేఅవకాశాలున్నాయని చెబుతున్నారు. అలాగే వ్యవసాయరంగానికి ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించింది. వాటిని మరింత పెంచే అవకాశాలున్నాయి. కృషిసిచాయి యోజన కింద ఈ ఆర్థికసంవత్సరంలో రూ.2,600 కోట్లు కేటాయిస్తే.. వచ్చే బడ్జెట్‌లో దీన్ని మరింత పెంచే అవకాశాలున్నాయంటున్నారు.

ఇదిలా ఉండగా రైతులు వినియోగించే ఎరువులపై కస్టమ్స్ సుంకం తగ్గించే అవకాశాలున్నాయి.

ఇక టెక్స్‌టైల్స్ రంగా నికి వస్తే.. ఎక్కు వగా కార్మికులపై ఆ ధార పడే నడిచే రంగం కాబట్టి దిగుమతి చేసుకొనే టెక్స్‌టైల్స్ యంత్రాలపై దిగుమతి సుంకాన్ని తగ్గించే అవకాశాలున్నాయి. అలాగే ఫుట్‌వేర్‌పై రూ.1,000 అంత కంటే ఎక్కువ ధరలపై జీఎస్టిని 18 శాతం నుంచి 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చౌకరకం గృహాలపై

చౌకరకం గృహాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం మౌలికరంగానికి రూ.5.97 కోట్లు కేటాయించింది. ఈ సారి దాని కంటే మరింత ఎక్కువనే కేటాయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. దీంతో పలు పథకాలు ఉదాహరణకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) అటల్ మిషన్ ఫర్ రెజెన్యుయేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ ఫార్మేషన్(అమృత్) లాంటి అమల్లోకి రాగలవు. అలాగే సిమెంట్, ఉక్కు కంపెనీలు కస్టమ్స్ సుంకం తగ్గిస్తాయనే ఆశతో ఉన్నాయి.

ఆయుష్‌మాన్ భారత్‌ను బలోపేతం చేయండి



సునీతారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్

హెల్త్‌కేర్ రంగంలో ఆర్థికంగా బలహీనమైన వర్గాల కోసం తీసుకొచ్చిన ఆయుష్ మాన్ భారత్‌ను బలోపేతం చేయా లని అపోలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఆయుష్‌మాన్ స్కీంను తీసుకొచ్చినా మధ్య తరగతికి ఇప్పటికి సరైన వైద్యం అందడం లేదన్నారు. ప్రభుత్వం ముందుగా యూనివ ర్సల్ హెల్త్ కవరేజి కింద మెడికల్ ఇన్స్యూరెన్స్ ప్రీమియం సెక్షన్ 80డీ కింద కవరేజి డిడక్షన్‌ను పెంచాలని కోరారు. అలాగే ఉద్యోగులకు మెడికల్ అలవెన్స్‌ను పెంచాలని.. దీన్ని ద్రవ్యోల్బణంతో అనుసంధానంచేసి హెల్త్‌చెకప్ కోసం ప్రత్యేకంగా డిడక్షన్ చేయాలని ఆమె ప్రతిపాదించారు.

హెల్త్‌కేర్ రంగానికి జాతీయ స్థాయిలో అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ..ఈ రంగంలోకి వచ్చే పెట్టుబడులపై రాయితీలు ఇవ్వాలని ముఖ్యంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టాక్స్‌పై సబ్సిడీ, టాక్స్ హాలిడే, కొన్ని రకాల ఆర్థిక రాయితీలు కోరారు. అలాగే హెల్ కేర్ రంగాన్ని జీఎస్టీలో సున్నా శాతానికి తీసుకురావాలన్నారు. అలాగే హెల్త్‌కేర్ రంగంలోనే కొన్ని సేవలపై 5 శాతం జీఎస్టి విధించాలని సూచించారు. ఆదాయపు పన్ను చట్టం 1961 సెక్షన్ 35ఏడీ హెల్త్‌కేర్ రంగంలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు కొన్ని రాయితీలివ్వాలని కోరారు. మెడికల్ టూరిజం జోరందుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, బడ్జెట్‌లో దీనిపై ఫోకస్ పెట్టి ఆదాయంపై మినహాయింపులు ఇచ్చి భారత్‌ను 'హీల్ ఇన్ ఇండియా'గా తీర్చి దిద్దాలన్నారు. హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని, దీంతో పాటు హెల్త్‌కేర్ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి కొన్ని సిబ్సిడీలు ఇవ్వవచ్చునని సూచించారు. దేశంలోని ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటేనే దేశం కూడా ఆర్థికంగా బలోపేతం అవుతుందని.. జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుందని సునీతా రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్‌టీపీసీ డివిడెండ్, బోనస్

నికర లాభం ఫ్లాట్

క్యూ3లో రూ. 2,385 కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎన్‌టీపీసీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో ఎలాంటి పురోగతి లేకుండా ఫ్లాట్‌గా రూ.2,385.41 కోట్లను నమోదు చేసింది. కంపెనీకి వడ్డీల భారంతో పాటు ఇంధనం వ్యయం పెరగడమే కారణమని ప్రకటనలో వివరించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2360.81 కోట్లు లాభాన్ని ఆర్జించినట్లు తెలిపింది. మొత్తం ఆదాయం విషయానికి వస్తే 15.27 శాతం వృద్ధితో రూ.24,308.01 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.21,087.84 కోట్లని వెల్లడించింది. తొమ్మిది నెలల కాలానికి నికరలాభం ఫ్లాట్‌గా రూ.7,399.57 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.7,417.58 కోట్లని వెల్లడించింది. అదే తొమ్మిది నెలల కాలానికి మొత్తం ఆదాయం రూ.69,633.95 కోట్లని.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.61,590.12 కోట్లని ఆదాయంలో 13.06 శాతం పెరిగిందని ప్రకట నలో వి వ రించింది. బుధవారం జరిగిన బోర్డు సమావేశంలో మధ్యంతర డివిడెండ్ 35.8 శాతం లేదా షేరకు రూ.3.58 చొప్పున ప్రకటించింది. డివిడెండ్‌ను ఫిబ్రవరి 14న ఖాతాలో జమచేస్తుంది. అలాగే బోనస్‌ను కూడా సిఫారసు చేసింది. రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి ఐదు షేర్లపై ఒక షేరును బోనస్‌గా ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది.

లాక్మే ఫ్యాషన్ వీక్‌కు శాశ్వత చిరునామా

జియో వరల్డ్ సెంటర్

ముంబై : ఇక్కడి కమర్షియల్ డిస్ట్రిక్ బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లోని జియో వరల్డ్‌సెంటర్‌లోనే ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే లాక్మేఫ్యాషన్ వీక్ (ఎల్ఎఫ్‌డబ్ల్యు) ఇక నుంచి శాశ్వతంగా అక్కడే జరుగుతాయి. వచ్చే ఏడాది జియో వరల్డ్ సెంటర్ ప్రారంభంమైన తర్వాత జియో వరల్డ్ సెంటర్‌లోకి మారిపోయిన తర్వాత ఫ్యాషన్ వీక్ పూర్తి రూపాంతరం చెందుతుందని ఐఎంజీ రిలయన్స్‌కు చెందిన వైస్ ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ ఫ్యాషన్ జస్ప్రీత్ చందొక్ చెప్పారు. ఎల్ఎఫ్‌డబ్ల్యు సమ్మర్ /రీసోర్ట్ 2020 ఎడిషన్ నాటకి జియో వరల్డ్ సెంటర్‌లోకి వెళతామని చందొక్ చెప్పారు. భవిష్యత్తులో శాశ్వతంగా ఎల్ఎఫ్‌డబ్ల్యు షోలు ఇక్కడి నుంచే కొనసాగుతాయని చందొక్ చెప్పారు. ఫ్యాషన్ షోల నిర్వహించడానికి హోటళ్లు, పెద్ద మైదానాల చుట్టూ తిరిగే వాళ్లమని ఇక నుంచి ఆ బాధ తప్పుతుందని, శాశ్వతంగా ఒకేస్థలంలో జరిగితే స్థిరత్వంతో పాటు విశ్వసనీయత లభిస్తుందని చందొక్ వివరించారు. లెక్మే ఫ్యాషన్ వీక్‌ను కాస్మిటిక్, బ్యూటీ సర్వీసెస్ బ్రాండ్ లాక్మేతో పా టు ఐఎంజీ రిలయన్స్ ప్రైవే ట్ లిమిటెడ్‌లు కలిసి సంయుక్తంగా నిర్వహి స్తున్నాయి. మొట్టమొదటి ఎల్ఎఫ్‌డబ్ల్యు 1999లో ప్రారంభమైంది.



చందాకొచ్చర్‌కు బిగిస్తున్న ఉచ్చు!

• నిబంధనలను ఉల్లంఘించారంటూ తాజా నివేదిక



న్యూఢిల్లీ : ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందా కొచ్చర్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవేనని శ్రీకృష్ణ ప్యానెల్ తేల్చి చెప్పింది. కొచ్చర్ ఐసీఐసీఐ బ్యాంకు ప్రవర్తనా నియామవళిని, అంతర్గత విధానాలను ఉల్లంఘించారని శ్రీకృష్ణప్యానెల్ నివేదికలో పేర్కొంది. బుధవారం నాడు నివేదిక బ్యాంకుకు సమర్పించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన బ్యాంకు తక్షణమే ఆమెను విధులను తొలగించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. చందాకొచ్చర్ బ్యాంకు సీఈవో, ఎండీగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి వీడియోకాన్‌కు రూ.3,250కోట్లు రుణాలు మంజూరు చేసి దానికి ప్రత్యామ్నాయంగా తన భర్త దీపక్ కొచ్చర్‌కు లబ్ధి చేకూర్చే వ్యవహరించారని ఆమెపై ఆరోపణలు రావడంతో ఆమెపై బ్యాంకు అంతర్గతంగా విచారణకు ఆదేశించింది. విచారణ పూర్తయ్యే వరకు ఆమెను సెలవుపై వెళ్లమని బలవంతంగా పంపిం చింది.తాజాగా శ్రీకృష్ణ ప్యానెల్ చందాకొచ్చర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని నివేదిక లో ప్రకటించడంతో బ్యాంకుకు కూడా తక్షణమే స్పందించి ఆమెను విధులను తొలగించింది. దీంతో ఆమెకు వచ్చే ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, మెడికల్ బెనిఫిట్స్, స్టాక్‌ఆ ప్షన్స్ రద్దవుతాయి. దీంతో పాటు ఏప్రిల్ 2009 నుంచి మార్చి 2018 వరకు తీసుకొన్న బోనస్‌ను బ్యాంకుకు తిరిగి చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. చందా కొచ్చర్ విషయానికి వస్తే ఒకప్పుడు సెలెబ్రిటి బ్యాంకర్‌గా ఆమె ఖాతాలో ఎన్నో అవార్డులు రివార్డులు వచ్చి చేరాయి. తాజా ఆరోపణతో ఆమె పరపతి పూర్తిగా మసకబారిపోయింది.

ఐసీఐసీఐ లాభం రూ.1,605 కోట్లు

క్యూ3లో 3 శాతం క్షీణత

ఐసీఐసీఐ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 2.75 శాతం క్షీణించి రూ.1604.91 కోట్లు నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1650.24 కోట్లు ఆర్జించింది. అయితే మొండిబకాయిలు కాస్తా మెరుగుపడి 7.75 శాతానికి దిగిరాగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో 8.54 శాతంగా నమోదైంది. నికర ఎన్‌పీఏ 2.58 శాతానికి దిగిరాగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో 3.65 శాతంగా నమోదైంది. నికరవడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.6,875 కోట్లకు ఎగబాకింది. మొండిబకాయిలకు కేటాయింపులు 18.89 శాతానికి చేరి రూ.4244.15 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 3569.56 కోట్లని తెలిపింది. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.3994.29 కోట్లని ఒక ప్రకటనలో వెల్లడించింది.



స్థానిక కరెన్సీల్లో రుణాలు..

చైనా ఏఐఐబీ ప్రణాళిక

బీజింగ్ : చైనాకు చెందిన ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వె స్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) ఆసియాలోని కొన్ని దేశాల్లో స్థాని క కరెన్సీల్లోనే రుణాలు ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. ఈ ఏడాది చివరి నాటికి అమలు చేయనుంది. ఏఐఐబీ నుంచి భారత్ పెద్దమొత్తంలో రుణాలు సేకరిస్తోంది. ఏఐఐబీ బ్యాంకు ప్రెసిడెం ట్ జిన్ లిక్విన్ మాట్లాడుతూ.. కరెన్సీ మార్పిడిలో ఒడిదుడుకుల వల్ల పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోందని వివరించారు. భారత్‌తో పాటు పాకిస్తాన్, ఇండోనేషియాలు కూడా ఏఐఐబీ నుంచి రుణాలు తీసుకుంటాయి. గతేడాది డాలర్ బలపడ్డం.. అదే సమయంలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల కరెన్సీ బలహీనపడడ్డం ఇబ్బందులకు గురిచేస్తోందని తాజా గా మంగళవారం ఏఐఐబీ విడుదల చేసిన నివేదిక లో వెల్ల డించింది. కరెన్సీ ఒడిదుడకుల వల్ల ప్రాజెక్టుల జాప్యం కావడంతో ఇతర ప్రాజెక్టులపై ప్రభావం చూపుతోం దని జిన్ అన్నారు. దీంతో తక్షణమే ప్రాజెక్టు లు పూర్తి చేయడానికి ప్రైవేట్ పెట్టుబ డులు రెట్టింపు చేయాల్సిన అవసరంఉందని ఏఐఐ బీ స్ట్రాటజీ ప్రిన్సిపల్ ఆర్థికవేత్త జాంగ్‌పింగ్ థాయి చెప్పినట్లు చైనా డెయిలీ పేర్కొంది.

ప్రీమియం స్మార్ట్ ఫోన్లలో స్యాంసంగ్ హవా

• 2018లో మార్కెట్ 8 శాతం వృద్ధి • తగ్గిన ఆపిల్ ప్రభావం • కౌంటర్ పాయింట్ నివేదిక



న్యూఢిల్లీ : దేశంలో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు గతేడాది (2018)లో 8 శాతం వృద్ధి కనిపించింది. మార్కెట్ లీడర్‌గా స్యాంసంగ్ స్థానం దక్కించుకుంది. మార్కెట్ వాటా 34 శాతం సాధించిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చి పేర్కొంది. రూ.30వేలు అంత కంటే ఎక్కువగా విలువ కలిగిన స్మార్ట్‌ఫోన్లు ప్రీమియం ఫోన్ల విభాగంలోకి వస్తాయి.

అయితే డిసెంబర్ త్రైమాసికంలో చైనాకు చెందిన వన్ ఫ్లస్ మాత్రం ఏకంగా 36 శాతం వాటాను దక్కించుకుంది. మొత్తానికి చూస్తే ఏడాది ప్రాతిపదికన ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్ మాత్రం 8 శాతం పెరిగింది. అదే డిసెంబర్ త్రైమాసికం ప్రకారం చూస్తే 16 శాతం పెరిగిందని కౌంటర్‌పాయింట్ రీసెర్చి ప్రకటనలో పేర్కొంది. 2018 సంవత్సరం మొత్తానికి చూస్తే ... దేశంలోని టాప్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ మార్కెట్లో సాంసంగ్ 34 శాతం, వన్‌ఫ్లస్ 33 శాతం ఆక్రమించాయి. దేశంలోని టాప్ మూడు బ్రాండ్‌లు వన్‌ఫ్లస్, ఆపిల్, స్యాంసంగ్‌లు నాలుగవ త్రైమాసికంలో 92 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి.

వన్‌ఫ్లస్ ఇండియా జనరల్ మేనేజర్ వికా స్ అగర్వాల్ మాట్లాడుతూ గత కొన్ని త్రైమాసికాల నుంచి వ్యూహాత్మకంగా తీసుకున్న చర్యల వల్ల కంపెనీ బలమైన అమ్మకాలను సాధించిందన్నారు. త్వరలో కస్టమర్‌బేస్‌ను పెంచుకోవడానికి అతి పెద్ద నగరాల్లో ప్రత్యేకంగా స్టోర్‌లపై పెట్టుబడులు పెడుతు న్నామన్నారు. ఏడాది ప్రాతిపదికన చూస్తే డిసెంబర్ త్రైమాసికంలో ఆపిల్ అమ్మకాలు 25 శాతం తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ఐఫోన్ ధరలు ఖరీదైన వ్యవహారమే కారణం. భారత్‌లో తయారయ్యే ప్రీమియం ఫోన్లతో పోల్చుకుంటే ఆపిల్ విదేశాల నుంచి దిగుమతి చేసుకొనే ఫోన్‌పై 20 శాతం దిగుమతి సుంకం చెల్లిస్తోంది. దీంతో ఆపిల్ ఫోన్ ఖరీదైన ఫోన్‌గా మారిపోయింది. తాజా పరిస్థితిని గమనించిన ఆపిల్ ఈ ఏడాది స్థానికంగా దేశంలోనే లేటెస్ట్ ఐఫోన్ ఉత్పత్తి చేయాలని నిర్ణయానికి వచ్చింది.

గతేడాది ప్రీమి యం మార్కెట్లో ఆపిల్ వాటా 23 శాతంగా తేలింది. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో పోటీ తీవ్రంగా ఉంది. చైనీస్ బ్రాండ్ కంపెనీలు ఆండ్రియాడ్ ప్లాట్‌ఫాంపై స్మార్ట్‌ఫో న్లను విడుదల చేయడంతో పెద్దకంపెనీల అమ్మకాలకు గండిపడుతోంది. చైనాకు చెం దిన హువావే, వన్‌ఫ్లస్, స్యాంసంగ్, గూగుల్ ఆపిల్‌కు గట్టి పోటీ ఇస్తున్నాయి.

పీఎన్‌బీ బ్రాంచీల్లో హెల్త్ చెకప్‌లు

• అపోలో హాస్పిటల్స్ సహకారంతో..

హైదరాబాద్ : కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ప్రభుత్వరంగానికి చెందిన పంజాబ్ నేషనల్ బ్యాంకు అపోలో హాస్పిటల్స్ సహకారంలో తెలంగాణ బ్రాంచీల్లో వైద్య పరీక్షలు నిర్వహించింది. బ్యాంకు 125వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సామాజిక సేవ కోసం పలు కార్యకలాపాలు చేపట్టింది. బుధవారం సెఫాబాద్‌లో మొట్టమొదటి ఉచిత హెల్త్‌చెకప్‌ను నిర్వ హించింది. ఈ హెల్త్‌క్యాంప్‌ను సర్కిల్ హెడ్ రాధికా భట్వాడేకర్ ప్రారంభించారు. పీఎన్‌బీఐ కేవలం వ్యాపారం కోణంతోనే కాకుం డా సమాజ శ్రేయస్సును దృష్టి పెట్టుకుంటుందన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సంద ర్భంగా బ్యాంకు తెలంగాణలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిం చింది. సీఎస్ఆర్ కింద వరంగల్ జిల్లాలోని మెడిపల్లిని దత్తత తీసుకొని పలు అభివృద్ధి పనులు చేపడుతుం దన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సర్కిల్ హెడ్ డీఎన్ అంబేద్కర్, చీఫ్ జనరల్ మేనేజర్ సైఫాబాద్ టి శిరిషతో పాటుబ్యాంకు సిబ్బంది, కస్టమర్లు ఈ హెల్త్‌చెకప్‌లో పాల్గొన్నారు.



మార్కెట్ ఫ్లాట్

• ముగిసిన ఎఫ్అండ్ఓ • సిరీస్ కేంద్ర బడ్జెట్ ఫోకస్

ముంబై : స్టాక్ మార్కెట్లు గురువారం నాడు ఫ్లాట్‌గా ముగిశాయి. గురువారంతో జనవరి నెల ఫ్యూచర్ అండ్ ఆప్షన్ ముగిసింది. యూఎస్ ఫెడ్ రిజర్వు విధానం వివరాలు, కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు స్వల్ప నష్టాలను చవిచూ శాయి. సెన్సెక్స్ 1.25 పా యింట్లు, నిఫ్టీ 0.4 శాతం నష్టంతో ముగిశాయి. హెవీ వెయిట్ షేర్లు ఐసీఐసీఐ బ్యాంకు, టాటాస్టీల్ షేర్లు ఐదు శాతం వరకు పెరిగి సూచి మరింత పడిపోకుండా అడ్డుకున్నాయి. ఇక గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందన కనిపిం చింది. అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు బుధ వారం నుంచి మొదలయ్యాయి. ఇన్వెస్టర్లు తాజా పరిణామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ట్రేడింగ్ సరళిని గమనిస్తే.. ప్రారంభం లోనే 200 పాయింట్ల లాభం తో మొదలై అటు తర్వాత 395 పాయిం ట్ల వరకు ఊగిసలాడి చివరకు 1.25 పాయింట్లు నష్టపోయి 35,591.25 వద్ద ముగి యగా.. నిఫ్టీ 0.40 శాతం క్షీణించి 10,651.80 వద్ద స్థిరప డింది. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు మంగళవారం నాడు రూ.354.36 కోట్ల షేర్లు విక్రయిస్తే.. దేశీయ సంస్థాగత మదుప రులు రూ.81.27 కోట్ల షేర్లు కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ గణాంకా లు తెలియజేస్తు న్నాయి.



బీఎస్ఈలో అత్యధికంగా లాభప డిన షేర్లలో ఐసీఐసీఐ బ్యాంకు 6.05 శాతం పెరిగింది బుధవారం క్యూ3 ఫలితాలను వెల్లడించనుంది. టాటాస్టీల్ 5.14 శాతం పెరిగింది. యాక్సిస్‌బ్యాంకు షేరు 4.56 శాతంతో పాటు ఇతర లాభపడిన షేర్లు ... హెచ్‌సీఎల్ టెక్, బజాజ్‌ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఎల్అండ్‌టి, కోల్‌ఇండియా, వేదాంత షేర్లు 2.82 శాతం వరకు లాభప డ్డాయి. దీనికి వ్యతిరేకంగా బజాజ్‌ఆటో, కొటక్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్ బ్యాంకు, సన్‌ఫార్మా, భారతి ఎయిర్‌టెల్, ఐటీసీ, రిల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌యుఎల్, ఒఎన్‌జీసీ, సన్‌ఫార్మాలు 2.65 శాతం వరకు నష్టపోయాయి. గ్లోబల్ మార్కెట్లో మిశ్రమ స్పందన కనిపించింది.



నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం పోతంగల్ గ్రామంలో నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత తన ఓటు హక్కువినియోగించుకున్నారు. మామ రాంకిషన్‌రావుతో కలిసి పోతంగల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో కవిత ఓటు వేశారు.

ఎన్నికల విధుల్లో వీఆర్‌ఓ మృతి

కోస్గి ప్రభన్యూస్ : పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడతలో పంచాయతీ ఎన్నికల విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో వీఆర్‌వో మృతి చెందిన సంఘటన కోస్గి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కోస్గి మండలంలోని ముశ్రీఫా గ్రామంలో పంచాయతీ ఎన్నికల జీపీ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వో నర్సయ్య(50) ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కుప్పకూలగా గమనించిన తోటి అధికారులు కోస్గిపట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అనంతరం గుండెపోటుతో మృతి చెందినట్లు వారు వివరించారు. మృతుడు స్వస్థలం వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని చంద్రకల్ గ్రామ నివాసి అని తోటి అధికారులు తెలిపారు.



2 నుంచి కొత్త పంచాయతీల పాలన

• కుదిరిన ముహూర్తం • కొలువుదీరనున్న కొత్త సర్పంచ్‌లు • అపాయింట్ డేగా ఫిబ్రవరి 2 • రాష్ట్రంలో 12,706 పంచాయతీలకు కొత్త సర్పంచ్‌లు • మొత్తం ప్రతినిధులు 1,34,385 మంది • తొలి గ్రామ సభలకు ఆదేశాలు జారీ



హై దరాబాద్,ఆంధ్ర ప్రభ: అరునెలల విరామం తర్వాత రాష్ట్రంలో స్థానిక స్వపరిపాలన మళ్లీ రెక్కలు తొడగనుంది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ముగియటంతో కొత్తగా ఎన్నికైన పంచాయతీ పాలక వర్గాలు రాష్ట్ర మంతటా ఫిబ్రవరి రెండున కొలువు దీరనున్నాయి. రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభి వృద్ధి శాఖ కమిషనర్ నీతూ ప్రసాద్ బుధవారం విడుదల చేసిన తెలంగాణ రాజపత్రంలో పంచాయతీ పాలక వర్గాల అప్పాయింటెడ్ డేను ప్రకటించారు. అదే రోజు కొత్త సర్పంచ్‌లు బాధ్యతలు చేపట్టి తొలి సారిగా గ్రామ సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. వివిధ కారణాలరీత్యా ఎన్నికలు జరగని పంచాయతీలు మినహా ఎన్నికలు పూర్తయిన అన్ని పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన అప్పాయింట్ డే అమలు కానుంది. ఎన్నికలు వాయిదా పడి ఆతర్వాత ఫలితాలు వెలువడే పంచాయతీలకు ప్రత్యేకంగా అప్పాయింటెడ్ లెటర్ విడుదల చేయనున్నారు. తెలంగాణ రాజపత్రం ద్వారా ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏకగ్రీవంగా ఎన్నికైన 2134మంది సర్పంచ్‌లతోపాటు ఎన్నికల్లో గెలుపొందిన 10572మంది సర్పంచ్‌లతో మొత్తం 12,706 మంది ఫిబ్రవరి 2న పదవీబాధ్యతలు చేపట్ట నున్నారు. అంతే కాకుండా పంచాయతీల్లో వార్డు స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికైన 29,970 వార్డు సభ్యుల తోపాటు ఎన్నికల పోటీలో గెలుపొందిన 82,749 వార్డు సభ్యులతో కలిపి రాష్ట్రంలో మొత్తం 1,12679 వార్డు సభ్యులు కూడా ఫిబ్రవరి 2న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అదే రోజు సర్పంచ్‌ల అధ్వర్యంలో నిర్వహించే తొలి గ్రామసభలో వార్డు సభ్యులు పాల్గొననున్నారు.

రికార్డు సృష్టించిన పంచాయతీ వ్యవస్థ:

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. ఈ ఎన్నికల ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లోనే అతి పెద్ద గ్రామీణ ప్రజాస్వామ్య వ్యవస్థగా తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ రికార్డు నెలకొల్పింది. రాష్ట్రంలో మొత్తం 12, 732 గ్రామ పంచాయయతీలకు , 1,13,170 వార్డు స్థానాలకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 1న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. మొత్తం మూడు దశలుగా జరిగిన ఎన్నికలు బుధవారం నాటితో ముగిసాయి. వివిధ కారణాల రీత్యా 491 వార్డు స్థానాలకు , 26 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగలేదు.

ఎన్నికల ద్వారా రాష్ట్రంలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలిపి 1,34,385 మంది గ్రామీణ స్వపరిపాలన ద్వారా ప్రజాస్వామ్యవ్యవస్థకు ప్రతినిధులుగా ఎంపిక కావటం హర్షదాయకం అంటూ ప్ర జాస్వామ్యకావ ుకులు పంచాయతీ రాజ్ వ్యవస్థలోని కొత్త ప్రతినిధులకు అభినందనలు తెలుపుతున్నారు.

టీఆర్‌ఎస్ తీన్మార్

• మూడు దశల్లో 8000 పంచాయతీలు కైవసం • ఆఖరి విడతలో 2382 గ్రామపంచాయతీల్లో గెలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామసీమల్లో గులాబీ వికసించింది. పంచాయతీ ఎన్నకల్లో విస్పష్టమైన తీర్పునిస్తూ పల్లెలు కేసీఆర్ వైపు నిలిచాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ తొలిసారి తండాలను, గూడేలను గ్రామపంచాయతీలుగా మార్చగా.. మూడువేలకు పైగా కొత్తపంచాయతీలకు తొలిసారి ఎన్నిక జరిగింది. కొత్తపంచాయతీలు, కొత్త పాలనకు అంకురార్పణ చేసిన కేసీఆర్‌కు పల్లెజనం మరోసారి జైకొట్టారు. మొదటి విడతలో సృష్టించిన ప్రభంజనాన్ని మూడోవిడత దాకా కొనసాగించిన టీఆర్‌ఎస్ రికార్డు సృష్టించింది. ఎన్నిక ఏదైనా గెలుపు టీఆర్‌ఎస్‌దేనని మరోసారి పంచాయతీ ఎన్నికల సాక్షిగా రుజువైందని గులాబీనేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడోవిడతలో 4082 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా 2403 గ్రామపంచాయతీలలో టీఆర్‌ఎస్ మద్దతుదారులు గెలిచారు. స్వతంత్రులు కూడా 483పంచాయతీలలో విజయబావుటా ఎగరేయగా, ఇందులోనూ టీఆర్‌ఎస్ కార్యకర్తల సంఖ్య భారీగానే ఉంది. తొలివిడతలో 4470గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా, టీఆర్‌ఎస్ మద్దతుదారులు 2769గ్రామ పంచాయతీలలో నేరుగా విజయం సాధించగా, మరో 642స్థానాల్లో స్వతంత్రులు విజయం సాధించారు. స్వతంత్రుల్లోనూ 90శాతం మంది టిఆర్‌ఎస్ కార్యకర్తలేనని నేతలు చెప్పారు. ఇక రెండోవిడతలోనూ టీఆర్‌ఎస్ ఇదే ప్రభంజనం చూపింది. 4130 గ్రామపంచాయతీలలో ఎన్నికలు జరగ్గా, 2865పంచాయతీలలో టీఆర్‌ఎస్ మద్దతుదారులు విజయదుందుభి మోగించారు. ఇక్కడ కూడా స్వతంత్రులు 379మంది విజయం సాధించగా.. 300మందికి పైగా టీఆర్‌ఎస్ రెబెల్స్, కార్యకర్తలేనన్న సమాచారం కేంద్రకార్యాలయానికి అందింది.

తొలి రెండువిడతలలోనూ టీఆర్‌ఎస్ హవా కొనసాగగా, ఇపుడు మూడోవిడతలోనూ టీఆర్‌ఎస్ తీన్మార్ మోగించింది. మూడువిడతలు కలిపి 8వేలకు పైగా పంచాయతీలలో టీఆర్‌ఎస్ మద్దతుదారులు విక్టరీ సాధించారు. ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యేలకు, పార్టీ ప్రధానకార్యదర్శులకు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ చేసిన సూచనలు క్షేత్రస్థాయిలో ప్రభావం చూపాయని, మునుపెన్నడూ లేనిరీతిలో పంచాయతీలను టిఆర్‌ఎస్ కైవసం చేసుకుందని నేతలు సంతోషంగా చెబుతున్నారు. మొత్తంగా హడావుడి లేకుండా.. సైలెంట్‌గా పంచాయతీ టాస్క్‌ను కేటీఆర్ పూర్తి చేశారని, ప్రభంజనం లాంటి విజయాలతో బోణీ అదరగొట్టారని రాజకీయవిశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీవర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను నియమించిన తర్వాత తొలి ఎన్నికలోనే మంచి విజయం దక్కింది. ఒక్కో ఎన్నికకు ఒక్కోరకమైన వ్యూహాన్ని అవలంబిస్తున్న టిఆర్‌ఎస్ ఈసారి నేరుగా రాష్ట్రనాయకత్వం జోక్యం లేకుండానే సైలెంట్‌గా విక్టరీ నమోదుచేసింది.

మెదక్‌లో తెరాస హవా

• మూడు విడతల్లో 1,238 పంచాయతీలు టీఆర్‌ఎస్ ఖాతాలో

మెదక్ బ్యూరో, ప్రభన్యూస్ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ మద్దతు దారులు విజయ పరంపర కొనసాగించారు. తుది ఎన్నికల్లో మెదక్ జిల్లాలో టీఆర్‌ఎస్ మద్దతుదారులు 113 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ మద్దతు దారులు కేవలం 18 స్థానాల్లోనే గెలుపొందారు. మెదక్ జిల్లాలోని ఏకగ్రీవాలతో కలుపుకొని 145 పంచా యతీలకు 113 గ్రామాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులు జెండా ఎగురవేశారు. కాంగ్రెస్ మద్దతుదారులు కేవ లం 18 స్థానాలకే పరిమితం అయింది. మొత్తంగా మూ డు విడతల్లో మెదక్ జిల్లానుంచి 469 పంచా యతీలకు గాను 365 పంచాయ తీలను టీఆర్‌ఎస్ కైవసం చేసు కుంది. అలాగే సంగారెడ్డి జిల్లాలో తుది విడతల్లో 199 పంచాయతీలకు గాను 135 స్థానాల్లో టీఆర్‌ఎస్ గెలు పొందగా, 56 స్థానాల్లో గెలుపొందింది. సిద్దిపేట జిల్లాల్లో మూడో విడతలో 122 స్థానాలకు గాను 88 స్థానాల్లో టీఆర్‌ఎస్ మద్దతు దారులు గెలుపొందగా, 18 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు దారులు గెలుపొందారు. ఈ జిల్లాల్లో మూడు విడతల్లో మొత్తం 499 పంచాయతీలకు గాను 417 స్థానాల్లో టీఆర్‌ఎస్, 46 స్థానాల్లో కాంగ్రెస్ మద్ద తుదా రులు గెలుపొందారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1615 పంచాయతీలకు గాను 1238 పంచా యతీల్లో టీఆర్‌ఎస్ ప్రభంజనం ఎగురవేయగా, కేవ లం 253 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందడం జరిగింది.

చివరి విడతలో 88.3 % పోలింగ్

• ముగిసిన పంచాయతీ సమరం • ఓటింగ్‌లో యాదాద్రి జిల్లా టాప్ • అట్టడుగున జగిత్యాల





హై దరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నెల రోజులుగా సాగుతూ వచ్చిన పంచాయతీ ఎన్నికల సమరం ముగిసింది. మొత్తం మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం చివరి దశపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచేపలు జిల్లాల్లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల ముందు బారులు తీరారు. ఉదయం ఏడునుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం పోలింగ్ ముగిసే సరికి 88.03శాతం ఓట్లు పోల్ అయ్యాయి. యాదాద్రి జిల్లాలో అత్యధికంగా 94.99శాతం ఓట్లు పోల్ కాగా , జగిత్యాల జిల్లాలో అతి స్వల్పంగా 77.70 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరిపి వెనువెంటనే ఫలితాలు ప్రకటి ంచారు. వార్డు సభ్యులతో చేతులెత్తే పద్దతిలో ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా నిర్వహించి విజేతలను ప్రకటిచారు. చివరి దశ కింద మొత్తం 4116 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ప్రకటించగా అందులో 577 పంచా యతీల్లో సర్పంచ్ పదవు లు ఏకగ్రీవం అయ్యాయి.మిగిలిన 3529 పంచాయతీలకు బుధవారం పోలింగ్ నిర్వహించారు. అంతే కాకుండా వీటి పరిధిలోని 27582 వార్డు స్థానాలకు కూడా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఓటింగ్‌లో చాంపియన్‌గా యాదాద్రి

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక పోలింగ్ శాతంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కెల్లా యాదాద్రి భువనగిరి జిల్లా చాంపియన్‌గా నిలిచి రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో మొత్తం మూడు దశలుగా ఎన్నికలు జరగ్గా తొలిదశలో 85.76శాతం పోలింగ్ జరిగింది. రెండవ దశలో 88.26శాతం, చివరిదశలో 88.03శాతం పోలింగ్ జరిగింది. అయితే మూడుదశల్లోనూ పోలింగ్‌లో యాదాద్రి జిల్లా ఓటర్లు తమ సత్తా చాటు క ున్నారు. తొలి దశలో 95.32శాతం, రెండవ దశలో 93.71 శాతం, మూడవ దశలో 94.99శాతం పోలింగ్‌తో యాదాద్రి ఆల్ రౌండర్‌గా నిలిచింది. గ్రామ పంచా యతీ ఎన్నికల పోలింగ్‌లో జగిత్యాల అన్ని జిల్లాల కంటే బాగా వెనుక బడి పోయింది. తొలిదశలో వికారాబాద్ జిల్లా 68.25 శాతం పోలింగ్‌తో అన్ని జిల్లాలకంటే వెనకబడి నప్పటికీ ఆ తర్వాత దశల్లో బాగా పుంజుకుంది. జగి త్యాల జిల్లా రెండు, మూడు దశల పోలింగ్‌లా చివరి స్థానం దక్కించుకుంది. ఈ జిల్లాలో రెండవ దశలో 80.23శాతం, మూడవదశలో 77.70 శాతం ఓట్లు పోల్ అయ్యాయి.

జిల్లాల వారీగా పోలింగ్ శాతం

అదిలాబాద్	82.99	నాగర్ కర్నూల్	87.40
భద్రాద్రికొత్తగూడెం	87.24	నల్లగొండ	91.73
జగిత్యాల	77.70	నిర్మల్	89.05
జనగాం	89.42	నిజామాబాద్	79.81
జయశంకర్‌భూపాలపల్లి	84.51	పెద్దపల్లి	88.79
జోగులాంబ గద్వాల	89.81	రాజన్న సిరిసిల్ల	85.30
కామారెడ్డి	86.97	రంగారెడ్డి	88.40
కరీంనగర్	89.66	సంగారెడ్డి	90.15
ఖమ్మం	94.56	సిద్దిపేట	90.73
కొమరంభీ ఆసిఫాబాద్	86.30	సూర్యాపేట	92.60
మహబూబాబాద్	91.54	వికారాబాద్	83.68
మహబూబ్‌నగర్	85.94	వనపర్తి	85.41
మంచిర్యాల	84.04	వరంగల్ రూరల్	89.78
మెదక్	90.28	వరంగల్ అర్బన్	88.80
		యాదాద్రిభువనగిరి	94.99

ఒక్క ఓటుతో గెలుపు

నసురుల్లాబాద్, ప్రభన్యూస్ : మండలంలో నూతనంగా ఏర్పాటైన కామారెడ్డి జిల్లా బస్వాయిపల్లి గ్రామపంచాయతీలో తెరాస పార్టీ బలపరిచిన అభ్యర్థి ఫాతి మా బేగం ఒక్క ఓటుతో సర్పంచుగా ఎన్నికయ్యారు. గ్రామంలో 351 ఓట్లు నమోద వ్వ గా వాటిలో 176 ఫాతిమాబేగంకు, 175 సుల్తానా బేగంకు నమో దయ్యాయి. దీం తో ఫాతిమాబేగం ఒకే ఒక్క ఓటుతో సర్పంచుగా గెలువడం గ్రామస్థులను ఆశ్చర్యపరిచింది.

సత్తా చాటిన హస్తం

• పంచాయతీ ఫైట్‌లో రెండో స్థానంలో కాంగ్రెస్ • 2,791 సర్పంచ్ స్థానాల్లో మద్దతుదార్ల గెలుపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మంగా తన ప్రభావాన్ని చాటింది. కొన్ని జిల్లాల్లో అధికార టీఆర్‌ఎస్ పార్టీ మద్దతు దారులైన అభ్యర్థులపై కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు పైచేయి సాధించారు. మొత్తం మూడు విడతలుగా 12,751 గ్రామపం చాయి తీలకు ఎన్నికలు జరగ్గా, వాటిలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన అభ్యర్థులు 2791 మంది సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అధికార టిఆర్ ఎస్ పార్టీ మొదటి స్థానంలో ఉండగా, రెండవ స్థానంలో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన సర్పంచ్‌లు ఉన్నారు. తొలివిడతలో 4,470 పంచాయితీలకు గానూ 769 ఏకగ్రీవం అవ్వగా, 3,701 పంచాయితీలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో కాంగ్రెస్ మద్దతు దారులు 920 మంది విజయం సొంతం చేసుకున్నారు. రెండవ విడతలో 4,135 పంచాయితీలకు గాను 788 ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3,342 పంచాయిలకు నిర్వహించిన ఎన్నికల్లో 835 మంది కాంగ్రెస్ మద్దతుదారులు గెలుచుకున్నారు. మూడవ విడతలో 4,116 పంచాయితీలకు గాను 577 ఏకగ్రీవం అవ్వగా, మిగిలిన 3,500 పంచాయితీలలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 1036 కైవసం చేసుకున్నారు. మూడో విడతలో జిల్లాల వారీగా కాంగ్రెస్ మద్దతుదారులు కైవసం చేసుకున్న పంచాయితీల వివరాలు పరిశీలిస్తే.. అదిలాబాద్ 25, భద్రాది కొత్తగూడెం43, జగిత్యాల 20, జనగామ 8, జయశంకర్‌భూపాలపల్లి 32, గద్వాల జోగులాంబ 14, కామారెడ్డి 29, కరీంనగర్ 9, ఖమ్మం49, అసిఫాబాద్ కుమ్రంభీం 35, మహబూబాబాద్ 33, మహబూబ్ నగర్ 51, మంచిర్యాల 23, మెదక్ 22, నాగర్ కర్నూల్ 31, నల్గొండ 98, నిర్మల్ 28, నిజామాబాద్ 120, పెద్దపల్లి24, రాజన్న సిరిసిల్ల 8, రంగారెడ్డి72, సంగారెడ్డి55, సిద్దిపేట 19, సూర్యపేట47, వికారాబాద్ 46, వనపర్తి25, వరంగల్ రూరల్ 31, వరంగల్ అర్బన్ 8, భువనగిరి యాదాద్రి 31 ఉన్నాయి.

ఇందూరులో కారు జోరు

• 814 పంచాయతీలు టీఆర్‌ఎస్ కైవసం
• 90 స్థానాల్లో స్వతంత్రుల గెలుపు..కారెక్కిన విజేతలు
• 261 స్థానాలు ఏకగ్రీవం
• పట్టుకోల్పోయిన కాంగ్రెస్
• ఉనికి లేని బీజేపీ, టీడీపీ



నిజామాబాద్ బ్యూరో, ప్రభన్యూస్ : పంచాయతీ ఎన్నికల్లోనూ టీఆర్‌ఎస్ హవా కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో 9 స్థానాలకు గాను 8 స్థానాలను గెలుచుకున్న టీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1,054 పంచాయతీ స్థానాల్లో 814 గెలుచుకుని ప్రత్యర్థి పార్టీలకు అవకాశం లేకుండా చేసింది. 90 స్థానాల్లో స్వతంత్రులు గెలుపొందారు. కాంగ్రెస్ పార్టీ దాదాపు పట్టును కోల్పోయిన పరిస్థితి ఎదుర్కొంది. టీడీపీ, బీజేపీ, వామపక్ష పార్టీలు కనీసం ఉనికిని కూడా కాపాడుకోలేకపోయాయి. స్వతంత్రులుగా గెలిచిన 90 మంది సర్పంచ్‌లు కూడా టీఆర్‌ఎస్ పార్టీలోకి చేరిపోయారు. దీంతో దాదాపు ఉమ్మడి జిల్లా మొత్తం టీఆర్‌ఎస్ సర్పంచ్‌ల మయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ నేతలు కనీసం తమ మద్దతుదారులకు అనుకూలంగా ప్రచారం కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఓటమి పాలైన అభ్యర్థులంతా గ్రామ పంచాయతీ ఎన్నికలకు దూరంగా ఉండిపోయారు. టీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తమ పార్టీ క్యాడర్‌తో మద్దతుదారులకు బాసటగా నిలిచి ప్రచారం నిర్వహించారు. ముఖ్య నేతలను ఫోన్‌లో మాట్లాడుతూ రెబల్ అభ్యర్థులు లేకుండా ప్రతి పంచాయతీలో ఒకే టీఆర్ ఎస్ అభ్యర్థి ఉండేటట్లుగా చూశారు. గ్రామాల్లో కుమ్ములాటాలు లేకుండా చేయడంతో సునాయసంగా 814 స్థానాల్లో టీఆర్ ఎస్ మద్దతుదారులు గెలుపొందారు.

తుది దశలో 308 జీపీల్లో తెరాస గెలుపు

తుది దశ పంచాయతీ పోరు బుధవారం ముగిసింది. 381 పంచాయతీలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా 109 స్థానాల్లో ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. 279 పంచాయతీలకు ఉమ్మడి జిల్లాలో ఎన్నికలు జరిగాయి. మొత్తం 83.9 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో 308 మంది టీఆర్‌ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. నిజామాబాద్ డివిజన్‌లో 9 మండలాలకు 211 గ్రామాలకు ఎన్నికలు జరుగగా 61 ఏకగ్రీవమయ్యాయి. 148 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ డివిజన్‌లో 170 గ్రామ పంచాయతీలకు గాను 38 ఏకగ్రీవం కాగా 131 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం బాన్సువాడలో 1,42,904 మంది, నిజామాబాద్ జిల్లాలో 1,73,110 మంది ఓట్లు వేశారు. కామారెడ్డిలో 86.31 శాతం, నిజామాబాద్‌లో 79.81 శాతం పోలింగ్ నమోదైంది.

తొలి, రెండో దశల్లో టీఆర్‌ఎస్‌దే హవా

దాదాపు నెల రోజుల పాటు సాగిన పంచాయతీ ఎన్నికల్లో మూడు దశలు పూర్తయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మొదటి విడతలో 341 పంచాయతీలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా 274 పంచాయతీలకు సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. 67 ఏకగ్రీవమయ్యాయి. ఆర్మూర్ డివిజన్‌లో 177 పంచాయతీలకు గాను 141 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా 36 ఏకగ్రీవమయ్యాయి. కామారెడ్డి డివిజన్‌లో 164 పంచాయతీలకు గాను 133 పంచాయతీలకు ఎన్నికలు జరుగగా 31 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో 289 మంది సర్పంచ్‌లుగా టీఆర్‌ఎస్ మద్దతుదారులే గెలుపొందారు.

ఉమ్మడి జిల్లాలో రెండో దశలో 334 పంచాయతీలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా 249 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 85 ఏకగ్రీవమయ్యాయి. కామారెడ్డి జిల్లాలోని ఎల్లారెడ్డి డివిజన్‌లో 192 గ్రామాలకు గాను 140 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. 52 ఏకగ్రీవమయ్యాయి. ఇందులో టీఆర్‌ఎస్ మద్దతుదారులు 119 మంది గెలుపొందారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లో 142 స్థానాలకు గాను 109 పంచాయతీల్లో ఎన్నికలు జరిగాయి. 33 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ 98 స్థానాల్లో టీఆర్‌ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. రెండో దశలో 217 మంది టీఆర్‌ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. మూడు దశల్లో కూడా టీఆర్‌ఎస్ పార్టీ మద్దతుదారుల హవానే కొనసాగింది. మొత్తం 814 మంది టీఆర్‌ఎస్ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేయగా స్వతంత్రంగా గెలిచిన వారంతా త్వరలోనే టీఆర్‌ఎస్ పార్టీలో చేరడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. మొదటి, రెండవ దశలో గెలుపొందిన స్వతంత్ర అభ్యర్థులు దాదాపుగా స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ఎలాంటి ఘర్షణలు, ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిసాయి.

ఆదిలాబాద్‌లో తెరాస హవా

• అంతగా ప్రభావం చూపని కాంగ్రెస్ • సింగిల్ డిజిట్ దాటని బీజేపీ, టీడీపీ

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీ పోరు ముగిసింది. మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మూడో విడత పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహంతో పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మూడో విడతలో జిల్లా వ్యాప్తంగా 85.55 శాతం పోలింగ్ నమోదైంది. పకడ్బందీగా ఓట్ల లెక్కింపు నిర్వహించారు. మూడు విడతల్లోను జిల్లాలో అధికార పార్టీదే హవా కనిపించింది. మెజార్టీ స్థానాలను టీఆర్‌ఎస్ పార్టీ కైవసం చేసుకుంది. కాంగ్రెస్ పార్టీ తమ ప్రభావాన్ని అంతంత మాత్రంగానే చూపింది. బీజేపీ, టీడీపీ పార్టీలకు పంచాయతీ ఎన్నికల్లో చుక్కెదురైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1508 గ్రామపంచాయతీలుండగా 1503 గ్రామపంచాయతీలకు మూడు విడుతల్లో ఎన్నికలు జరిగాయి. మొదటి విడతలో 511 , రెండో విడతలో 489, మూడో విడతలో 503 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే జిల్లావ్యాప్తంగా మూడు విడతల్లో 353 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దాంతో మొదటి విడతలో 378, రెండో విడతలో 366, మూడో విడతలో 411 గ్రామపంచాయతీలకు పోలింగ్ నిర్వహించారు. మూడు విడతల్లోను జరిగిన పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు రెండింటా మూడు వంతులు గెలిచారు. జిల్లావ్యాప్తంగా 1000 పంచాయతీలను టీఆర్‌ఎస్ కైవసం చేసుకోగా 400ల పై చిలుకు గ్రామపంచాయతీలను కాంగ్రెస్ దక్కించుకుంది. మిగిలిన వాటిలో స్వతంత్రులు , ఇతర పార్టీల వారు గెలిచారు. జిల్లావ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

కరీంనగర్‌లో గుబాళించిన గులాబీ

• తుది విడతలోనూ అదే జోరు • 270 పంచాయతీల్లో టీఆర్‌ఎస్ మద్దతుదార్ల విజయం • 57 చోట్ల కాంగ్రెస్, 9 చోట్ల బీజేపీ

కరీంనగర్ బ్యూరో, ప్రభన్యూస్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం జరిగిన మూడో విడత పంచాయతీ ఎన్నికల్లోనూ అధికార తెరాస హవా కనిపించింది. అత్యధిక పంచాయతీల్లో తెరాస మద్దతుదార్లు విజయం సాధించారు. కాగా తాజా ఎన్నికలో 270 పంచాయతీల్లో తెరాస విజయం సాధించినట్లయింది. మూడు విడతల్లో కలిపి నాలుగు జిల్లాల్లో 126 పంచాయతీలు ఏకగ్రీవమైనాయి. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 1,211 పంచాయతీలు ఉండగా వీటికి మూడు విడతల్లో నిర్వహించిన ఎన్నికలు, ఫలితాల ప్రక్రియ బుధవారంతో పూర్తయింది.

మూడో విడతలో 407 పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 44 పంచాయతీలు ఏకగ్రీవం కావడడంతో, ఒక సర్పంచ్ స్థానానికి ఎన్నికలు జరగకపోవడంతో నాలుగు జిల్లాల్లో 366 సర్పంచ్ స్థానాలకు బుధవారం ఎన్నికలు జరిగాయి.

- కరీంనగర్ జిల్లాలో చివరి విడతలో 109 జీపీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా మొత్తంగా 10 సర్పంచ్, 257 వార్డులు ఏకగ్రీవమైనాయి. ఏకగ్రీవం అనంతరం 99 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం ఫలితాలను పరిశీలిస్తే ఈటల రాజేందర్ ప్రాతినిథ్యం వహించిన హుజురాబాద్ నియోజవర్గంలో ఫలితాలు టీఆర్‌ఎస్ వైపు ఎక్కువగా ఉన్నాయి. 72 చోట్ల టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు, 13చోట్ల కాంగ్రెస బలపరిచిన అభ్యర్థులు, టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఒకచోట, బీజేపీ బలపరిచిన అభ్యర్థులు మూడుచోట్ల 20 చోట్ల స్వతంత్రులు గెలుపొందారు.

- జగిత్యాల జిల్లాలో 127 సర్పంచ్ స్థానాలు ఉండగా మూడో విడతలో 10 ఏకగ్రీవం కావడంతో 117 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం ఫలితాలను విశ్లేషిస్తే 80 చోట్ల టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు, 20 చోట్ల కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు, రెండు చోట్ల బీజేపీ బలపరిచిన అభ్యర్థులు, 25 చోట్ల స్వతంత్రులు ఉన్నారు.

- పెద్దపల్లి జిల్లాలో మూడో విడతలో మొత్తం 81 పంచాయతీలు ఆరు ఏకగ్రీవం కావడంతో 75 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మొత్తం ఫలితాలను పరిశీలిస్తే 58 చోట్ల టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు, 12 చోట్ల కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు, మూడుచోట్ల బీజేపీ బలపరిచిన అభ్యర్థులు, 8 చోట్ల స్వతంత్రులు గెలుపొందారు.

- రాజన్న సిరిసిల్ల జిల్లాలో చివరి విడతలో 90 పంచాయతీల్లో ఎన్నికలు జరగవలసి ఉండగా 1 పంచాయతీలో ఎన్నిక జరగలేదు. 14 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా 75 పంచాయతీలకు తుదివిడత ఎన్నికలు జరిగాయి. మొత్తం ఫలితాలను పరిశీలిస్తే టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులు 60చోట్ల 12 మంది కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు, ఒక చోట బీజేపీ బలపరిచిన అభ్యర్థి , 13 చోట్ల స్వతంత్రులు గెలుపొందారు.

ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ముందుకు సాగాలి

● తమిళనాడు మాజీ గవర్నర్ రోశయ్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్యవైశ్యులు అభివృద్ధి దిశగా ముందుసా గేందుకు ఐక్యమత్యంగా ఉండాలని తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య హితవు పలికారు. బుధవారం వాసవీసేవ కేంద్రంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ముఖ్య అతిథిగా రోశయ్య పాల్గొని ప్రసంగించారు. ఉన్నదాంట్లో వ్యాపారాలు నిర్వహించు కుంటూ సేవా కార్యక్రమాలు అత్యధికంగా నిర్వహిస్తున్న సామాజిక వర్గం ఆర్యవైశ్యులేనని అన్నారు. సేవలో ముందుంటూ రాజకీయ రంగంతో పాటు ఇతర రంగాలలో తీవ్ర వెనుకబాటును అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అగ్రవర్ణాలు అనే కారణంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని అన్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వలన కొంత ఉపసమనం లభిస్తుందన్నారు. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్ల కోసం సాగిన పోరాటంలో ఆర్యవైశ్యులు సైతం కీలక భూమిక పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు రామకృష్ణ, పాండుగుప్త, సుబ్బారావు, విడియాల సంజయ్, విశ్వేశ్వరయ్య, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ఇరాక్ బాధితులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇరాక్‌లో చిక్కుకున్న తెలంగాణబాధితులు బుధవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకోగా, కాచిగూడ రైల్వేస్టేషన్‌లో ఎంపీ కల్వకుంట్ల కవిత ఆదేశంమేరకు వీరిని తెలంగాణజాగృతి నేతలు స్వాగతించి స్వస్థలాలకు తరలేలా ఏర్పాట్లుచేశారు. తమకు అన్నివిధాలా సాయం అందించిన ఎంపీ కవితకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఏజెంట్లచేతిలో మోసపోయి ఇరాక్‌లో చిక్కుకున్న 15మంది బాధితులను తానే విమాన,రైల్వే ఛార్జీలు భరించి భోజన ఖర్చులు ఇచ్చి కవిత స్వదేశానికి క్షేమంగా చేరేలా ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన బాధితులు ఎంపీ కవిత దయవల్లే తాము తిరిగి స్వగ్రామానికి చేరుకుంటామని, ఇలా గ్రామాలకు క్షేమంగా చేరుకుంటామని తాము ఊహించలేదని కన్నీటిపర్యంతమవుతూ చెప్పారు. కవిత సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల పనితీరు భేష్

● జస్టిస్ ఆర్‌కే అగర్వాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వినియోగదారుల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల విభాగం కృషి ప్రశంసనీయమని వినియోగదారుల ఫిర్యాదుల పరి ష్కార కమిషనర్ జస్టిస్ ఆర్‌కే అగర్వాల్ ప్రశంసించారు. ఫిర్యాదుల పరిష్కారాల్లో ఈ విభాగం చూపుతున్న చొరవతో సామాన్యులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, దీని సేవలు అభినందనీయమని అన్నారు. ఈనెల 28 నుంచి హైదరాబాద్‌లో ఫిర్యాదులపై విచారణ జరుపుతున్న జస్టిస్ అగర్వాల్, సభ్యురాలు ఎం.శిరీష బుధవారం పౌర సర ఫరాల భవన్‌లోని వినియోగదారుల సలహా కేంద్రం, క మాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే ఈ- పాస్, ఐరిష్ ద్వారా రేషన్ సరుకులు తీసుకునే విధానాన్ని పరిశీలించారు.

ప్రభుత్వ ఐటీఐలో నైపుణ్యాభివృద్ధి కేంద్రం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : యువతకు నైపుణ్యాభివృద్ధి కోసం మరిన్ని వనరులను అందించడంలో భాగంగా హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా హోండా నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) పాతబస్తీలో ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎంవోయూ సంతకాల కార్యక్రమంలో ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ కేవై నాయక్, జాయింట్ డైరెక్టర్ ఎస్‌కేవి నగేష్, హోండా రీజినల్ హెడ్ ఎన్.శ్రీవాత్సవ పాల్గొన్నారు.

1 నుంచి తాల్చేర్-కోలార్ విద్యుత్ నిలిపివేత

హైదరాబాద్,ఆంధ్రప్రభ: లైన్ల నిర్వహణ కారణంగా తాల్చేర్ -కోలార్ కారిడార్ మధ్య ఉన్న 500కెవి విద్యుత్‌లైన్‌లో విద్యుత్ సరఫరాను 31నుంచి ఫిబ్రవరి 6వరకూ నిలిపి వేయనున్నారు. హెచ్‌విడిసి అధ్వర్యంలో జరిగే ఈ పనుల కారణంగా తూర్పు ప్రాంతం నుంచి దక్షిణ రీజియన్‌కు రెండువేల మెగావాట్ల మేరకు విద్యుత్ సరఫరాలో లోటు ఏర్పడనుంది.దీన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అంతర ప్రాంతీయ లింకుల ద్వారా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నారు. దీనిప్రభావం తెలంగాణ రాష్ట్రంపై పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు గ్రిడ్ ఆపరేషన్స్ డైరెక్టర్ బి.నర్సింగరావు పేర్కొన్నారు. లైన్ల నిర్వహణలో భాగంగా ఈ కారిడార్‌లో 31నుంచి ఫిబ్రవరి 2వరకూ 1000మెగావాట్లు, 2నుంచి 4వరకూ 2వేల మెగావాట్లు, 5నుంచి 6వరకూ 1000మెగావాట్లుకు పరిమితి చేయనున్నారు.

అప్పుల్లో తెలంగాణ సర్కార్

● టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పులపై ఆధారపడి నడుస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి నిజాముద్దీన్ విమర్శించారు. రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలు అమలు చేసేందుకు రెండు లక్షల ఇరవై ఐదువేల కోట్లు ఖర్చు అవుతుందని ముఖ్యమంత్రి కెసీఆర్ చెబుతున్నారని, అయితే లక్షల కోట్ల రూపాయలను ఎక్కడి నుంచి తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో నిజాముద్దీన్ మాట్లాడారు.. తెలంగాణలో మిగులు ఆదాయం ఉందని చెబుతూనే కేసీఆర్ దుబార ఖర్చులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నిధుల ఖర్చుపై వివరాలను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆయన విమర్శించారు.

ద.మ రైల్వేకు పెరిగిన సంక్రాంతి ఆదాయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌లో దక్షిణ మధ్య రైల్వే ఆదాయం పెరిగింది. జనవరి 5 నుంచి 25వ తేదీ వరకు ప్రత్యేక రైళ్ళను దక్షిణ మధ్య రైల్వే నడిపింది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రయాణికుల తాకిడి అధికమవ్వడంతో అదనపు ఆదాయం రైల్వేశాఖకు సమకూరింది. జనవరి 11,12,13 తేదీలలోనే సాధారణ టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3.99 కోట్లు ఆదాయంతో పాటు అన్ రిజర్వుడు ప్రయాణికుల సంఖ్య 4.49 లక్షలుగా నమోదైంది.జరిమానాల రూపంలో ఆదాయం రూ. 20.38 లక్షలగా నమోదైందని రైల్వే అధికారులు తెలిపారు.

వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలి

● ఎన్నికల్లో అవకతవకలపై హైకోర్టులో కాంగ్రెస్ నేతల పిటిషన్ ● కౌంటర్ దాఖలు చేయండి ● ఈసీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపులో అవకతవకలు చోటుచేసుకున్నాయని, నిర్ణీత సమయానికి ముందే పోలింగ్ నిలిపివేశారని, ఈవీఎం యంత్రాల్లోని ఓట్లు, వీవీప్యాట్ స్లిప్పులకు వ్యత్యాసం చోటుచేసుకుందని పేర్కొంటూ ఓటమి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి వివరాలతో ఫిబ్రవరి 14లోగా కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్.రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డితో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 14కు వాయిదా వేసింది. తమ నియోజకవర్గాల్లోని, వీవీప్యాట్ స్లిప్పులను లెక్కించేలా ఈసీఐని ఆదేశించాలని అభ్యర్థిస్తూ ఇబ్రహీంపట్నం ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన మల్‌రెడ్డి.రంగారెడ్డి, కోదాడ, తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీచేసి ఓటమి చెందిన నలమద.పద్మావతిరెడ్డి, అద్దంకి.దయాకర్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాకేష్ ముంజల్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల్లో ఉపయోగించిన వీవీప్యాట్లపై ఉన్న ప్రింట్ 45 రోజుల్లోగా చెరిపివేయబడుతుందని నిపుణులు అభిప్రాయపడ్తున్నారని విన్నవించారు. అందువల్ల పిటిషన్లపై శీఘ్రగతిన విచారణ పూర్తి చేయాలని అభ్యర్థించారు. ఎన్నికలు ముగిశాయి. ఫలితాలను ప్రకటించారు. కానీ కోర్టులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన వ్యాజ్యాలను విచారణకు స్వీకరించడం లేదన్నారు. పైగా ఎన్నికల వ్యాజ్యాలపై(ఈపీ) విచారణకు అధికంగా సమయం పడ్తుందన్నారు. అందువల్ల అన్ని ఈవీఎం యంత్రాల్లోని వీవీప్యాట్ల స్లిప్పులను లెక్కించి ఫలితాలను ప్రకటించేలా ఈసీఐ ని ఆదేశించాలని అభ్యర్ధించారు. దీనిపై ఈసీఐ తరపు స్టాండింగ్ కౌన్సెల్ అవినాష్‌దేశాయ్ బదులిస్తూ.. వీవీప్యాట్లను నిర్ణీతసమయం వరకు భద్రపరుస్తామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం స్పందిస్తూ... ఈ వ్యాజ్యాల్లో పిటిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఈసీఐని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 14 కు వాయిదా వేసింది.

హైకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్ నేతలు



అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయంటూ మల్‌రెడ్డి రంగారెడ్డి, ఉత్తమ్ పద్మావతి, అద్దంకి దయాకర్‌లు బుధవారం హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లు స్వీకరించిన హైకోర్టు ఫిబ్రవరి ఏడవ తేదీలోగా పిటిషన్‌కు సంబంధించిన పూర్తి సమాచారంతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడారు.. ఈవీఎంల ట్యాంపరింగ్‌పై ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లో పిటిషన్ దాఖలు చేయాలనే నిబంధన మేరకు హైకోర్టులో పిటిషన్ వేశామన్నారు. వివిప్యాట్‌లలో నిక్షిప్తం అయిన కౌంటింగ్ ఐదు సంవత్సరాల వరకు ఉంటుందని ఎన్నికల కమిషన్ చెబు తుందన్నారు. అయితే తాము వీవీప్యాట్ పేపర్లను లెక్కించాలని డిమాండ్ చేశా మని, ఇప్పటికీ 40 రోజులు గడిచినా ఎన్నికల కమిషన్ నుంచి సమాధానం రాలేదన్నారు. ఈవీఎం, వీవీప్యాట్‌ల లెక్కింపుపై సమాచారం ఇవ్వడం లేదని ఆయన తెలిపారు. పరిస్థితి ఇలాగే కొన్ని రోజులు గడిస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త ఈవీఏ లను ప్రవేశపెట్టి సమయంలో తమ పార్టీ నేతలకు సమా చారం ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఎన్నికల అనం త రం ఈవీఎంలను ప్రైవేటు ప్లేస్‌కు తరలించారని ఆరోపిం చా రు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వీవీప్యాట్ ప్రింట్ అయి న తర్వాతే బాక్స్‌లో పడే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్ని కల సంఘానికి లేఖ రాయబోతున్నామని ఆయన చెప్పారు.

అణుబాంబు వేసినా...ఈవీఎంలు చెక్కుచెదరవు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లను అణుబాంబ్‌తో కూడా నాశనం చేయలేరని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి రజత్ కుమార్ స్పష్టం చేశారు. ఈవీఎంలు ట్యాంపరింగ్ చేశారని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు రేడియో జాకీలు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని హరిత ప్లాజా హోటల్‌లో రేడియో జాకీలకు ఏర్పాటు చేసిన ఒకరోజు అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జేఈవో ఆమ్రపాలి, రవి కిరణ్‌తోపాటు వెంకటచారి, ముష్రఫ్ ఫారూఖ్ తదితరులతోపాటు ఆలిండియా రేడియో జాకీలతోపాటు ప్రైవేటు రేడియో జాకీలు కూడా పాల్గొన్నారు. ఈవీఎంలను భారత ప్రభుత్వరంగ సంస్థచే తయారు చేయబడ్డాయని తెలిపారు. వాటిని ఎటువంటి పరిస్థితుల్లో కూడా ట్యాంప రింగ్ చేసే అవకాశం లేదన్నారు. ఒకసారి ఈవీఎంలో ఏర్పాటు చేసిన చిప్‌లోకి డాటా వెళితే దానిని ఏవిధంగా నూ నాశనం చేయడం కుదరదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో కేవలం 50 శాతమే పోలింగ్ కావడం దురదృష్టకరమని, కానీ ప్రజాస్వామ్య భారతదేశంలో నక్సలైట్ ప్రభావితమైన ఛత్తీస్‌ఘడ్‌లో 76 శాతం పోలింగ్ నమోదయిందని గుర్తు చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా రేడియో జాకీలు అవగాహన కల్పించాలన్నారు.

ప్రభుత్వ విధానంలో జోక్యం చేసుకోలేం

● హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రధానమైన పట్టణాల్లో బార్లు, రెస్టారెంట్ల అనుమతులు అనే అంశం ప్రభుత్వ విధానంలో భాగమైనందువల్ల జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. హైదరాబాద్ నగరంలో మూడు ఎలైట్ బార్లకు అనుమతులను ఇవ్వరాదని ఎక్సైజ్ అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలతో అదనపు ప్రమాణ పత్రం దాఖలు చేయాలని హైకోర్టు పిటిషనర్ తరపు న్యాయవాదిని ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవితో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ ప్రజాహిత వ్యాజ్యాన్ని వరంగల్ కు చెందిన రాజనాల.శ్రీహరి అనే సామాజిక కార్యకర్త దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ . హైదరాబాద్ నగరంలో మూడు ఎలైట్ బార్లను ఏర్పాటుచేసేందుకు అనుమతిస్తూ.. ప్రభుత్వం జీవో 223 ను జారీ చేసిందన్నారు. ఇది సాధారణ బార్లు, రెస్టారెంట్లకు అనుమతించే రెగ్యులర్ పాలసీకి అదనం. ఎలైట్ బార్లకు ప్రతిఏటా లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇందుకు అవసరమైన వార్షిక హెచ్చింపు, లైసెన్సు రుసుము చెల్లించే షరతులతో ఎన్నేళ్లు అయినా వ్యాపారం కొనసాగించే వెసులుబాటుందని తెలిపారు. అందువల్ల ఆ జీవోను సస్పెండ్ చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది సంజీవ్ కుమార్ బదులిస్తూ.. పిటిషనర్ లిక్కర్ డీలర్ల ప్రమేయంతో పిల్ వేశారన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... ప్రజాహిత వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

తెలంగాణలో ప్రతిపక్షం బలం పెరిగింది

● మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్షాల బలం పెరిగిందని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌తో పోల్చి చూస్తే ఈ ఎన్నికల్లో విపక్షాలు మెరుగయ్యాయని అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌పై అనేక అనుమానాలున్నాయని అన్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేసేందుకు వీవీ ప్యాట్లను లెక్కించాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాబోయే అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో ముందస్తు సర్వే ఫలితాలను ప్రకటించనని స్పష్టం చేశారు. ఎవరు ఒత్తిడి చేసినా ఫలితాలు వెల్లడించనని తేల్చిచెప్పారు. తెలంగాణలో వచ్చిన ఫలితాలపై చాలా విశ్లేషణ చేశానని, కొందరు ఈవీఎంలు టాంపరింగ్ చేశారని ఆరోపిస్తున్నారని చెప్పారు. పోలింగ్ శాతం చెప్పటానికి ఈసీకి ఎందుకు చాలా సమయం పట్టిందని ప్రశ్నించారు. ఈ అంశంలో అనుమానాలు తొలగించేందుకు ఎన్నికల సంఘం వీవీప్యాట్లను లెక్క పెట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకంటే, విపక్షాల సీట్ల శాతం కంటే ఓట్ల శాతం చాలా పెరిగిందని విశ్లేషించారు. తాను ఎవరి ఒత్తిడితోనో అబద్ధాలు చెప్పడం లేదన్నారు. ఎన్నికల్లో అన్ని సరిగ్గానే జరిగాయని రుజువు చేస్తే క్షమాపణ చెప్తానని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత పంచాయితీ ఎన్నికల్లో పార్టీలే ఉండవని అన్నారనీ, అయితే అలా జరుగలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ని చాలా సందర్భాల్లో కలిశానని, అందరితోనూ కలుస్తానని అన్నారు. తిరిగి రాజకీయాల్లోకి వస్తే తప్పకుండా అందరికి చెప్తానని అన్నారు. తాను తెలంగాణ నుండి పోటీ చేసే అవకాశం ఉందని, దానిఇరి ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని అన్నారు.

మగబిడ్డకు జన్మనిచ్చిన అమృత



మిర్యాలగూడ రూరల్, ప్రభన్యూస్ : గత యేడాది సెప్టెంబర్ 14వ తేదీన కుల దురహంకార హత్యకు గురైన ప్రణయ్ భార్య అమృతకు బుధవారం మగ బిడ్డ జన్మించాడు. హైదరా బాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రణయ్ ప్రతిరూపానికి అమృత జన్మనిచ్చింది. ప్రణయ్ హత్యకు గురైన అనంతరం అమృత సామాజిక మాధ్యమాలకు ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో ప్రణయ్ మరలా తన కడుపున పుడతాడని చెప్పిన మాటలు నిజమయ్యాయని పలువురు చర్చించుకుంటున్నారు. అమృత - ప్రణయ్‌ల పెండ్లిరోజైన జనవరి 30వ తారీఖున అమృత మగబిడ్డకు జన్మనివ్వడంతో ప్ర ణయ్ కుటుంబ సభ్యులతో పాటు అమృత తమ ప్రణయ్ మళ్లీ జన్మించాడంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన ఫెలోషిప్...ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరిశోధక విద్యార్థులకు ఇచ్చే ఫెలోషిప్‌ను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్), సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్‌ఆర్‌ఎఫ్)కు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను పెంచుతూ కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జేఆర్‌ఎఫ్‌కు రూ. 5000.. ఎస్‌ఆర్‌ఎఫ్‌కు రూ. 3000 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు జేఆర్‌ఎఫ్‌కు ఇప్పటి వరకు రూ. 26,000 ఇస్తుండగా దానిని కాస్త రూ. 31,000 పెంచారు. ఎస్‌ఆర్‌ఎఫ్‌కు ఇప్పటి వరకు రూ. 32,000 ఉండగా అదికాస్త రూ. 35,000 చేసింది. విద్యార్థులకు స్కాలర్‌షిప్ కాకుండా ఆయా యూనివర్సిటీలు ఉన్న ప్రాంతాలను బట్టి హౌజ్ రెంట్ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ)ను ఇస్తారు. మొత్తం కలిపి విద్యార్థికి ఇస్తారు.

ఎదురీతలోనూ..ఎనలేని ప్రగతి

● ఆద్యంతం ఆకట్టుకున్న గవర్నర్ నరసింహన్ ప్రసంగం

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం సహకరించకపోయినా స్పష్టమైన వృద్ధిరేటును నమోదు చేసుకోవడమే ఏపీ అభివృద్ధికి నిదర్శనమని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ పేర్కొన్నారు. ''రాష్ట్ర పునర్విభజన చట్టం ఫలితంగా అనేక అంశాలు ఈ రోజు వరకూ నెరవేరలేదు.. విభజన రాష్ట్ర ప్రజలు అనేక కష్టాలకు గురిచేసింది. విభజనలో ఎటువంటి హేతుబద్ధత లేదు. ప్రజలతో వారి ప్రతినిధులతో సంప్రదింపులూ లేవు.. విభజన సమస్యలపై నేను మాట్లాడటం ఇదే తొలిసారి కాదు.. రాష్ట్రప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించడం కూడా ఇదే మొదటిసారి కాదు.. గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లోనూ ఈ అంశాలను ప్రస్తావించిన విషయాన్ని గౌరవ సభ్యులకు గుర్తు చేస్తున్నానంటూ..'' రాష్ట్ర గవర్నన్ నర్సింహన్ 2019-20 వార్షిక బడ్జెట్ సమావేశాల ప్రారంభోత్స వం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి బుధవారం శాసనసభలో ప్రసంగించారు. ఉదయం 9గంటల 30 నిమిషాలకు శాసనసభ ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలు అనే రెండు అంశాలను ప్రధానంగా ఎంపిక చేసుకొని ముందుకు నడుస్తోందన్నారు. తలసరి ఆదాయం అతి తక్కువగా ఉన్న కొత్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివర్ణించిన గవర్నర్ హైదరాబాద్, చెన్నై, బెంగు ళూరు వంటి రాజధాని లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులలో ముందంజ

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను పెద్ద ఎత్తున చేపట్టి, వాటిలో పలు ప్రాజెక్టులకు ఇప్పటికే అంకితమిచ్చామని గవర్నర్ స్పష్టం చేశారు. అలాగే దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ చేపట్టని విధంగా 'నదుల అనుసంధానం' ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టిన ప్రభుత్వం తమదేనని'పేర్కొన్నారు. భవిష్యత్తులో పంచనదుల మహా సంగమమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గడచిన నాలుగున్నరేళ్లుగా నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై రూ.64,333 కోట్లు ఖర్చు చేశామని, నాలుగున్నరేళ్లలో 23 ప్రాజెక్టులను పూర్తి చేసి, వాటిలో 17 ప్రాజెక్టులను జాతికి అంకితమిచ్చామని గవర్నర్ వెల్లడించారు. మరో 6 ప్రాజెక్టులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, 26 ప్రాజెక్టుల నిర్మాణంలో పురోగతిలో ఉండగా, 13 ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని గవర్నర్ తెలిపారు.

బిందు సేద్యంలో అగ్రస్థానం

దేశంలో మైక్రో ఇరిగేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందని గవర్నర్ నరసింహన్ వెల్లడించారు. నాలుగేళ్లలో మైక్రో ఇరిగేషన్‌ను రెట్టింపు చేయడంతో 5.63 లక్షల హెక్టార్ల నుండి 11.53 లక్షల హెక్టార్లకు సాగును పెంచుకున్నామన్నారు. దేశంలో ముందున్న 10 జిల్లాల్లో 6 జిల్లాలు మన రాష్ట్రానికి చెందినవే కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. వాటిలో అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి ఉన్నాయన్నారు. మైక్రో ఇరిగేషన్‌లో రాయలసీమ జిల్లాలు ముందంజలో ఉండటం ప్రభుత్వం సాధించిన ఘన విజయమన్నారు.

పథకాలపై ప్రచారం చేయకే ఓడిపోయాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇటీవల రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలను సరిగా ప్రచారం చేయలేకే ఓడిపోయామని భారతీయ జనతాపార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ యాదవ్ అన్నారు. తమ పార్టీ ఓడిపోయిందని నిరాశ చెందడం లేదని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలలో చైతన్యం తీసుకొస్తామన్నారు. తెలంగాణలో ఐదు నుంచి ఎనిమిది పార్లమెంట్ స్థానాలను భాజపా కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఫిబ్రవరి 15,16 తేదీలలో ఢిల్లీలో జాతీయస్థాయి ఓబీసీ మహా సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ సమ్మేళనంలో పార్టీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, మహిళా మోర్చాలు సహా అన్ని రకాల మోర్చా లు పాల్గొంటాయని ఆయన చెప్పారు. బుధవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర ఓబీసీ ఇన్‌చార్జ్ రాజశేఖర్, ఇతర పార్టీ నేతలతో కలిసి నరసింహ యాదవ్ మాట్లాడారు.. రైతుబంధు, పెన్షన్ల వంటి పథకాలతో టిఆర్‌ఎస్ పార్టీ తిరిగి విజయం సాధించిందని, అదే భాజపా మోడీ పథకాలను ప్రచారం చేయడంలో వెనుకబడిందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రంలో భాజపా తిరిగి అధికారంలోకి రావాలని తెలంగాణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారని, ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో భాజపాకు ఓటు వేస్తామని తమతో ప్రజలు చెబుతున్నారని ఆయన తెలిపారు. ఖమ్మం సహా అనేక జిల్లాల్లో భాజపా కార్యకర్తలపై టిఆర్‌ఎస్ కార్యకర్తలు దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఏసీబీ వలలో ఎంవీఐ

● రూ.5వేల లంచంతో పట్టుబడ్డ ఘనుడు



కంది, ప్రభన్యూస్ : సంగారెడ్డి జిల్లా కంది మండలం ఆర్‌టీఐ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఎంవీఐ అనిల్ చౌహాన్, హోంగార్డు సాయిరాం, ఏజెంట్ సాయికుమార్ లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి పరిధికి చెందిన సందీప్ అనే వ్యక్తి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ పేరుపై ట్రాక్టర్ ట్రాలీల తయారీ, విక్రయాలు చేస్తుంటాడు. ప్రతి సంవత్సరం ఈలైసెన్స్ రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది రెన్యువల్ కోసం ఆర్‌టీఏ అధికారులు సందీప్‌కు రూ.5వేలు డిమాండ్ చేశారు. దీంతో చేసేది ఏమీలేక సందీప్ అవినీతి నిరోధక శాఖను(ఏసీబీ) ఆశ్రయించాడు. హైదరాబాద్‌కు చెందిన ఏసీబీ డీఎస్పీ వి.రవికుమార్ బుధవారం కంది మండలంలోని జిల్లా కేంద్ర ఆర్‌టీఏ కార్యాలయానికి సందీప్‌తో వెళ్లాడు. సందీప్ జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వెంకటరమణ (డీటీఐ)ను సంప్రదించగా... ఇన్‌స్పెక్షన్ కోసం ఎంవీఐ అనిల్ చౌహాన్ వద్దకు పంపారు. ఈమేరకు అనిల్ చౌహాన్‌ను సంప్రదించగా హోంగార్డు సాయిరాంతో వెళ్లి బయట ఉన్న ఆర్టీఐ ఏజెంట్ సాయికుమార్‌ను కలవాల్సిందిగా సూచించారు. దీంతో హోంగార్డు, ఏజెంట్ ఇద్దరూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ వలలో పడ్డారు.

ఏపీ 39 ఆన్ రోడ్

● అమల్లోకి ఏకీకృత రిజిస్ట్రేషన్ విధానం



అమరావతి, ఆంధ్రప్రభ : దేశంలోనే ప్రప్రథమంగా రవాణాశాఖలో 'ఒక రాష్ట్రం-ఒక సిరీస్' పేరిట ఏకీకృత రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రవేశపెట్టామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చెప్పారు. విజయవాడలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఏపీ 39న ఏకీకృత సిరీస్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్ వ్యవస్థలో ఏకీకృత విధానం అమలు ప్రవేశపెట్టామన్నారు. ఇదే విధానాన్ని రాష్ట్ర విభజన తర్వాత కూడా అనుసరించడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిరీస్ ఆలోచన చేసిన వెంటనే అధికారులు అందుకు అనుగుణమైన చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగానే ఏపీ-39 సిరీస్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి రూపొందించిన ఈ విధానం అమలు కోసం చట్టంలో పలు మార్పులు చేశామన్నారు. ఇకపై డీలర్ వద్దనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఈ విధానం ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రాష్ట్రానికి భారీగా ఆదాయం సమకూరుతుందని చెప్పారు. ప్రస్తుతం అమలులోని బహుళ సిరీస్‌ల విధానంలో ఫ్యాన్సీ నెంబర్లు ఎక్కడికక్కడే రవాణా శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థుల కోసం ఫ్యాషన్ యాత్ర

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకు ఫిక్కీ ఎఫ్‌ఎల్‌వో మాజీ చైర్మన్ కామిని షరాఫ్ బుధవారం టీచ్ ఫర్ ఛేంజ్ పేరుతో ఫ్యాషన్ యాత్రను నిర్వహించారు. ఈ యాత్ర ద్వారా వచ్చే ఆదాయాన్ని పేద విద్యార్థులకు సహాయంగా అందించనున్నారు. ఒకరోజు పాటు నిర్వహించిన ఈ ఫ్యాషన్ యాత్రలో ప్రఖ్యాత డిజైనర్లు రూపొందించిన అనేక రకాల వస్త్రాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ ఫ్యాషన్ యాత్రలో ఢిల్లీ, ముంబై, జైపూర్, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి అనేక రకాల ఫ్యాషన్ దుస్తులు, మెటాలిక్ ఆభరణాలను ప్రదర్శనకు ఉంచారు. ఇందులో తొమ్మిదేళ్ళ చిన్నారి పూర్వి దోషి తాను డిజైన్ చేసిన బాత్‌బామ్స్‌ను ఈ ప్రదర్శనలో అమ్మకాలకు పెట్టడం గమనార్హం.

జూన్‌కల్లా కాళేశ్వరం

- గోదావరి నీళ్లు ఎత్తిపోతలు ప్రారంభిస్తాం • లింక్ 1,2 పనుల్లో 95 శాతం పూర్తి
- ఏప్రిల్‌కల్లా పనులు పరిసమాప్తి.. జూన్‌లో నీటి సరఫరా • నీటిపారుదల అధికారుల వెల్లడి • ట్రైనీ ఐఏఎస్‌లకు ప్రాజెక్టులపై అవగాహన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన భారీ ఎత్తిపోతల పథకం కాళేశ్వరం పనులు శరవేగంగా సాగుతున్నాయని, అనుకున్న లక్ష్యం ప్రకారం ఈ ఏడాది జూన్‌లో గోదావరి నుండి నీటిని పంపింగ్ చేసేందుకు పూరిస్థాయిలో సన్నద్ధమవుతున్నాన్నామని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. కేవలం రెండేళ్ళలో ప్రాజెక్టు లింక్-1, లింక్-2పనులలో 95 శాతం ప్రగతిని సాధించా మని, ఏప్రిల్‌కల్లా ప్రాజెక్టు పనులన్నీ పూర్తవుతాయని నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, సీఎం ఓఎస్‌డి శ్రీధర్‌రావు దేశ్‌పాండే, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ హరిరామ్‌లు తెలిపారు. నగరంలోని జలసౌధలో వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికా రులకు కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్‌కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలపై అవగాహన కలిగించడానికి సంబంధిత శాఖ ఇంజనీర్లు ప్రజంటేషన్ ఇచ్చారు. భారతప్రభుత్వ డీఓపీటీ ద్వారా పంపిన అధికారులు ఐదురోజుల శిక్షణా కార్య క్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం సీఈ హరిరామ్ ప్రాజెక్టు లక్ష్యాలను, సాంకేతిక వివ రాలను వివ రించారు. ప్రత్యక్షప్రసా రాల ద్వారా హైద రాబాద్ నుండే ప్రాజెక్టు పనులను పర్య వేక్షిస్తున్న విధానాన్ని వివరిం చారు. తర్వాత డ్రోన్ కెమేరా లతో ప్రాజెక్టుపనుల వీడియో రికా ర్డింగ్‌ను వారికి చూపిం చారు. ఏప్రిల్ 30 నాటికే కాళే శ్వరం అన్ని పనులు పూరి చేసుకుని జూన్ నుండి నీటిని ఎత్తి పో సేందుకు కార్యాచరణతో ముందుకు పోతు న్నామని వివరిం చారు.

మార్చికల్లా భగీరథ

నాలుగు దశల్లో చేపట్టిన మిషన్ కాకతీయ అద్భుత విజయం సాధించిందని, రూ.8741.80 కోట్ల వ్యయంతో 21.39లక్షల ఎకరాలను స్థిరీకరించే లక్ష్యంతో 27,653 చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టామని మైనర్ ఇరిగేషన్ సీఈ శ్యాంసుందర్ తెలిపారు. ఇప్పటివరకు 20,192 చెరువుల పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ చెరువుల కింద సుమారు 13.80 లక్షల ఎకరాలు స్థిరీకరించబడ్డాయన్నారు. అనంతరం మిషన్‌భగీరథ కన్సల్టెంట్, రిటైర్డ్ సీఈ జగన్‌మోహన్ మిషన్ భగీరథపై ప్రజంటేషన్ ఇచ్చారు. మూడేండ్లలో 25వేల గ్రామాలకు ఇంటింటికి నల్లా ద్వారా నీరందించే ఈ బృహత్తర కార్యక్రమం పూర్తికావొచ్చిందని గణాంకాలతో, చిత్రాలతో చూపిస్తూ వివరించారు. ఈ మార్చి నెలాఖరుకు మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో నీరు అందిస్తున్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమాల వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని, రాజస్థాన్‌లో కూడా ఇటువంటి కార్య క్రమాలు చేపట్టడానికి తాము కృషిచేస్తామని, వీటి అధ్యయ నానికి అధికారులను పంపుతామని రాజేశ్ శర్మ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాల పట్ల ట్రైనీ అధికారులు సంతృప్తిని వ్యక్తం చేశారు. మంచి ప్రజెంటేషన్ ఇచ్చిన ఇంజనీర్లకు ధన్యవాదాలు తెలిపారు.

దేశమంతా ప్రశంసిస్తుంటే కాంగ్రెస్ విమర్శలా?

- రైతు సంక్షేమంలో తెలంగాణ టాప్ • ఆదర్శంగా రైతుబంధు, రైతు బీమా
- ఓర్వలేకే కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆరోపణ • రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా ఆగ్రహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో అమలవుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తూంటే, కాంగ్రెస్ కిసాన్ సెల్ నేతలు ఉద్దేశపూర్వకంగా విమర్శిస్తున్నారని రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాల తరబడి పాలించి రైతులకు ఏమీ చేయలేకపోయిన కాంగ్రెస్, భాజపాలకు తమ పాలన గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. నాడు యూపీఏ పాలనలో రాష్ట్రం నుంచి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న తాను ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న జైరాం రమేష్ రాష్ట్రం ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా తిరస్కరించారని తెలిపారు. నేడు రాజకీయ లబ్ధి కోసం, ఉనికిని చాటుకునేందు కోసం రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వ్యవసాయానికి జవజీవాలు

వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలన్నింటినీ అందుబాటులోకి తీసుకువస్తూ ఈ రంగాన్ని లాభదాయకంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని గుత్తా స్పష్టం చేశారు. ఇక్కడ మేలైన పథకాలు, మెరుగైన ఫలితాలు ఉన్నందునే పొరుగు రాష్ట్రాల్లోనూ అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని, రైతుబంధు, రైతుబీమా పథకాలపై కేంద్ర ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని తెలిపారు. ఉచిత విద్యుత్, సాగునీరు, పంట పెట్టుబడి ఇస్తూ రైతులకు వెన్నంటి ఉన్న తమ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు దూరంగా వంద శాతం పారదర్శకతతో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.



ఆ రాష్ట్రాలను చూడండి...

మహారాష్ట్ర, తమిళనాడు, హరియాణా, పంజాబ్‌లలో అక్కడి ప్రభుత్వాలు పట్టించుకోక రైతులు నిత్యం రోడ్లపై ఆందోళనలు, గిట్టుబాటు ధరలు లేక ఆక్రందనలు వినిపిస్తున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

వ్యవసాయ, అనుబంధ రంగాల్లోనూ పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు మెరు గుపరిచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సబ్సిడీ గొర్రెలు, ఉచిత చేప పిల్లలు ఇలా అనేక పథకాలు అమలు చేయడంతో పాటు దేశంలోనే ఎక్కడా లేనివిధంగా పాడి పరిశ్రమను ప్రోత్సహిస్తు న్నారని, ప్రతి లీటరుపై రూ.4 బోనస్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని ఆయన స్పష్టంచేశారు. గడిచిన ఐదేళ్ళుగా రాష్ట్రంలో ఎక్కడా ఎరువులు, విత్తనాల కొరత తలెత్తిన దాఖలాలు కనిపించలేదన్నారు. ఇలా చెప్పుకుంటేపోతే ఒక్క వ్యవసాయ రంగమే కాదు అన్ని రంగాల్లోనూ తెలంగాణ అగ్రభాగాన నిలిచింద ని, ఆర్థికాభివృద్ధిలోనూ పైచేయి సాధించిందని వెల్లడించారు. పశ్చిమ బంగా ప్రభుత్వం ఇటీవలే రైతుబంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్న విషయాన్ని కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు గుర్తు పెట్టుకోవాలన్నారు.

పెట్టుబడులకు భరోసా

- పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణ • బంగారు తెలంగాణ లక్ష్యంగా ప్రాధాన్యతలు
- పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉందని, పారిశ్రామికవేత్తల పెట్టుబ డులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ చెప్పారు. బంగారు తెలంగాణ సాధించాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని, ఆ దిశలోనే పారిశ్రామిక విధానాలు రూపొందించారని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అశాంతి లేదని, శాంతి భద్రతల సమస్య ఏమాత్రం లేదని చెప్పారు. బుధవారం జరిగిన ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో జయేష్ రంజన్ పాల్గొన్నారు. ఫిక్కీ జాతీయ అధ్యక్షుడు సందీప్ సోమాని, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంగీతారెడ్డి, ఫిక్కీ తెలంగాణ కౌన్సిల్ చైర్మన్ పి.మురళీధరన్, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ వైవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

100 ఎకరాల్లో డ్రై పోర్ట్

ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ, తెలంగాణ దేశంలోనే కేంద్ర బిందువుగా నిలి చిందని, ఇక్కడి ఉత్ప త్తులను మార్కెట్‌లోకి పంపేందుకు అన్ని ప్రాంతాలకు దగ్గరగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ఎగు మతు ల కోసం 100 ఎకరా ల్లో డ్రైపోర్టు నిర్మాణాన్ని చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానా లతో సులభతర వాణిజ్యంలో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు అనేక రంగాల్లో జాతీయ స్థాయిలో మొదటి రెండు ర్యాంకులను సాధిస్తున్నాయని జయేష్ చెప్పారు.

8500 కంపెనీలకు అనుమతి

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న టిఎస్-ఐపాస్‌తో గడిచిన నాలుగున్నరేళ్ళలో 8,500 చిన్న, పెద్ద కంపెనీలకు అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఇందులో 50 శాతం మేరకు ఉత్పత్తులు ప్రారంభించగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని జయేష్ రంజన్ చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా 15 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నామని, కంపెనీల భవన నిర్మాణాలకు కేవలం 11 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని ఆయన తెలిపారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం భూమిని కేటాయిస్తుందని, మౌలిక సదుపాయాలు కల్పిస్తోందని, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తోందని, అనేక రకాల సబ్సిడీలు, రాయితీలు ఇస్తోందని జయేష్ రంజన్ తెలిపారు.

హైదరాబాద్‌లో భారీ సంస్థలు

రాష్ట్రంలో సోమాని గ్రూపు సంస్థలు ఇప్పటికే నాలుగు కంపెనీలు ఏర్పాటు చేశాయని, మరో రూ.300 కోట్లతో ఫ్రెంచ్ కంపెనీ భాగస్వా మ్యంతో మరో కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇ-కామర్స్‌లో అతిపెద్ద సంస్థ అమేజాన్ ఆసియాలోనే భారీ ఫుల్‌ఫిల్మెంట్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తోందని జయేష్ రంజన్ తెలిపారు.

ఈ సంస్థ 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవనాలు నిర్మిస్తోం దని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఏరో హబ్, ఫార్మా, ఐటి, లైఫ్ సైన్సెస్ సంస్థలు కేంద్రీ కరించాయని చెప్పారు. 30వేల ఎకరాల్లో మెడి కల్ పార్కు, రెండువేల ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కు, ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహిం చేందుకు ప్రత్యేక పార్కులు ఏర్పాటు చేస్తున్నామ న్నారు. ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్ రం గాలను ప్రోత్సహిస్తు న్నామన్నారు. పది రాష్ట్రాలు పారిశ్రామికంగా పురోగతి సాధిం చాయని, కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం వాటిని అధిగమించి ఎదుగుతోందన్నారు. పారి శ్రామిక రంగానికి మౌలిక సదుపా యాలు, విద్యు త్, సబ్సిడీలు ఇచ్చే అంశం పై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించిందని జయేష్ రంజన్ చెప్పారు.

భారత్‌లో మత ఘర్షణలు జరగొచ్చు?

- బీజేపీ హిందుత్వ ఎజెండాతో వెళ్తే ఉద్రిక్తతలు తప్పవు
- ఇదే జరిగితే ఇండియాలో ఇస్లామిక్ తీవ్రవాదం విస్తరించే ప్రమాదం ఉంది
- అమెరికా ఇంటెలిజెన్స్ హెచ్చరిక..

వాషింగ్టన్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా భారత్‌లో మతఘర్షణలు చెలరేగే ప్రమాదం ఉంది. ఈ మతకల్లోలానికి అధికారంలో భారతీయ జనతాపార్టీ కారణం అయ్యే అవకాశం లేకపోలేదు అని అమెరికా జాతీయ ఇంటెలిజెన్స్ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు ఇంటెలిజెన్స్ డైరెక్టర్ డానియల్ కోట్స్ వార్షిక నివేదికను మంగళవారం కాంగ్రెస్ ముందుంచారు. అంతకు ముందు ఇదే నివేదికను సెనెట్ ఇంటెలిజెన్స్ కమిటీకి కూడా అందజేశారు. కోట్స్‌తోపాటు అమెరికాకు చెందిన ఇతర నిఘా సంస్థల అధిపతులు కూడా సెలెక్ట్ కమిటీ ముందు హాజరయ్యారు. ఇందులో సీఐఏ డైరెక్టర్ గినా హాస్పెల్, ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టఫర్ రే, డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ రాబర్ట్ ఆష్లే ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ఒకవేళ బీజేపీ హిందుత్వ వాదాన్ని లేవనెత్తితే అది మత హింసకు దారితీస్తుంది. నరేంద్రమోడీ హయాంలో బీజేపీ అనుసరించిన విధానాల వల్ల బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మతఘర్షణలు చోటుచేసుకున్నాయి. మోడీ పాలనలో ఇండియాలో మతసామరస్యం ఒకింత బలహీనపడింది. రానున్న రోజుల్లో అధికారపార్టీ హిందుత్వ అజెండా వైపు మళ్లుతోంది. ఇదే జరిగితే హిందుత్వ వాదాన్ని తమ మద్దతుదారుల వద్దకు తీసుకెళ్లేందుకు కొంతమేర హింసను ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించే ప్రమాదం ఉంది. క్రమంగా మత హింస పెరగడం వల్ల ఇస్లామిక్ ఉగ్రవాదులు ఇండియాలో బలం పుంజుకునే అవకాశాలున్నాయి. 2019లో ప్రపంచాన్ని కుదిపేసే అంశాలను అంచనావేస్తూ నివేదిక రూపొందించింది. మతఘర్షణలు చెలరేగితే, ముస్లింలు ఆత్మరక్షణలో పడతారు. ఈ పరిస్థితి దేశంలో ఇస్లామిక్ తీవ్రవాద గ్రూపుల వ్యాప్తిని ప్రభావితం చేస్తుంది. దక్షిణాసియా దేశాలకు ఈ యేడాది సవాల్‌గా నిలవనుంది. ఒకవైపు భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు, మరొకవైపు ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్ష ఎన్నికలు జరుగుతుండటమే ఇందుకు కారణం. తాలిబన్లు దాడులకు తెగబడే ప్రమాదం ఉంది. అదే సమయంలో పాకిస్తాన్ భూభాగంలోని మిలిటెంట్ గ్రూపులు పుంజుకునే అవకాశం ఉందని సదరు నివేదిక వెల్లడించింది. ఇక ఇండో-పాక్ సంబంధాల్లో ప్రస్తుతానికైతే ఎలాంటి పురోగతి ఉండదని, సరిహద్దు తీవ్రవాదం, నియంత్రణరేఖ వెంబడి కాల్పుల ఉలంఘనలు మరికొంత కాలం కొనసాగే సంకేతాలున్నాయి. ఈ సమస్యపై తదుపరి చర్యలకు సాధారణ ఎన్నికలు నిర్ణాయకం కానున్నాయని కోట్స్ నివేదిక తెలిపింది.

ముక్కులో ట్యూబుతోనే

(మొదటిపేజీ తరువాయి)

జవాబిచ్చినట్లు అయింది. పారికర్ బక్కపలచగా, నీరసంగా ఉన్నట్లు కనిపించారు. తలపై నీలం రంగు టోపీ ధరించిన పారికర్‌కు రెండు వైపుల ఇద్దరు సహాయకులు నిల్చున్నారు. మధ్యమధ్యలో ఔషధ ద్రావకం సేవిస్తూనే ప్రసంగం కొనసాగించారు. సహాయకులు పేజీలు తిప్పుతుండగా బడ్జెట్ పాఠం పూర్తిచేశారు. కేన్సర్ వ్యాధికి మూడు నెలలపాటు అమెరికాలో చికిత్స పొందిన పారికర్ ఇటీవలే ఇండియాకు తిరిగొచ్చారు. డిసెంబర్ 17న బ్రిడ్జ్ ప్రాజెక్టును పరిశీలించేందుకు తొలిసారి బయటకు వచ్చారు. అప్పుడు ఆయన వెంట ఇద్దరు వైద్యులు ఉన్నారు. మళ్లీ ఇప్పుడు అసెంబ్లీలో దర్శనమిచ్చారు.


నీచ రాజకీయాలు మానుకో.. రాహుల్‌కు పారికర్ కౌంటర్


గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తనతో జరిగిన భేటీని కూడా రాహుల్ రాజకీయంగా వాడుకున్నారని మండిపడ్డారు. వ్యక్తిగతంగా ఐదు నిమిషాలు తనతో భేటీ అయిన రాహుల్ గాంధీ.. తన ఆరోగ్యం గురించే ఆరా తీశారని.. రాఫెల్ అంశం చర్చకు రాలేదని చెప్పుకొచ్చారు. అయినప్పటికీ మీడియాలో ఇద్దరి మధ్య రాఫెల్ గురించిన చర్చ జరిగిందని కథనాలు రావడంపై పారికర్ మండిపడ్డారు. రాహుల్ చెప్పకుంటే మీడియాలో అలాంటి కథనాలు ఎలా వస్తాయని పారికర్ ప్రశ్నించారు. రాఫెల్ నూతన ఒప్పందంలో పారికర్ చేసేదేం లేకుండా మోడీయే పెద్దన్న పాత్ర పోషించారని రాహుల్ ఆరోపించారు.



ఈనేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలను ఖండిస్తూ పారికర్ ఓలేఖను విడుదల చేశారు. పారికర్‌తో భేటీ తర్వాత కోచి వెళ్లిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ కార్యకర్తలతో మాట్లాడుతూ.. ఫ్రెండ్స్ రాఫెల్ నూతన ఒప్పందంలో పారికర్ పాత్ర ఏమీ లేదు.. అనిల్ అంబానీకి మేలు చేసే విధంగా అంతా మోడీయే రెడీ చేశారు.అని వ్యాఖ్యానించారు. ఈనేపథ్యంలో పారికర్ స్పందిస్తూ.. ఇలాంటి నీచ రాజకీయాల కోసమే నాతో ఐదు నిమిషాలు భేటీ అయ్యారా.. మన చర్చలో రాఫెల్ గురించి ఏమైనా మాట్లాడానా..? అని ప్రశ్నిస్తూ పారికర్ లేఖను విడుదల చేశారు.

సక్సేనా, తల్వార్‌ను పట్టుకొచ్చారు..





న్యూఢిల్లీ: అగస్టావెస్ట్‌లాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణం కేసులో దర్యాప్తు సంస్థల అధికారులు మరో ముందడుగు వేశారు. ఈ కేసులో సహనిందితుడు రాజీవ్ సక్సేనాను అధి కారులు భారత్‌కు తీసుకొచ్చారు. దుబాయ్‌లో నివసిస్తున్న ఆయనను భారత్‌కు తరలించారు. రాజీవ్ సక్సేనాతోపాటు లాబీయిస్ట్ దీపక్ తల్వార్‌ను అనే వ్యక్తిని కూడా తీసుకొచ్చారు. బుధవారం రాత్రి వీరిద్దరినీ తరలించారు. గురువారం స్థానిక కోర్టులో ప్రవేశపెట్టనున్నారని సమాచారం. దీపక్ తల్వార్ భారత్ వదిలి దుబాయ్‌కి పారిపోయారు. అక్రమంగా రూ. 1000 కోట్ల ఆస్తులు కలిగివున్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో విమానాల ఒప్పందాలను ప్రోత్సహించారనే ప్రధాన ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ కేసులో సక్సేనాను భారత్‌కు తీసుకురావడం కీలక పరిణామం. అగస్టావెస్ట్‌లాండ్ కుంభకోణంలో మనీలాండరింగ్ వ్యవహారంలో సక్సేనా కీలకపాత్ర పోషించారని దర్యాప్తు సంస్థల అధికారులు భావిస్తున్నారు. దీంతో ఆయనను భారత్ తీసుకురావడం కీలక పరిణామమని పేర్కొంటున్నారు. ఈ కేసులో నిందితుడు క్రిస్టియన్ మిచెల్‌ను భారత్ తరలించిన తర్వాత ఈ పరిణామం జరిగింది.



మంచు విపత్తు

చికాగోలో మైనస్ 60 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

న్యూయార్క్: అమెరికాలో ఉష్ణోగ్రతలు మైసన్ డిగ్రీలకు పడిపోతున్నాయి. మిడ్ వెస్ట్‌ను చలిపులి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు మైనస్ 60 డిగ్రీలకు పడిపోతున్నాయి. గతంలో ఎన్నడూ ఇలాంటి ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. ప్రజలు ఒక్క నిమిషం కూడా బయటకెళ్లలేకపోతున్నారు. భూతాపంతో అసలేం జరుగుతోంది. వాతావరణం సమతాస్థితికి రావాలి. అదే మాక్కావాలి. అంటూ ట్రంప్ ట్వీట్ చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగానే ఇలాంటి పరిణాలు సంభవిస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఒక ప్రాంతంలో ఎక్కువ ఉష్ణోగ్రత ఉంటే మరో ప్రాంతంలో మైనస్ డిగ్రీల్లో నమోదౌతున్నాయి. గ్లోబల్ వార్మింగ్‌తో ఈ శతాబ్దం చివరలో కనీసం 2-7 డిగ్రీ ఫారన్‌హీట్ల ఉష్ణోగ్రతలు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. 2009లో జరిపిన అధ్యయనం ప్రకారం అమెరికాలో 1950 నాటి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా..2000 సంవత్సరంలో అంతకంటే రెండు రెట్లు తక్కువ ఉష్ణోగ్రతలకు పడిపోవడం గమనార్హం.





జువాన్ గైడో

నికోలస్ మదురో

వెనిజువెలాకు ఏమైంది?

వెనిజువెలా ప్రచ్ఛన్నయుద్ధానికి కేంద్రమవుతోందా? ఆ దేశంలో ఎన్నికల ద్వారా ఎన్నికైన అధ్యక్షుడు నికోలస్ మదురో ఒకవైపు, తనకు తానుగా అధ్యక్షుడిగా ప్రకటించుకున్న ప్రతిపక్ష నేత జువాన్‌గైడో మరోవైపు. జువాన్ గైడోకి అమెరికా మద్దతిస్తోంది. మదురోకి రష్యా, చైనాలు అండగా నిలబడ్డాయి. ఇక వెనిజువెలా సైన్యం మాత్రం అధ్యక్షుడు మదురో వెంటే ఉంది. పీటముడిలాబిగుసుకపోయిన వెనిజువెలా రాజకీయ సంక్షోభంలో ఐక్యరాజ్యసమితి ఎటూ మొగ్గకుండా ప్రేక్షక పాత్ర వహిస్తోంది.

వెనిజువెలా రాజకీయ సంక్షోభం

దక్షిణఅమెరికా దేశం వెనిజువెలాలో రాజకీయ సంక్షోభం పతాక స్థాయికి చేరింది. అధ్యక్షుడు నికోలస్ మదురోను పదవి నుంచి తొలగించేందుకు ప్రతిపక్షాల ప్రయత్నాలు, మదురో వ్యవహార శైలి ఈ సందిగ్ధతకు కారణమయ్యాయి. రాజకీయ ఎత్తుగడలకు తోడు దేశంలో అతివేగంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, విద్యుత్ కోతలు, ఆహారం, ఔషధాల కొరత ఈ ఆందోళనలకు మరింత ఆజ్యం పోస్తున్నాయి.



వివాదం వెనుక ఏం జరిగింది..

ఇదివరకు ఎప్పుడూ చూడని, వినని విధంగా వెనిజువెలా ప్రతిపక్ష నాయకుడు జూవాన్ గైడో తనని తాను అధ్యక్షుడిగా ప్రకటిం చుకున్నారు. ఇకపై కార్యనిర్వాహక బాధ్యతలను చేపడతానన్నారు. అప్పటికి రెండు వారాల క్రితమే అధ్యక్షుడిగా రెండోసారి ప్రమాణం స్వీకారం చేసిన నికోలస్ మదురోకి ఇది సవాలుగా మారింది. ప్రతిపక్ష నేత ప్రకటనను మధురో ఖండించారు. అగ్రరాజ్యం అమెరికా కుట్రతో ఆయన ఈ ప్రకటన చేశారని తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

అధ్యక్ష పదవి వివాదానికి కేంద్రబిందువు ఇదే..

2013లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో యునైటెడ్ సోషలిస్టు పార్టీ తరపున 1.6 శాతం ఓట్ల వ్యత్యాసంతో నికోలస్ మదురో అధ్యక్షుడిగా మొదటిసారి ఎన్నికయ్యారు. ఆయన గత ఆరేళ్ల పదవికాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ భారీగా పతనమయింది. లక్షలాది మంది వలసలబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితికి అధ్యక్షుడు, ఆయన పార్టీనే కారణమని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో 2018 మే నెలలో అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఎన్నికల బరిలో నిలవకుండా ప్రతిపక్షాల నేతలను నియంత్రించారు మదురో. అనేకమందిని జైలులో బంధించారు. ఎక్కడ జైలులో పెడతారేమోననే భయంతో అనేకమంది దేశం విడిచిపారిపోయారు. అనేక ప్రతిపక్ష పార్టీలు ఎన్నికలను బాయ్‌కాట్ చేశాయి. ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో అధ్యక్షుడిగా నికోలస్ మదురో రెండోసారి గెలుపొందారు. అయితే రెండోసారి గెలుపొందిన నికోలస్ మదురోను అధ్యక్షుడిగా గుర్తించేందుకు నేషనల్ అసెంబ్లీలో బలమున్న ప్రతిపక్ష పార్టీలు తిరస్కరించాయి. దీంతో నికోలస్ మధురో ఆశ్చర్యకరమైన ప్రకటన చేశారు. ప్రస్తుత పదవి కాలం జనవరి 10 ముగుస్తుందని, ఆ తర్వాత రెండో దఫా అధ్యక్ష పదవికి ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు.

దీంతో ప్రతిపక్ష పార్టీల వాదనలకు మరింత బలం చేకూరింది. ఎన్నికలు సరిగా జరగలేదని, అధ్యక్షపదవిని మదురో దురాక్రమించారని ప్రతిపక్షాలు ధ్వజమెత్తాయి.

అధ్యక్షపదవి ఖాళీగా ఉందని నేషనల్ అసెంబ్లీలో ప్రకటించాయి. దీంతో నేషనల్ అసెంబ్లీ సభ్యుడైన 35 ఏళ్ల జువాన్ గైడో తనను తాను అధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. వెనుజులా రాజ్యాంగంలోని 233, 333 ప్రకారం నేషనల్ అసెంబ్లీ నాయకుడు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టవచ్చు. దీంతో జనవరి 23 నుంచి అధ్యక్షుడిగా కొనసాగుతున్నానని గైడో ప్రకటించుకున్నారు.

మదురోకు మద్దతుగా చైనా, రష్యా..

దౌత్యసంబంధాలను తెంచుకోవడంతో వెనిజువెలాపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించింది. వెనిజువెలాపై అమెరికా ఆంక్షలు విధించడాన్ని రష్యా, చైనా తీవ్రంగా తప్పుబట్టాయి. చట్టపరంగా ఎన్నికయిన మదురోకు మద్దతునిస్తున్నామని రష్యా విదేశాంగశాఖ మంత్రి సెర్గీ లార్వో ప్రకటించారు. అమెరికా విధించిన ఆంక్షలు అంతర్జాతీయ ఆర్థిక పతనానికి దారితీస్తాయని విమర్శించారు. మదురోకు వీలైన సహకారాన్ని అందిస్తున్నామని ప్రకటించారు. విదేశాల వ్యవహారాల్లో కలగజేసుకోవడం అక్రమమని అమెరికాను విమర్శించారు. అమెరికా ఆంక్షలను డ్రాగన్ దేశం చైనా కూడా వ్యతిరేకించింది. విదేశీ వ్యవహారాల్లో వేలు పెట్టడం సమస్యను మరింత జఠిలం చేయడమేనని వ్యాఖ్యానించింది. అయితే స్వార్థంతోనే రష్యా, చైనాలు వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు మద్దతిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇరుదేశాలు భారీగా రుణాలు ఇచ్చాయని, పలు ఒప్పందాలను కుదుర్చుకున్నాయని అందుకే ఆయనకు మద్దతిస్తున్నాయని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఐరాస ఆక్షేపణ..

వెనిజులా మిలిటరీ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని ఐక్యరాజ్యసమితి ఆక్షేపించింది. వెనిజులా సైన్యం వందలాది హత్యలకు పాల్పడుతోందని ఖండించింది. మిలిటరీ అధికారులు అంతర్జాతీయ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ప్రకటించింది.

సరికొత్త ప్రచ్ఛన్నయుద్ధం..

వెనిజువెలాపై ఆర్థిక ఆంక్షలు విధిస్తూ అమెరికా నిర్ణయం తీసుకోవడం చైనా, రష్యాలకు ఆగ్రహం తెప్పించింది. తమ నిరసనను బహిరంగంగానే వెలిబుచ్చాయి. అమెరికా నిర్ణయాన్ని ఖండిస్తున్నామని ఇరుదేశాలు పేర్కొన్నాయి. నికోలస్ మదురోకు కావాల్సిన సహాయం అందించేందుకు కూడా సిద్ధమని ప్రకటించాయి. దీంతో మదురో కూడా తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలంటే చైనా, రష్యాలవైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని దేశాలు వెనిజువెలా ప్రతిపక్షనేత జువాన్ గైడోక ు మద్దతునిచ్చాయి. దీంతో సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గందరగోళానికి ప్రధాన కారణాలు ఇవే..

మాజీ అధ్యక్షుడు హుగో చావెజ్, ప్రస్తుత అధ్యక్షుడు నికోలస్ మదురోలు 1999 నుంచి తమ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారు.



నాటకీయ పరిణామాలు

జువాన్ గైడో ఈ ప్రకటన చేసిన తర్వాత నాటకీయ పరిణామాలు జరిగాయి. నికోలస్ మదురో ప్రభుత్వంలో ప్రజలు చాలా కాలంగా బాధపడుతున్నారు. వెనిజులా మధ్యంతర అధ్యక్షుడిగా జువాన్ గైడోను నేషనల్ అసెంబ్లీ గుర్తించడాన్ని తాను అధికారికంగా గుర్తిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. జువాన్ గైడో ప్రకటన చేసిన కొన్నినిమిషాలకే ట్విట్టర్‌లో ట్రంప్ ఈ ప్రకటన చేశారు. జువాన్ గైడోను వెనిజులా అధ్యక్షుడిగా గుర్తిస్తూ అమెరికా ప్రకటనను కూడా విడుదల చేసింది.

అమెరికా చేసిన ఈ ప్రకటన నికోలస్ మదురోకు ఆగ్రహం తెప్పించింది. జువాన్ గైడోకు అమెరికా మద్దతు ఉందని, తనను తొలగించేందుకు అమెరికా ప్రయత్నిస్తోందనే ఆయన అనుమానాలు బలపడ్డాయి. దీంతో అమెరికాతో దౌత్యసంబంధాలకు ముగింపుపలికారు. వెనిజులాలోని దౌత్యాధికారులు 72 గంటల్లో దేశం విడిచివెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. సార్వభౌమత్వానికి సంబంధించిన ఈ విషయంలో అధ్యక్షుడు నికోలస్ మదురోకు రక్షణనిస్తామని మిలటరీ అధికారులు ప్రకటించారు. దీంతో వెనిజులాలో ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. స్వేచ్ఛ లభించేవరకు నిరసనలు కొనసాగించాలని ప్రతిపక్ష పార్టీలకు జువాన్ గైడో పిలుపునిచ్చారు. జువాన్ గైడోకు అమెరికా, అనేక లాటిన్ అమెరికా దేశాల నాయకులు మద్దతుతెలిపారు. నికోలస్ మదురో అధ్యక్షుడిగా ఉండడాన్ని నేషనల్ అసెంబ్లీ గుర్తించడంలేదని, నేషనల్ అసెంబ్లీలో తీసుకుంటున్న నిర్ణయాలకు నేషనల్ కాన్‌స్టిట్యూట్‌లో ఆమోదం లభించడంలేదని అధ్యక్షుడు నికోలస్ మదురోను ఆయా దేశాలు విమర్శించాయి.

పేదవారికి సహాయంగా నిలిచేందుకు అనేక వస్తువుల ధరలను తగ్గించారు. వంటనూనె, పిండి, వంటి పలు వస్తువులను తక్కువ ధరలకు అందించారు. అయితే ఈ విధానాన్ని ఎక్కువకాలం కొనసాగించలేమని పలు కంపెనీలు తేల్చిచెప్పేశాయి. 2003లో ఫారెన్ కరెన్సీ కంట్రోల్ విధానాన్ని వెనిజువెలాలో ప్రవేశపెట్టిన అధ్యక్షుడు చావెజ్ డాలర్ల బ్లాక్ మార్కెట్‌కు ఆజ్యం పోశారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం నడుపుతున్న కరెన్సీ ఏజెన్సీల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకుని వెనిజువెలా కరెన్సీ బొలివర్స్‌ను చెల్లించి డాలర్లుగా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ నగదును తమవెంట తీసుకెళ్లి డాలర్లను కొనుగోలు చేయాల్సి వచ్చేంది. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారం బొలివర్స్‌తో డాలర్లు కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో అత్యధిక వెనిజువెలా ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బ్లాక్ మార్కెట్లను ఆశ్రయించాల్సి వచ్చింది. అయితే గతేడాది ఆగస్టులో సావర్‌జిన్ బొలివర్ అని కరెన్సీ పేరును మార్చింది. నగదు పరివాణం సమస్య ఎక్కువవ్వడంతో చర్యలు తీసుకుంది. కొత్తగా కొన్ని నాణేలను విడుదల చేసింది. అనంతరం కొన్ని చర్యలు తీసుకున్నా ఆర్థిక వ్యవస్థ పతనాన్ని ప్రభుత్వం అడ్డుకోలేకపోయింది. దీంతో అనేకమంది వెనిజువెలా ప్రజలు దేశాన్ని వీడి విదేశాలకు వలసబాటపట్టారు. దాదాపు 30 లక్షలమందికి పైగా దేశాన్ని విడిచి వలసవెళ్లారు. ఈ పరిణామాలపై ప్రతిపక్షాలు ఆందోళనలు వ్యక్తం చేశాయి.

భద్రతా దళాల చేతుల్లోనే..

ఈ రాజకీయ సందిగ్ధానికి ముగింపు పలికే అవకాశం భద్రతా దళాల చేతుల్లోనే ఉంది. అయితే దేశ భద్రతా దళాలు అధ్యక్షుడు నికోలస్ మధురోకు బాసటగా నిలుస్తున్నాయి. ఆయనపట్ల విధేయతను కనబరుస్తున్నాయి. పలు కీలకమైన ఉన్నతమైన స్థానాల్లో ఉన్న అధికారులు మదురోకు మద్దతిస్తున్నారు. ఈ మేరకు ప్రకటనలు కూడా చేశారు. మాజీ అధ్యక్షుడు చావెజ్ మిలిటరీని ప్రక్షాళన చేశారు. మిలిటరీ అధికారులకు కేబినెట్ స్థాయి పదవులు కట్టబెట్టారు. తద్వారా బ్యాంకులు, ఆర్థిక వ్యవస్థను తన చేతల్లో పెట్టుకున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. చావెజ్ ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థలోని అధికారులు లాభదాయకమైన పదవుల్లో ఉంటుండడంతో అధ్యక్షుడు నికోలస్ మదురోకు కలిసి వచ్చింది.



ఆందోళనలు పట్టించుకోని ఆర్మీ..

ప్రస్తుత నికోలస్ మదురో ప్రభుత్వం పతనమైతే మిలిటరీ అధికారులు జైలులో ఉండాల్సి వస్తుందని భయపడుతున్నారు. అందుకే అధ్యక్షుడు నికోలస్ మదురోకు మద్దతుగా ఉంటున్నారని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం మారితే మిలిటరీ అధికారులను ఏమీ చేయబోమంటూ ప్రతిపక్ష నేతలు హామీఇస్తున్నారు. ప్రజలు కూడా మిలటరీకి చెందిన అన్నీ స్థాయిల అధికారుల వద్దకు వెళ్లి అధ్యక్షుడికి మద్దతు ఉపసంహరించుకోవాలని కోరుతున్నా ఏమాత్రం మిలిటరీ మనసు మార్చుకోవడం లేదు.

భారత్ ఎటువైపు..

అంతర్జాతీయ వివాదాస్పద అంశాలకు భారత ప్రధాని నరేంద్ర మోడీ దూరంగా ఉంటున్నారు. అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీసే రాజకీయాలకు ప్రభుత్వం దూరాన్ని పాటిస్తోంది. ముఖ్యంగా వాణిజ్య, రాజకీయ భాగస్వామ్య దేశాల విషయంలో మోడీ ప్రభుత్వం తటస్థంగా వ్యవహరిస్తోంది. వెనిజుల వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ స్పందించారు. ఇది వెనిజుల ప్రజలకు సంబంధించిన సమస్య అన్నారు. అక్కడి ప్రజలే ఈ రాజకీయ సమస్యకు పరిష్కారాన్ని కొనుగొనాలని ఆయన వ్యాఖ్యానించారు.

భారత రిఫైనరీ కంపెనీల్లో ఉత్సాహం

వెనిజుల నుంచి ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్న మూడవ అతిపెద్ద దేశం భారత్. అమెరికా, చైనా తర్వాత అత్యధికంగా ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. రోజుకు మూడు లక్షల నలభై వేల బారెళ్ల ఆయిల్ భారత్‌కు దిగుమతి అవుతోంది. భారత ప్రవేటు రిఫైనరీలు రిలయెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నయారా ఎనర్జీ లిమిటెడ్(ఇస్సార్ ఆయిల్ లిమిటెడ్)లు అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్నాయి. అధునాతన పద్ధతుల్లో వెనిజువెలా ఆయిల్‌ను రిఫైన్ చేస్తుండడమే దీనికి ప్రధాన కారణం. ఆయిల్, సహజ గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి, రిఫైనరీ, ఎగుమతి చేసే వెనిజువెలా ప్రభుత్వ కంపెనీ పీడీవీఎస్‌ఏపై అమెరికా ఆంక్షలు విధించింది. పీడీవీఎస్‌ఏతో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపవద్దంటూ తమ సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం తమకు సానుకూలమని భారతీయ రిఫైనరీ కంపెనీలు భావిస్తున్నాయి. వెనిజుల నుంచి ఎక్కువ మొత్తంలో ఆయిల్‌ను కొనుగోలు చేయవచ్చునని అంచనావేస్తున్నాయి. అమెరికాకు ఎగుమతులు నిలిచిపోవడంతో మార్కెట్‌లో ఆయిల్ అందుబాటులో ఉంటుంది. ఉత్పత్తి తక్కువగా ఉండడం వల్ల ఇంతకాలం తక్కువ దిగుమతులు చేసుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు అధిక మొత్తంలో ఆయిల్‌ను దిగుమతి చేసుకునే అవకాశం కలిగిందని వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు చెబుతున్నారు. రిలయెన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నయారా ఎనర్జీ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్, భారత పెట్రోలియం కార్పొరేషన్ ఈ కంపెనీల జాబితాలో ఉన్నాయి.

ఎన్నికల వేళ పోస్టర్ల మేళా..

- ఎన్నికల్లో విజయం కోసం కాంగ్రెస్ సరికొత్త వ్యూహాలు
- ఉత్తరాదిపై పట్టుకోసం సెంటిమెంట్ మంత్రం
- రాహుల్‌ను బాహుబలి, రాముడిగా చిత్రీకరణ
- సోషల్ మీడియాలో పోస్టర్లు వైరల్



పాట్నా: లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయపార్టీలు సెంటిమెంట్‌తో దూసుకుపోతున్నాయి. పోటాపోటీగా పోస్టర్లతో ప్రచారం చేసుకుంటున్నాయి. తాజాగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని రాముడిగా చిత్రిస్తూ బీహార్ కాంగ్రెస్ నేతలు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయాయి.అయోధ్య రామజన్మభూమిలోని 67 ఎకరాల భూమిని రామ జన్మభూమిన్యాస్‌కు, ఇతర యాజమాన్యాలకు ఇచ్చేందుకు అనుమతి కోరుతూ కేంద్రం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిన వేళ..రాహుల్‌గాంధీ .. రాముడి చిత్రం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్‌పాత్ర స్పందిస్తూ.. సుప్రీంకోర్టులో కేంద్రం వేసిన పిటిషన్‌పై కాంగ్రెస్ వైఖరేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. మీరు రాముడిగా మారడం బాగుంది. సుప్రీంలో కేంద్రం పిటిషన్‌పై మీ స్పందనేంటి..? అని ప్రశ్నించారు.

ఢిల్లీలో బాహుబలి రాహుల్

మూడు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం దక్కేలా కృషి చేసిన ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కాంగ్రెస్ శ్రేణులు బాహుబలిగా అభివర్ణిస్తున్నాయి. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా షీలాదీక్షిత్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రచారం మరింత ముమ్మరమైంది. లోక్‌సభ ఎన్నికలకు మూడు నెలలుండగనే రాహుల్ గాంధీని బాహుబలిగా చిత్రిస్తూ ఢిల్లీ కాంగ్రెస్ శ్రేణులు వాల్ పోస్టర్లు విడుదల చేశాయి..2019 ఎన్నికల్లో రాహుల్ గాంధీ బాహుబలిగా అవతరిస్తారని అభివర్ణిస్తూ చాందినీ చౌక్‌లో ఢిల్లీ కాంగ్రెస్ శ్రేణులు వాల్ పోస్టర్లు విడుదల చేశాయి. ఈ కార్యక్రమానికి ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ షీలాదీక్షిత్ కూడా హాజరుకావడం గమనార్హం.

గేమ్ చేంజర్‌గా ప్రియాంక

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించగానే ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది.

ప్రియాంక గాంధీని గేమ్ చేంజర్‌గా అభివర్ణిస్తూ ఉత్తర్‌ప్రదేశ్‌లో పోస్టర్లు వెలిశాయి. బీజేపీ ఎత్తులను ప్రియాంక గాంధీ తిప్పికొడతారని కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఉత్తర్ ప్రదేశ్ తూర్పు ప్రాంత బాధ్యతలను ప్రియాంక గాంధీకి కాంగ్రెస్ పార్టీ అప్పగించింది. తూర్పు యూపీలో ప్రధాని మోడీ నియోజక వర్గం వారణాసితో పాటు యూపీ సీఎం యోగి ఆధిత్యనాథ్ నియోజకవర్గం గోరఖ్ పూర్ సహా 10 మంది కేంద్రమంత్రుల నియోజక వర్గాలున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రియాంకకు కీలక బాధ్యతలను కట్టబెట్టింది.

● అంబానీ కోసం ఎయిర్‌ఫోర్స్‌నే అమ్మేశారు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాని మోడీ లక్ష్యంగా విమర్శలు సంధించారు. అనిల్ అంబానీకి మేలు చేసేందుకు మోడీ.. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌ను అమ్మేశారని ఆరోపించారు. అనిల్ అంబానీకి రూ.30వేల కోట్లు లాభం చేకూర్చేందుకు దేశంలోని యువత అవకాశాలను మోడీ దోచుకున్నారని మండిపడ్డారు. యూత్ కాంగ్రెస్ పబ్లిక్ అవుట్ రీచ్ ప్రచారంలో భాగంగా యువ క్రాంతి యాత్ర సభలో ప్రసంగించిన రాహుల్..అనిల్ అంబానీ కోసం మోడీ యువత అవకాశాలను దోచుకున్నారని యావత్ దేశానికి తెలుసు అని వ్యాఖ్యానించారు.మోడీజీ రాఫెల్ ఒప్పందం కోసం భారతీయ వాయుసేనను మోడీ అమ్మశారు. మీకు రాత్రుల్లో నిద్రపట్టడం లేదు. అని రాహుల్ విమర్శించారు. రాఫెల్ ఒప్పందంలో మార్పులు చేసేటప్పుడు మోడీ రక్షణమంత్రిని కూడా సంప్రదించలేదని నాటి రక్షణ మంత్రి మనోహర్ పారికర్ చెప్పారని అన్నారు.

● వాళ్లు అధికారంలోకి వస్తే రోజుకో ప్రధాని



కాన్పూర్: విపక్షాలపై భాజపా అధ్యక్షుడు అమిత్‌షా తీవ్ర విమర్శలు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిని ప్రకటించక పోవడాన్ని ఎద్దేవాచేశారు. బుధవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో నిర్వహించిన బీజేపీ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకొకరు ప్రధాని అవుతారు. ఇలా వారంలో ఏడు రోజులు దేశానికి కొత్త ప్రధాని వస్తారు. సోమవారం మాయావతి, మంగవారం అఖిలేశ్, బుధవారం మమతా బెనర్జీ, గురువారం శరద్‌పవార్, శుక్రవారం దేవెగౌడ, శనివారం స్టాలిన్ ప్రధాని అవుతారు. ఆదివారం సెలవు అయినందున ప్రధాని పదవి ఖాళీగా ఉంటుంది అంటూ ఎద్దేవా చేశారు. మార్పు కోసం వాళ్లంతా ఒక వేదికపైకి వచ్చారు. కానీ వారికి నాయకుడు లేడు. మేము మోడీ సారథ్యంలో బలమైన ప్రభుత్వం ఉండాలని కోరుకుంటుంటే, వాళ్లు మాత్రం బలహీన ప్రభుత్వం ఢిల్లీలో ఉండాలని ఆశిస్తున్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడివుందని మీకు స్పష్టం చేసేందుకే ఇక్కడకు వచ్చానన్నారు. ఆశిస్తున్నాం. రాముడే పరిస్థితులను చక్కబెడతాడు అని అమిత్‌షా కార్యకర్తలకు ఉద్బోధించారు.

● అమిత్ షాకు మమత సవాల్



కలకత్తా: బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్ ఫండ్ కంపెనీల యజమానులు తన పెయింటింగులను కొనుగోలు చేశారు. అందుకే వారిపై చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలను నిరూపించాలని అమిత్‌షాకు ఆమె సవాల్ విసిరారు. ఆరోపణలను రుజువుచేయలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ పథకాలను బెంగాల్ ప్రభుత్వం అనుసరిస్తోందంటూ అమిత్ షా ఆరోపించడాన్ని ఆమె ఖండించారు. రాష్ట్రంలో దుర్గ, సరస్వతి పూజలు జరగడం లేదనడాన్ని ఆమె ఆక్షేపించారు. దుర్గ పూజ నిర్వాహకులకు కేంద్రప్రభుత్వం ఐటీ నోటీసులు పంపిస్తోందన్నారు. కన్యశ్రీ పథకాన్ని రాష్ట్రంలో 2013లోనే ప్రారంభించగా బేటీ బచావో బేటీ పడావో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2015లో ప్రారంభించిందన్నారు. నిర్మల్ బంగ్లా పథకాన్ని ప్రారంభించిన తర్వాత కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పథకాన్ని మొదలుపెట్టింది. రైతులకు బీమా కల్పిస్తున్నాం. ఇవన్నీ వాస్తవాలు కాకుంటే నా తల నరకండి. కేంద్రప్రభుత్వ పథకాలను అనుసరిస్తున్నామని ఆరోపణలు చేస్తే సహించబోమన్నారు. బీజేపీకి అల్లర్లు సృష్టించడం మినహా ఇంకేమీ చేతకాదని ఆమె ఎద్దేవా చేశారు.

● గిరిజన బాలికపై ప్రజాప్రతినిధి అత్యాచారం

తిరువనంతపురం: సమాజంలో నలుగురికి ఆదర్శంగా నిలవాల్సిన వ్యక్తి ఆయన. ఎవరికైనా అన్యాయం జరిగితే ముందుండి ప్రశ్నించాల్సిన వ్యక్తి. కానీ ఓ బాలిక పాలిట రాక్షసుడిలా మారాడు. ఏడాది కాలంగా బాలికపై లైంగిక హింస, అత్యాచారానికి పాల్పడ్డాడు. వ్యవహారం పోలీసుల వరకు చేరడంతో తప్పించుకుని ఉడాయించాడు. కేరళలోని వాయనద్ జిల్లాకు చెందిన ఓఎం జార్జి అనే ఓ కాంగ్రెస్ నాయకుడు తన ఇంట్లో పని చేస్తున్న 17 ఏళ్ల గిరిజన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. లైంగికంగా హింసించాడు. ఏడాదికాలంగా ఈ అఘాయిత్యాన్ని కొనసాగించాడు. అన్యాయాన్ని ప్రశ్నించిన బాలిక, ఆమె తల్లిదండ్రులను బెదిరించాడు. ఈ లైంగిక హింసను భరించలేకపోయిన బాలిక ఫిర్యాదు చేయాలని భావించింది. ఈ విషయం తెలుసుకున్న నిందితుడు బాలికను ఫోన్‌లో బెదిరించాడు. దీంతో బాలిక ఆత్మహత్యాయత్నం చేసింది. చేతిని కత్తితో కోసుకుంది. ఆందోళనకు గురయిన తల్లిదండ్రులకు ప్రభుత్వ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిపై ఫోస్కో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు ములపల్లి రామచంద్రన్ ప్రకటించారు.

● జడ్జీలు నిలబడి మాట్లాడరు..

న్యూఢిల్లీ: న్యాయవాదులతో న్యాయమూర్తులు కుర్చీలోంచి లేచి నిలుచొని మాట్లాడలేరని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ వ్యాఖ్యానించారు. న్యాయమూర్తులు కూచొనే న్యాయవాదులతో మాట్లాడతారని, అదే సంప్రదాయమన్నారు. బుధవారం నాడు దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తికి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రాజీవ్ ధావన్‌కి మధ్య మాటల తూటాలు పేలాయి. మేం లేచి నిలబడి న్యాయవాదులతో మాట్లడలేం. న్యాయవాదులతో మాట్లాడాలనుకుంటే, అది కూచున్నప్పుడే సాధ్యమవుతుంద న్నారు. ప్రధాన న్యాయమూర్తికి, న్యాయవాదికి మధ్య ఈ జరిగిన ఈ సంభాషణకు నేపథ్యం ఆలిగఢ్ ముస్లిం యూనిర్శిటీకి మైనారిటీ హోదా ఇచ్చే కేసు కావడం విశేషం.

● న్యాయమూర్తులకు ఉద్దేశాలా?

న్యూఢిల్లీ: న్యాయమూర్తులకు, వారి తీర్పులకు రాజకీయ ఉద్దేశ్యాలను అంటగడుతూ వ్యక్తిగత ఆరోపణలు చేయడం కోర్టు ధిక్కారంలో అత్యంత ఘోరమైందని సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించింది. ప్రభుత్వానికి అనుకూలంగా కొన్ని కేసుల్లో తీర్పులు ఇవ్వాలని కొంతమంది న్యాయవాదుల బృందాలు న్యాయమూర్తులపై ఒత్తిడి తీసుకొస్తున్నాయని మండిపడింది. జస్టిస్ మిశ్రా జస్టిస్ వినీత్ శరన్‌తో కూడుకున్న ధర్మాసనం.. కొంత మంది న్యాయవాదులు తమకు తాము బార్ కౌన్సిల్‌కి అతీతులమని భావిస్తున్నారని, చౌకబారు ప్రచారం కోసం అర్రులు చాస్తున్నారని మండిపడింది. 2018, జనవరిలో నలుగురు సుప్రీంకోర్టు న్యాయూర్తులు మీడియా సమావేశంపెట్టి కేసుల కేటాయింపుపై ఆరోపణలు చేసిన సందర్భంలో జస్టిస్ మిశ్రాపైనా వారు నిందలు మోపిన విషయం తెలిసిందే.

● చట్టంతోనే చెలగాటమా?

న్యూఢిల్లీ: మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో విరుచుకపడింది. ఐఎన్ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మాక్సిస్ కేసుల విచారణలో కార్తీ సహకరించడం లేదని, అయినా విదేశాలకు వెళ్లడానికి అనుమతి కోరుతున్నారని మండిపడింది. మీరు ఎక్కడికి వెళ్లానుకుంటే అక్కడికి వెళ్లండి. ఏం చేయాలనుకుంటే అది చేయండి. అయితే చట్టంతో మాత్రం ఆటలాడుకోవద్దని రంజన్ గొగోయ్ అన్నారు. పది కోట్ల రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ చేసి విదేశాలకు వెళ్లొచ్చని చెప్పారు. అయితే ఈడీ తరుపున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. మార్చిలో నాలుగు రోజుల పాటు కార్తీని విచారించాల్సి ఉందని, ఆ రోజుల్లో భారత్‌కి రావాల్సి ఉంటుందని చెప్పారు.

● ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టంపై స్టేకు సుప్రీం నో

న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ సవరణ చట్టం 2018పై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు మరోసారి నిరాకరించింది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లు, కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలను ఫిబ్రవరి 19 నుంచి పరిశీలించనున్నామని స్పష్టం చేసింది. జస్టిస్ యూయూ లలిత్ నేతృత్వంలోని బెంచ్ ఈ విషయాన్ని వెల్లడించింది. ఎస్సీ, ఎస్టీ చట్టానికి పార్లమెంటు ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. అరెస్టయిన వ్యక్తి ఎలాంటి నేరానికి పాల్పడకపోతే బెయిల్ తీసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ చట్టంలో నిబంధనలను పొందుపరచారని బెంచ్ పేర్కొంది. ముందస్తు విచారణ లేకుండా వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం, అరెస్టు చేయడం ఆమోదయోగ్యం కాదంటూ పిటిషనర్ పేర్కొన్నారు.



నోట్లరద్దుతోనే సొంతింటి కల సాకారం

● రియల్ భూం తగ్గించాం ● అందుబాటు ధరల్లో యువత ఇళ్లు నిర్మించుకునేలా చేశాం ● సూరత్ పర్యటనలో ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను క్యాష్ చేసుకునేందుకు ప్రధాని మోడీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పాత పెద్దనోట్ల రద్దుతో జనం అల్లాడిపోయారని అంతా అనుకుంటున్న వేళ.. మోడీ మాత్రం కొత్త పల్లవి అందుకున్నారు. నోట్ల రద్దు వల్లే యువత కలలు నెరవేరుతున్నాయన్నారు. సొంతింటిని నిర్మించుకోవాలనుకున్న యువతకు నోట్లరద్దు వల్ల మేలు జరిగిందని.. ధరలు తగ్గడంతో వారి కలలను సార్థకం చేసుకుంటున్నారని చెప్పారు. తాము నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధిని గత ప్రభుత్వాలకు 25 ఏళ్లు పడుతుందని చురకలంటించారు.గుజరాత్‌లోని సూరత్ ఎయిర్ పోర్టుకు నూతనంగా ఏర్పాటు చేయబోయే టర్మినల్ పనులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. నల్లధనాన్ని నిరోధించడం వల్ల రియల్ ఎస్టేట్ భూం పడిపోయి.. అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించుకునే వెసలుబాటు కలిగిందని యువత తనతో చెప్పారన్నారు. ఉడాన్ పథకం ద్వారా సామాన్యులకు సైతం గగనయాన సౌకర్యాన్ని కల్పించామన్నారు. నాలుగున్నరేళ్ల ఎన్డీఏ పాలనలో 1.30 కోట్ల ఇళ్లు నిర్మించామన్న మోడీ.. యూపీఏ పదేళ్ల పాలనలో కేవలం 25 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించగలిగిందని విమర్శించారు. గత 30ఏళ్లుగా హంగ్ పార్లమెంట్‌తో అభివృద్ధి కుంటుపడిందన్న మోడీ.. నాలుగున్నరేళ్ల క్రితం ప్రజలు పూర్తి మెజారిటీ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేయడం వల్లే అభివృద్ధిలో దేశం దూసుకుపోతుందని చెప్పారు.

ఉప్పు సత్యాగ్రహ మెమోరియల్, మ్యూజియం జాతికి అంకితం

గుజరాత్ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ నవ్సరీ జిల్లాలో ఉప్పుసత్యాగ్రహ మెమోరియల్,మ్యూజియంను జాతికి అంకితం చేశారు. దండి ఉప్పు సత్యాగ్రహం కాలంలో గాంధీజీ వాడిన వస్తువులు, సత్యాగ్రహ విశేషాలను తెలియజేసే కథనాలతో కూడిన 24 కుడ్య చిత్రాలను మ్యూజియంలో పొందుపరిచారు. మహాత్మాగాంధీ 71వ వర్థంతిని పురస్కరించుకుని మోడీ ఈ రెండింటిని జాతికి అంకితం చేశారు.ఆంగ్లేయుల పాలనలో ఉప్పుపై పన్ను వేయడాన్ని నిరసిస్తూ గాంధీజి 80 మంది సత్యాగ్రహులతో కలిసి సబర్మతీ ఆశ్రమం నుంచి దండి వరకు కాలినడకననడిచి (241 మైళ్లు) నిరసన తెలియజేశారు.

సొమ్మసిల్లిన టెక్నీషియన్.. స్పందించిన మోడీ

సూరత్ సభలో ప్రధాని మోడీ ప్రసంగిస్తున్న సమయంలో ఓటెక్నీషియన్ సొమ్మసిల్లి పడిపోయాడు. పెద్దపెద్ద ఎల్ఈడీ స్క్రీన్లు అమర్చడంతో వెంటనే గమనించిన మీడియా ప్రతినిధులు అతడికి తాగునీరు అందించారు. ఇది గమనించిన తన ప్రసంగం ఆపి.. టెక్నీషియన్‌కు సాయం చేయాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. దీంతో అతన్ని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.



ఎంపీ టికెట్ దరఖాస్తుకు రూ. 25 వేలు



● టికెట్ల కోసం అన్నాడీఎంకే నేతల క్యూ.. ● ఫిబ్రవరి 4 నుంచి 10వ తేదీ వరకు విక్రయాలు

చెన్నై: లోక్‌సభ ఎన్నికల సమీపిస్తున్న వేళ తమిళనాడు అధికార పార్టీ అన్నాడీఎంకే వినూత్న నిర్ణయం తీసుకుంది. తమిళనాడు, పుదుచ్చేరిలో పార్టీ నుంచి ఎంపీలుగా పోటీ చేసేందుకు ఆశావహులు క్యూకట్టడంతో దరఖాస్తుకు రూ.25 వేల ఫీజును నిర్ణయించింది. ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలనుకునే ఆశావహులు రూ.25వేల పెట్టి దరఖాస్తు తీసుకోవాల్సిందే. దరఖాస్తు తీసుకున్నంత మాత్రాన టికెట్ పక్కా అనుకుంటే పొరపాటే.. పోటీలో ఉండేదెవరనేది తర్వా త తేలుస్తాం.. అని అన్నాడీఎంకే ప్రకటించింది.

దరఖా స్తులు ఫిబ్రవరి 4 నుంచి 10వ తేదీవరకు అందుబాటులో ఉంటాయని అన్నాడీఎంకే కోఆర్డినేటర్ పన్నీర్ సెల్వం, జాయింట్ సెక్రటరీ పలనిస్వామి పేర్కొన్నారు. తమిళ నాడు మొత్తం 39 ఎంపీ స్థానాలుండగా..గత ఎన్నికల్లో అన్నాడీఎంకే 37 స్థానాలను కైవశం చేసుకుం ది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ పార్టీకే మెజారిటీ స్థానాలు దక్కుతాయని బలంగా విశ్వసిస్తున్న అన్నాడీఎంకే నాయకులు.. పార్టీ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయ డంతో పన్నీరు, పళని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలు స్తోంది.

బొగ్గు గనుల్లో మహిళలకు కేంద్రం అనుమతి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం మరో కీలకమైన నిర్ణయం తీసుకుంది. భూగర్భ బొగ్గు గనుల్లో పని చేసేందుకు మహిళలకు అనుమతి ఇవ్వాలని కార్మిక మంత్రిత్వశాఖ నిర్ణయించింది. భూగర్భ గనుల్లో పగటిపూట, ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజంతా పని చేసే వెసులుబాటును మహిళలకు కల్పించనుంది. లింగస మానత్వం, మహిళలకు ఉద్యోగ అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో మొదటిసారిగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొదటిగా బొగ్గు గనుల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నాం. అనంతరం సంబంధిత మైనింగ్ రంగాల్లో కూడా అమలు చేస్తాం. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇదివరకే ప్రకటించాం. మరికొన్ని రోజుల్లోనే ఈ విధానాన్ని అమలు చేయనున్నామని ఓ అధికారి వెల్లడించా రు. పరిస్థితులను తనిఖీ చేసేందుకు మహిళా అధికారులకు మాత్రమే అనుమతి ఇచ్చామన్నారు.

ఎన్ఎస్‌సీ సభ్యత్వానికి మోహనన్, మీనాక్షి రాజీనామా

నిరుద్యోగ సర్వే నిలిపివేతకు నిరసనగా నిర్ణయం





న్యూఢిల్లీ: ప్రభుత్వ ధోరణికి నిరసనగా జాతీయ గణాంక కమిషన్ (ఎన్ఎస్‌సీ)కు చెందిన ఇద్దరు స్వతంత్ర సభ్యులు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. పలు అంశాల్లో ప్రభుత్వంతో తలెత్తిన విభేదాల కారణంగా పీసీ మోహనన్, జేవీ మీనాక్షి తమ పదవులకు రాజీనామా చేశారు. మోహనన్ ఎన్ఎస్‌సీ తాత్కాలిక చీఫ్ బాధ్యతల్లో ఉన్నారు. వీరిద్దరు తప్పుకోవడంతో ఇక ముఖ్య గణనాధికారి ప్రవీన్ శ్రీవాత్సవతోపాటు నీతి అయోగ్ సీఈవో అమితాబ్ కాంత్ మాత్రమే కమిషన్‌లో సభ్యులుగా మిగిలారు. కమిషన్ సమర్థవంతంగా పనిచేయడం లేదని భావిస్తున్నాను. కమిషన్ బాధ్యతలను మేం సరిగా నిర్వర్తించలేక పోతున్నమన్న భావన కలిగింది. అందుకే బాధ్యతల నుంచి తప్పుకున్నాం అని మోహనన్ మీడియాకు తెలిపారు. కాగా ఎన్ఎస్ఎస్‌వో (నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్) సర్వే విడుదలను ప్రభుత్వం అడ్డుకున్నందుకు నిరసనగా వీళ్లిద్దరు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. 2017-18 వార్షిక నివేదిక పెద్దనోట్ల కారణంగా ఉద్యోగతత అవకాశాలు దెబ్బతిన్న పరిణామాల్ని ఎత్తిచూపుతుందనే భయంతోనే ప్రభుత్వం దీన్ని తొక్కిపట్టిందన్న ఆరోపణలు వస్తున్నాయి. కీలక నిర్ణయాల్లో ఎన్ఎస్‌సీని పక్క నబెడితే, అలాంటప్పుడు మేమెలా సమర్థవంతంగా పనిచే యగలం అని మోహనన్ ప్రశ్నించారు. వాస్తవానికి వీళ్లిద్ద రి పదవీకాలం 2020 జూన్ వరకు ఉంది. 2017 జూన్‌లో వీరు బాధ్యతలు చేపట్టారు. ఏడుగురు సభ్యులుండే ఎన్ ఎస్‌సీలో ఇప్పటికే మూడు ఖాళీలున్నాయి. మోహనన్, జేవీ మీనాక్షి 28వ తేదీనే రాజీనామా చేసినట్లు అధికా రవర్గాలు వెల్లడించాయి.

అధికారిక భేటీల్లో ఎందుకు చెప్పలేదు?

మోహనన్, మీనాక్షి రాజీనామా అంశంపై సంబంధిత మంత్రిత్వ స్పందించింది. అధికారిక సమావేశాల్లో ఎన్నడూ వారు అభ్యంతరాలు చెప్పలేదని గుర్తుచేసింది. ఎన్ఎస్ఎస్‌వో సర్వే గురించి మాట్లాడుతూ, ఇది జులై 2017- డిసెంబర్ 2018 మధ్య కాలానికి సంబంధించిన త్రైమాసిక డేటా ఇది. నివేదికను త్రైమాసికం తర్వాత విడుదల చేస్తాం. యువశక్తి ఎక్కువగా ఉన్న మనదేశంలో 93శాతం మంది అనధికార శ్రామికశక్తిలో పరిపాలనా గణాంకాల మేరకు ఉపాధిని మెరుగుపరచడం, కాలానుగుణ సర్వేల ఆధారంగా లక్ష్యాన్ని పూర్తిచేయడం ముఖ్యం. ఈ క్రమంలో, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ఎన్‌పీఎస్‌లో నూతన సభ్యుల అంచనాలపై కసరత్తు జరుగుతోంది. ఈ గణాంకాలను బట్టిచూస్తే శ్రామికశక్తి క్రమబద్ధీకరణవైపు మళ్లుతున్నట్లు అర్థమవుతుంది. జీడీపీ డాటా అంశానికొస్తే, దాన్ని ఎన్ఎస్‌సీయే ఫైనల్ చేసి విడుదలకు సూచించిందని సదరు మంత్రిత్వశాఖ వివరణ ఇచ్చింది.



ముంబై: లాక్మె ఫ్యాషన్ వీక్‌లో డిజైనర్ గౌరవ్ గుప్తా రూపొందించిన అతిపెద్ద గౌను ప్రదర్శన. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బాలీవుడ్ నటి టబూ. చిత్రంలో నిర్మాత కరణ్ జోహార్, పలువురు మోడల్స్



ముంబై: లోక్‌పాల్ చట్టం అమలు చేయాలంటూ అహ్మద్‌నగర్ జిల్లాలోని తన స్వగ్రామమైన రాలేగావ్ సిద్ధిలో సామాజిక కార్యకర్త అన్నా హజారే నిరశన దీక్ష

ఫిబ్రవరి 21న రామాలయ శంకుస్థాపన

● కుంభమేళాలో ప్రకటించిన పరమ ధర్మ సంసద్ ● కోర్టు ఆదేశాలను ధిక్కరించబోమని ప్రకటన



న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఉత్తరాధి ప్రజల సెంటిమెంట్‌ను పండించేందుకు రాజకీయ పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. అయోధ్య రామమందిర అంశం సుప్రీంకోర్టులో ఉండగానే.. రామ మం దిరాన్ని మేమంటే..మేం నిర్మిస్తామని హామీలు గుప్పిస్తున్నాయి. రాజకీయ పార్టీల మాట అటుంచితే.. తాజాగా పరమ ధర్మ సంసద్ రామాలయ నిర్మాణంపై సంచలన ప్రకటన చేసింది. ఫిబ్రవరి 21న అయోధ్యలో రామాలయ నిర్మాణానికి శుంకుస్థాపన చేయనున్నట్లు పరమ ధర్మ సంసద్ స్వామిజీ స్వరూపానంద్ సరస్వతి ప్రకటించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాలో ఈ ప్రకటన చేశారు. కోర్టుల ఆదేశాలను ధిక్కరించ కుండా రామాలయ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు స్వరూపానంద్ తెలిపారు. అలహాబాద్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చేంత వరకు పాత తీర్పే అమలులో ఉంటుందన్నారు. సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పునిచ్చినా తాము గౌరవిస్తామన్న స్వరూపానం ద్.. ప్రధాని మోడీ అంటేకూడా తమకు గౌరవం ఉందన్నారు. రామాలయ నిర్మాణానికి ఇప్పుడు పూనుకోకుంటే.. మరెప్పుడూ జరగకపోవచ్చని అన్నారు. 1992 బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత అయోధ్యలో 2.27ఎకరాల వివాదాస్పద స్థలం కాకుండా ప్రభుత్వం 67 ఎకరాల భూమిని సేకరించారు... ఆ భూముల్ని నిజమైన యాజమానులైన రామ జన్మభూమి న్యాస్‌కు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని మంగళవారం కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిం ది. ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానికి వెళ్లిన మరునాడే పరమ ధర్మ సంస్థ రామాలయ నిర్మాణ శంకుస్థాపన ప్రకటన చేయడం గమనార్హం.

ఈ సారి.. గెలుపు మాదే

“ఒక జట్టు లేదా ఆటగాడి ఆత్మ విశ్వాసాన్ని ప్రభావితం చేయడంలో గెలుపు లేదా ఓటమి కీలకం. ఓటమి పొందితే దిగజారడం సాధారణమే..వరుస ఓటమిల బారినపడ్డ ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు ప్రస్తుతం ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2014-15 నుంచి చూస్తే.. సొంత గడ్డపై దక్షిణాఫ్రికాపై రెండు వన్డేలు ఓడిన తర్వాత మళ్లీ భారత్ చేతిలో వరుసగా మూడు వన్డేలు ఓడటం ఆ జట్టు ఆత్మ విశ్వాసాన్ని ఢీలాపడేలా చేసింది. సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయిన న్యూజిలాండ్ సొంత గడ్డపై మునపటి పటిమను అందుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఒకవైపు కోహ్లికి విశ్రాంతి ఇవ్వడంతో రోహిత్ శర్మ నేతృత్వంలో జట్టు మరో విజయంకోసం ఉరకలు వేస్తోండగా, మరోవైపు మిగిలిన రెండు వన్డేల్లో గెలవడానికి ప్రయత్నిస్తామని కెప్టెన్ విలియమ్సన్ అంటున్న నేపథ్యంలో నేటి మ్యాచ్ పోటాపోటీగా సాగే అవకాశాలున్నాయి.”

రోహిత్ సేన ధీమా

- నేడు భారత్-న్యూజిలాండ్ నాలుగో వన్డే
- ఉ. 7.30 నుంచి ప్రారంభం

హామిల్టన్: వన్డేల్లో డబుల్ సెంచరీ చేయడంతో ప్రసిద్ధి పొందిన రోహిత్ శర్మ ఆధ్వర్యంలో భారత జట్టు న్యూజిలాండ్‌తో నేడు నాలుగో వన్డేకు సిద్ధమైంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఇప్పటికే 3-0తో సొంతం చేసుకుంది. చివరి రెండు వన్డేలకు కెప్టెన్ కోహ్లికి విశ్రాంతినివ్వడంతో జట్టు పగ్గాలను రోహిత్ శర్మ చేపట్టాడు. కెప్టెన్‌గా రోహిత్‌కు మంచి రికార్డు ఉంది. మూడు సార్లు డబుల్ సెంచరీ చేసిన ఘనత పొందిన రోహిత్ న్యూజిలాండ్‌కు చుక్కలు చూపించడానికి సమాయత్తమ య్యాడు. సెడాన్ పార్క్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని క్యురేటర్లు చెపుతుండటంతో రోహిత్ మరో భారీ ఇన్నింగ్స్ ఆడే అవకాశముంది. నేటి మ్యాచ్ గెలిస్తే భారత్ 4-0తో లీడ్‌ను పొంది.. 1967లో భారత జట్టు తొలిసారిగా న్యూజిలాండ్‌లో పర్యటించినప్పటినుంచి అన్ని ఫార్మాట్లలో ఇదే అదిపెద్ద విజయంగా నమోదు అవుతుంది. ఆదివారం జరిగే ఐదో వన్డేకూడా గెలిస్తే అదో సరికొత్త రికార్డుగా మారుతుంది. తొడ కండరం గాయం కారణంగా మూడో వన్డేలో ఆడలేకపోయిన వికెట్ కీపర్ మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ నేటి వన్డేలో బరిలోకి దిగేది లేనిది గురువారం టాస్‌కు ముందు తేలనుంది. కోహ్లి విశ్రాంతి పొందటంతో ధోనీ అతని స్థానంలో రావచ్చు. మరోవైపు యువ కిశోరం 19 ఏళ్ల శుభ్‌మన్ గిల్‌కు కూడా ఈసారి అవకాశం దక్కవచ్చు. భారత్ భవిష్యత్తు క్రికెట్ స్టార్ గిల్ అని పరిశీలకులు అభివర్ణిస్తున్న నేపథ్యంలో ప్రపంచ కప్ దృష్ట్యా అతనికి టీం మేనేజ్‌మెంట్ నాలుగో వన్డేలో అవకాశం కల్పించే అవకాశాలున్నాయి. ఇటీవల కోహ్లి కూడా గిల్‌ను ప్రశంసిస్తూ.. తాను అతని వయసులోఉన్నప్పుడు నా ఆట గిల్ ఆడిన ఆటలో 10 శాతం కూడా లేదని ఆకాశానికెత్తేయడంతో గిల్‌కు ఈ వన్డేలో చోటు ఖాయమని చెప్పవచ్చు. ఒకవేళ గిల్ జట్టులోకి వస్తే.. అతన్ని నెంబర్ 4 బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగవచ్చు. అంబటి రాయుడు ఆ స్థానంలో ఉన్నప్పటికి.. అతన్ని కిందికి జరిపే అవకాశముంది. ఒకవేళగిల్, ధోనీ ఇద్దరు జట్టులోకి వస్తే.. దినేష్ కార్తిక్‌కు విశ్రాంతి ఇచ్చే అవకాశముంది.

జట్లు

భారత్: రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్, అంబటి రాయుడు, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోనీ(వి.కీ), దినేష్ కార్తిక్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, మహ్మద్ షమీ, యజువేంద్ర చాహల్, శుభ్‌మన్ గిల్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా. **న్యూజిలాండ్:** కేన్ విలియమ్సన్(కెప్టెన్), టాడ్ ఆస్లే, ట్రెంట్ బోల్ట్, కోలిన్ డి గ్రాండొమ్మి, లాకి ఫెర్గుసన్, మార్టిన్ గుప్టిల్, మాట్ హెన్రీ, టామ్ లాథమ్(వి.కీ), కోలిన్ మన్రో, జిమ్మీ నీషమ్, హెన్రీ నికోలస్, మిచెల్ సాంట్నర్, టిమ్ సోథీ, రాస్ టేలర్



కివీస్ బ్యాట్స్‌మెన్‌ను వణికిస్తున్న స్పిన్నర్లు

స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యజువేంద్ర చాహల్ బౌలింగ్ ఆడటంలో న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ ఇబ్బంది పడుతున్నారు. కుల్దీప్ గత మూడు మ్యాచుల్లో 8 వికెట్లు పడగొట్టగా, చాహల్ 6 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తానికి స్పిన్ విభాగం ఈ సిరీస్‌లో ఇప్పటివరకు 14 వికెట్లు తీసింది. ఈ సిరీస్‌లో రెండు సార్లు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను గెలుచుకున్న పేసర్ మహ్మద్ షమీకి విశ్రాంతి లభించే అవకాశముంది. ఆస్ట్రేలియా పర్యటన నుంచి నిరంతరాయంగా ఆడుతున్న షమీ రానున్న ప్రపంచకప్ దృష్ట్యా విశ్రాంతి కల్పించాలని టీమ్ మేనేజ్‌మెంట్ యోచిస్తోంది. ఒకవేళ షమీని తప్పిస్తే...ఖలీల్ అహ్మద్ లేదా మహ్మద్ సిరాజ్ ఇద్దరిలో ఎవరో ఒకరిని ఎంపిక చేసే అవకాశ ముంది. స్పిన్నర్లను ఎదుర్కో వడంలో కివీస్ బ్యాట్స్‌మెన్‌లో రాస్ టేలర్ మినహా ఎవరూ ప్రతిభను చాటలేకపోయారు. కెప్టెన్ కేన్ విలియమ్సన్ తొలి వన్డే మినహా మిగతా రెండు వన్డేల్లో అతని స్కోరు 30 పరుగులను దాటలేదు. ప్రమాదకరమైన బ్యాట్స్‌మన్ గుప్టిల్ కొత్త బంతిని ఎదుర్కోవడంలో విఫలమవుతున్నాడు. టామ్ లాథమ్ లో నిలకడ లోపించడంతో జట్టు కష్టాలను ఎదుర్కొంటోంది. వికెట్లు తీయడం లో విఫలమ వుతున్న లెగ్ స్పిన్నర్ ఐష్ సోధీ, మీడియం పేసర్ డోగ్ బ్రేస్‌వెల్ స్థానాల్లో లెగ్ స్పిన్నర్ ఆల్ రౌండర్ టాడ్ ఆస్లే, సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ జిమ్మి నీషమ్‌లకు జట్టులో స్థానాలు లభించాయి. వన్డేల్లో ఆస్లే ఇప్పటివరకు కేవలం ఏడు వికెట్లు పడగొట్టాడు. ఆస్లేగతంలో ఒత్తిడి పరిస్థితులను చక్కగా అధిగమించిన నేపథ్యముంది. అతని రాకతో జట్టు బౌలింగ్ బలోపేతం అవుతుందని కివీ స్ టీం మేనేజ్‌మెంట్ విశ్వసిస్తోంది. కివీస్ బౌలింగ్ విభాగంలో ట్రెంట్ బోల్ట్‌కు సహచరుల నుంచి మద్దతు కరువైంది. లాకీ ఫెర్గుసన్ కూడా అంతంత మాత్రమే ప్రభావం చూపుతున్న నేప థ్యంలో న్యూజిలాండ్ పర్యాటక భారత్‌కు గట్టి సవాల్ విసురుతుందనేది సందేహమే.

క్రీడాప్రభ

భారత ఆటగాళ్ల ఫీల్డింగ్ ప్రాక్టీస్

- టీమ్మేట్ యంత్రంతో క్యాచ్‌ల శిక్షణ
- బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్ మాకు సులువే
- ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్



హామిల్టన్: న్యూజిలాండ్‌తో నాలుగో వన్డేకు సిద్ధమవుతున్న భారత జట్టు ఫీల్డింగ్‌లో మెళుకువలను నేర్చుకోవడంలో నిమగ్నమైంది. బుధవారం స్థానిక మైదానంలో ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆటగాళ్లు ఫీల్డింగ్‌ను ప్రాక్టీస్ చేశారు. లెదర్‌తో తయారు చేసిన విభిన్న బరువున్న బంతులను అందుకుంటూ క్యాచ్‌లను ప్రాక్టీస్ చేశారు. స్టిములేషన్ యంత్రం విసిరిన బంతులను అందుకుంటూ స్లిప్స్‌లో క్యాచులను పట్టడంలో మెళుకువలను తెలుసుకు న్నారు. బ్లైండ్ ఫోల్డ్ టెక్నిక్ ఇంగ్లండ్‌తో ఎర్ర బంతులతో ఆడుతున్న సమయంలో ఉపయోగిస్తారు. ఆస్ట్రేలియా పర్యటనలో స్లిప్స్‌లో క్యాచ్‌లను ప్రాక్టీస్ చేసేందుకు స్టిములేషన్ యంత్రం టీమ్మేట్‌ను ప్రాక్టీస్‌లో ఉపయోగించారు.

బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్ అంటే..

ఒక తెర వెనుక నుంచి బంతులను విసిరేలా యంత్రాన్ని అమరుస్తారు. బంతులు ఏదిశలో వస్తాయో ఫీల్డర్లకు తెలియదు. ఈ ప్రాక్టీస్ అచ్చం మైదానంలో బ్యాట్స్‌మెన్ కొట్టే షాట్ల మాదిరిగా ఉంటుంది. ఫీల్డర్లు సదా అప్రమత్తతో ఉండి క్యాచులు పట్టే విధంగా తర్ఫీదు ఈ యంత్రంతో లభిస్తుంది. ఈ తరహా ఫీల్డింగ్ శిక్షణను ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ పర్యటన పర్యంతం నిర్వహించాము అని కోచ్ శ్రీధర్ చెప్పాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో వన్డే సిరీస్‌కోసం విభిన్న బరువులున్న బంతులతో ప్రాక్టీస్ చేస్తున్నాము. వాతావరణంలో గాలి, తేమ ఉన్న పరిస్థితుల్లో.. ఎత్తులో వచ్చే క్యాచ్‌లను ఒడిసి పట్టే విధంగా ప్రాక్టీస్ చేశాము అని తెలిపాడు. టీమ్మేట్ యంత్రం ప్రత్యేకమైనది. స్లిప్స్‌లో క్యాచ్‌లు పట్టడానికేకాక, బ్లైండ్‌ఫోల్డ్ టెక్నిక్‌ను కూడా దీని ద్వారా ప్రాక్టీస్‌చేయవచ్చు. ఆస్ట్రేలియా పర్యటనలో ఇదే రకంగా ప్రాక్టీస్ చేశాము. విరాట్ కోహ్లి కొన్ని అద్భుతమైన క్యాచ్‌లను అందుకున్నాడు. అని కోచ్ శ్రీధర్ వెల్లడించాడు. బుధవారం శ్రీధర్ ప్రాక్టీస్ అనంతరం మీడియాతో ముచ్చటించాడు. స్కైయర్స్(ఎత్తులో వచ్చే బంతులు) ఎలా పట్టుకునేందుకు ఆటగాళ్లను ఎలా సమాయత్తం చేస్తున్నారన్న ప్రశ్నకు శ్రీధర్ బదులిస్తూ.. వేగంగా వీచే గాలులు బ్యాటింగ్, బౌలింగ్ వ్యూహాలను మార్పు చేస్తాయన్నాడు. గాలి కారణంగా బంతులు దిశ మారతాయని ఫలితంగా అటు బౌలర్లకే కాక, బ్యాట్స్‌మెన్‌కు ఇబ్బందులు ఏర్పడతాయన్నాడు. వేరు వేరు బరువులున్న బంతులతో ప్రాక్టీస్ చేస్తే.. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవచ్చని తెలిపాడు. ఐపీఎల్ జట్లలోని ఆటగాళ్లు కూడా ఇలాంటి ప్రాక్టీసును చేయాలని కోరాడు. ఇటీవల జరిగిన వన్డేలో చాహల్ బౌలింగ్‌లో కేన్ విలియమ్సన్ ఇచ్చిన క్యాచ్‌ను హార్దిక్ పాండ్యా అందుకున్న తీరును శ్రీధర్ ప్రశంసించాడు. పాండ్యా మంచి ఉత్సాహంతో తిరిగి ఆటలోకి వచ్చాడన్నాడు. ఆట పట్ల అతనికున్న తపన ఏమాత్రం తగ్గలేదు. అతను మంచి ఫీల్డర్. చాలా కష్టమైన క్యాచ్‌ను అలవోకగా పట్టేశాడు. అది అతనికే సాధ్యం. అందువల్లే అతను మంచి అత్యుత్తమ ఫీల్డర్‌గా పేరుపొందాడు. పాండ్యా రాకతో జట్టులో సమతూకం ఏర్పడింది అని కోచ్ శ్రీధర్ తెలిపాడు.



టీమ్మేట్ యంత్రం

రిజర్వు ఆటగాళ్లకు ప్రాక్టీస్ తప్పనిసరి

రానున్న ప్రపంచకప్ దృష్ట్యా రిజర్వు ఆటగాళ్లు కూడా ఫీల్డింగ్ ప్రాక్టీస్ చేయాలని భారత జట్టు ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ పేర్కొన్నాడు. ప్రపంచకప్‌కు ముందు భారత్ కొన్ని అంతర్జాతీయ వన్డేలు మాత్రమే ఆడనున్న నేపథ్యంలో రిజర్వు ఆటగాళ్లతో సహా ఆటగాళ్లందరూ ఫీల్డింగ్‌లో రాటుదేలాల్సి ఉందన్నాడు. ప్రస్తుత భారత జాతీయ జట్టు అన్ని విధాల రాణిస్తుండటం పట్ల శ్రీధర్ సంతృప్తి వ్యక్తం చేశాడు. గెలుపే అలవాటుగా సాగుతున్న భారత్ అలాగే ముందుకు సాగాలి. పట్టును సడలనివ్వకూడదు. ప్రపంచకప్‌కు ముందు భారత్ ఏడు వన్డేలు ఆడుతుంది. కీలకమైన 11మంది ఆటగాళ్లు మాత్రమే ఆడుతూ.. మిగతా రిజర్వు ఆటగాళ్లు దూరంగా ఉంటే.. జట్టుకు ప్రతికూలంగా మారుతుంది. రిజర్వు ఆటగాళ్లు అకస్మాత్తుగా ప్రపంచకప్‌లో ఆడాల్సి వస్తే.. రాణించలేకపోతారు. దీన్ని నివారించడానికి వారికి కూడా తగిన ప్రాక్టీస్‌ను కల్పించి ఆడించాల్సి ఉందని శ్రీధర్ పేర్కొన్నాడు. ప్రపంచకప్ జరిగే ఇంగ్లండ్‌లో పరిస్థితులను ఎదుర్కొనేందుకు న్యూజిలాండ్ పరిస్థితులు సరిపోతాయని అన్నాడు. ఇక్కడ మ్యాచులు ఆటగాళ్లకు మంచి ప్రాక్టీస్‌గా ఉంటాయన్నాడు. ప్రస్తుత జట్టులోని టాప్ ఆరుగురు ఆటగాళ్లు 2013 ఇంగ్లండ్‌లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొన్నావారేనని తెలిపాడు. భారత్ బ్యాటింగ్‌లో అద్భుతమైన పటిమ కలది. ప్రస్తుతం బౌలింగ్‌లో అదే స్థాయిలో రాణిస్తోంది. భువనేశ్వర్ కుమార్, షమీ, కుల్దీప్, చాహల్, బుమ్రాలు జట్టు బౌలింగ్ వనరుల్లో ప్రధానంగా మారారని చెప్పాడు.



భారత్ టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన



జట్టులో ఇద్దరు కొత్త ఆటగాళ్లు

వెల్లింగ్టన్: త్వరలో భారత్‌తో ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కోసం న్యూజిలాండ్ జట్టుకు ఇద్దరు కొత్త ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. ఆల్ రౌండర్ డెరిల్ మిచెల్, పేసర్ బ్లేయర్ టిక్‌నెర్ ఈ సిరీస్‌కు ఎంపికయ్యారు. కేన్ విలియమ్సన్ జట్టుకు సారథ్యం వహించనున్నాడు. ఇటీవల శ్రీలంకతో ఆడిన ఒకే ఒక్క టీ20కి విలియమ్సన్‌ను పక్కన బెట్టారు. గాయపడ్డ జిమ్మీ నీశమ్ స్థానంలో బ్రేస్‌వెల్‌ను జట్టులోకి తీసుకున్నాము. శ్రీలంకతో ఆడిన జట్టులో కూడా జిమ్మీ ఉన్నాడు. భారత్‌తో ఆడే జట్టులో తన స్థానాన్ని అతను నిలబెట్టుకున్నాడు అని బుధవారం న్యూజిలాండ్ క్రికెట్ ఒక ప్రకటన చేసింది. భారత జట్టుకు రోహిత్ శర్మ నేతృత్వం వహించనున్నాడు. నిరంతరమైన ఆటతో ఒత్తిడికి గురవుతున్న కోహ్లికి విశ్రాంతి నివ్వడంతో టీ20 సిరీస్‌లో రోహిత్ జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. మిచెల్, టిక్‌నెర్‌లు దేశీయ క్రికెట్ టీ20 లీగ్ సూపర్ స్మాష్‌లో అద్భుతంగా రాణించారు. నార్తర్న్ నైట్స్ తరపున ఆడుతూ సెంట్రల్ స్టాగ్స్‌పై మిచెల్ 23 బంతుల్లో 61 పరుగులు చేశాడు. న్యూజిలాండ్ ఎ జట్టులో భాగంగా వన్డే క్రికెట్లో కూడా రాణించాడు. లాకి ఫెర్గుసన్ స్థానంలో జట్టులోకి వచ్చిన టిక్‌నెర్ చివరి 11మందిలో ఉండనున్నాడు. భారత్- న్యూజిలాండ్ మధ్య టీ 20 సిరీస్ ఫిబ్రవరి 6న ఆడే తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. రెండో టీ20 ఫిబ్రవరి 8న ఆక్లాండ్‌లో మూడో టీ20 ఫిబ్రవరి 10న హామిల్టన్‌లో జరుగనుంది.

న్యూజిలాండ్ జట్టు: కేన్ విలియమ్సన్(కెప్టెన్), డోగ్ బ్రేస్‌వెల్, కోలిన్ డి గ్రాండొమ్మి, లాకీ ఫెర్గుసన్ (తొలి, చివరి మ్యాచ్‌కు), మార్టిన్ గుప్టిల్, స్కాట్ కుగ్గెలిజిన్, డెరిల్ మిచెల్, కోలిన్ మన్రో, మిచెల్ సాంట్నర్, టిమ్ సీఫెర్ట్ (వి.కీ), ఐష్ సోధీ, టిమ్ సౌథీ, రాస్ టేలర్, బ్లేర్ టిక్‌నెర్ (చివరి మ్యాచ్‌కు)

ఫ్రాన్స్‌తో హాకీ సిరీస్‌కు జూనియర్ క్రీడాకారిణుల జట్టు



న్యూఢిల్లీ: ఫ్రాన్స్‌తో నాలుగు వ్యాచుల హాకీ సిరీస్ ఆడనున్న జూనియర్ బాలికల జట్టును హాకీ ఇండియా ప్రకటించింది. జూనియర్ జట్టు ఫిబ్రవరి 8 నుంచి 13 వరకు ఈ సిరీస్ లక్నో, గోరక్‌పూర్‌లు వేదికగా ఈ వ్యాచులు ఆడనుంది. బుధవారం హాకీ ఇండియా 20 మంది క్రీడాకారిణులతో కూడిన జాబితాను మీడియాకు విడుదల చేసింది. తొలి వ్యాచ్ ఫిబ్రవరి 8న, రెండో వ్యాచ్ 9న లక్నోలోని మహ్మద్ షహీద్ సింథటిక్ హాకీ స్టేడియంలో జరుగనున్నాయి. 11న జరుగనున్న మూడో వ్యాచ్ గోరక్‌పూర్‌లోని వీరబహదూర్ సింగ్ స్పోర్ట్స్ కాలేజ్ మైదానంలో జరుగనుంది. నాలుగో వ్యాచ్ తిరిగి లక్నోలో 13న నిర్వహిస్తారు. భారత జట్టుకు సలీమా టెటె కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ప్రస్తుత సీనియర్ జట్టుతో స్పెయిన్ పర్యటనలో ఉన్న యువ క్రీడాకారిణి లాల్‌రెమ్‌సియామి వైస్ కెప్టెన్‌గా త్వరలో జట్టుతో త్వరలో కలువనుంది. ఫ్రాన్స్‌తో ఆడే వ్యాచులు భారత జూనియర్ క్రీడాకారిణులకు ఫిట్‌నెస్‌ను అందించడమేకాక, విభిన్న మ్యాచ్ పరిస్థితుల్లో ఏవిధంగా ఆడాల్సి ఉంటుందన్న అనుభ వాన్ని కూడా వారికి నేర్పుతుంది. అంతేకాక, పెద్ద సవాళ్లను ఎదుర్కొనేందుకు క్రీడాకారిణుల్లో ఆత్మ విశ్వా సాన్ని పెంపొందిస్తుదని కోచ్ బల్జీత్ సింగ్ అన్నాడు.

జట్టు

గోల్ కీపర్స్: బిచు దేవి ఖారిభం, కుష్బూ

డిఫెండర్స్: ఫిలిసియా టొప్పొ, గగన్‌దీప్ కౌర్, సలీమా టెటె, ప్రియాంక, సుమన్ దేవి తౌడమ్, ఇషికా చౌదరీ. **మిడ్ ఫీల్డర్స్:** మహిమా చౌదరీ, ప్రభ్‌లీన్ కౌర్, మారియానా కుజుర్, రీట్, బల్జీత్ కౌర్, ప్రీతి

ఫార్వార్డ్ క్రీడాకారిణులు: లాల్‌రెమ్ సియామి, షర్మిలా దేవి, ముంతాజ్ ఖాన్, జీవన్ కిషోరి టొప్పొ, అజ్మీనా కుజుర్, జ్యోతి.

మాజీ టెస్ట్ అంపైర్ దోతీవాలా కన్నుమూత

ముంబై: మాజీ అంపైర్ దారా దోతీవాలా(85 ఏళ్లు) బుధవారం కన్నుమూశారు. 1986లో చెన్నై వేదికగా భారత్- ఆస్ట్రేలియా మధ్య సాగిన టెస్ట్‌మ్యాచ్‌కు దోతీవాలా అంపైర్‌గా వ్యవహరించాడు. 1930, అక్టోబర్ 30న జన్మించిన దోతీవాలా 1982 నుంచి 1987వరకు ఆరు టెస్టులకు అంపైర్‌గా పనిచేశాడు. వయోభారంతో దోతీవాలా తన నివాసంలో బుధవారం సాయంత్రం కన్నుమూశాడు అని అతని అల్లుడు ఆది మిస్త్రీ మీడియాకు తెలిపాడు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.